అనుదినం... జనస్వరం


www.navatelangana.com


నవతెలంగాణ

సోమవారం 02-09-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 245 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50





హుస్సేన్ సాగర్‌లో వరద ఉధృతి..



జలదిగ్బంధం

పలు జిల్లాల్లో భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

తెగిన రోడ్లు, రాకపోకలకు అంతరాయం

లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం

చెరువులను తలపిస్తున్న రహదారులు

మున్నేరు వాగు ఉధృతితో నీటమునిగిన 'ఖమ్మం'

కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్.. నిలిచిపోయిన రైళ్లు

వరదలో చిక్కుకుపోయిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణీకులు సురక్షితం

సహాయక చర్యల్లో అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

వరదల్లో చిక్కుకొని 10మంది మృతి

రాష్ట్రం జలదిగ్బంధనంలో చిక్కుకుంది. వర్షాలు, వరదల ధాటికి జనం బెంబేలెత్తు తున్నారు. చెరువులకు గండ్లు పడ్డాయి. రైల్వేట్రాక్‌లు కొట్టుకుపోయాయి. పదిమంది మృత్యువాత పడ్డారు. మూగజీవాల సంగతి సరేసరి. అనేకమంది నిరాశ్రయులయ్యారు. పంట పొలాల్లో ఇసుక, బురద మేటవేసింది. ప్రకృతి ప్రకోపాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం సహాయ చర్యల్ని చేపట్టింది. విద్యుత్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, నీటి పారుదల శాఖలు సహాయక చర్యల్ని చేపట్టాయి. భారీ వర్షాలు వాటికీ ఆటంకంగా మారాయి. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరిపి, దిశానిర్దేశం చేస్తున్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. ప్రభుత్వోద్యోగులందరికీ సెలవుల్ని రద్దు చేశారు. సహాయ చర్యల్లో భాగస్వాములు కావాలని ప్రభుత్వం వారిని ఆదేశించింది. సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

నవతెలంగాణ-మఫిషల్ యంత్రాంగం

ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయనుకునేలోపే మళ్లీ నిమిషాల్లో వాతావరణంలో మార్పులు వచ్చి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే సాధారణం కంటే ఎక్కువ శాతం వర్షాలు కురవడంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ప్రజలు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలతో పలు చోట్ల పంటలు దెబ్బతినగా... రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రహదారులన్నీ చెరువులను తలపిస్తుండగా, లోతట్టు ప్రాంతాలన్నీ మునిగిపోయాయి.

వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంతోపాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరుతోంది. దాంతో గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని మున్నేరు వాగులోకి భారీగా వరదనీరు చేరుతుండటంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఖమ్మం నగరం జలదిగ్బంధంలో ఉంది. పలు కాలనీలను వరద చుట్టు ముట్టడంతో ప్రజలు సహాయకచర్యల కోసం ఎదురు చూస్తున్నారు. రైల్వే ట్రాకులు నీట మునిగిపోవడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

'ఖమ్మం'లో వరద బీభత్సం

ఖమ్మం జిల్లాలో చరిత్రలో కునివినీ ఎరుగని రీతిలో వరద బీభత్సం సృష్టించింది. దాదాపు 5000 ఇండ్లు నీట మునిగాయి. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. కరుణగిరి ప్రాంతంలో 200పైగా ఇండ్లు పూర్తిగా మునిగిపోయాయి. కవిరాజ్‌నగర్ కాలనీ, ఇల్లందు క్రాస్‌రోడ్డు, జేసీ మాల్, సీఎంఆర్ మాల్, కోర్టు ఎదురుగా పెట్రోల్ బంక్ ప్రాంతాలు, మైసమ్మ గుడి వెనక ప్రాంతం, ఎస్సార్ కాలేజీ, నాగార్జున ఫంక్షన్ హాల్ ప్రాంతాలు నీటమునిగాయి.లో రాజీవ్ గృహకల్ప కాలనీని మున్నేరు వరద ముంచెత్తింది. ఓ అపార్టుమెంట్‌లో కుటుంబం చిక్కుకోగా.. వారిలో పిల్లలతో పాటు మహిళ, వృద్ధురాలు ఉన్నారు. వరద చుట్టుముట్టిన ఇంటి నుంచి రక్షించాలని బాధితులు అర్త నాదాలు చేస్తున్నారు. వెంకటేశ్వరనగర్‌లో ఓ ఇంటిలోకి నీరు చేరడంతో వారంతా ...14లో

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రభుత్వ ప్రకటన

వివరాలు 5లో



24 గంటలు అప్రమత్తంగా ఉండండి

అధికారులకు సీఎం ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ...3లో

సీఎంకు పీఎం ఫోన్

వరదలపై ఆరా...



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోన్ చేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరద పరిస్థితులు, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో వర్షప్రభావ తీవ్రతను సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానికి వివరించారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తక్షణ సహాయక చర్యలు, తీసుకున్న జాగ్రత్తలను వివరించారు. ప్రాణనష్టం జరక్కుండా యావత్ ప్రభుత్వ యంత్రాంగం సహాయకచర్యల్లో పనిచేస్తున్నదని ఈ సందర్భంగా ప్రధానికి ...6లో

విధులకు వెళ్తూ మృత్యుఒడిలోకి యువసైంటిస్టు

ఆకేరు వాగులో కొట్టుకుపోయిన కారు కుమార్తె కోసం వెళ్తూ తండ్రి కూడా గల్లంతు ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాలో విషాదం.. 5లో..

మళ్లీ బాదుడు షురూ

కమర్షియల్ గ్యాస్ బండపై రూ.39 పెంపు



న్యూఢిల్లీ : వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరను చమురు మార్కెటింగ్ కంపెనీలు సవరించాయి. 19 కిలోల సిలిండర్ ధర రాజధాని ఢిల్లీలో రూ.39 పెరిగింది. పెరిగిన ధరలు ఆదివారం నుండే అమలులోకి వచ్చాయి. ఈ పెంపుదలతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1,691.50కి చేరింది. వాణిజ్య సిలిండర్ ధర గత నెలలో రూ.30 తగ్గిన విషయం తెలిసిందే. అంతకుముందు జూన్‌లో కూడా సిలిండర్ ధర రూ.69.50 తగ్గింది. మేలో సైతం రూ.19 తగ్గింది. జూన్‌లో రిటైల్ ధర రూ.1,676కు చేరింది. తాజా పెరుగుదలతో వాణిజ్య సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,691.50, కోల్‌కతాలో రూ.1,802.50, ముంబయిలో రూ.1,644, చెన్నయ్‌లో రూ.1,855కు చేరింది. ప్రతి నెలా ప్రారంభంలో వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలు ...13లో

సినీ పరిశ్రమలో పవర్ గ్రూప్ లేదు : మమ్ముట్టి

హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తూ పోస్ట్

సిఫారసుల అమలుకు చర్యలు తీసుకోవాలని సూచన



తిరువనంతపురం : మళయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు సహా పలు అంశాలకు సంబంధించి హేమ కమిటీ ఇచ్చిన నివేదికపై సూపర్ స్టార్ మమ్ముట్టి స్పందించారు. కమిటీ నివేదికపై ప్రముఖ నటుడు మోహన్ లాల్ మౌనం వీడిన మరునాడే మమ్ముట్టి పెదవి విప్పారు. హేమ కమిటీ నివేదికను మమ్ముట్టి స్వాగతించారు. తన ...13లో

గురుకులాల్లో బువ్వ పెట్టలేని దుస్థితి

23 ఫుడ్ పాయిజన్ సంఘటనలు, 715 మంది విద్యార్థులు అస్వస్థత

గురుకుల పాఠశాలలో ఎలుకలు కరిచినా వైద్యం అందించలేని పరిస్థితి

పాఠశాలను సందర్శించిన బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల బృందం



వివరాలు 13లో

కులం పేరుతో దూషించడం నేరం

విద్యార్థులు ఆందోళన చెందొద్దు

ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు


పాలమాకుల కేజీబీవీ సందర్శన



టీచర్‌ను సస్పెండ్ చేసి, కేసు నమోదు చేయండి :ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకయ్య ఆదేశం

వివరాలు 13లో

బెజవాడ గజగజ



ముంచెత్తిన బుడమేరు..జల దిగ్బంధనంలో నగరం

వరదలో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం

యువకుడు గల్లంతు..ఘాట్ రోడ్లపై విరిగిపడిన కొండ చరియలు

విజయవాడ : భారీ వర్షాలకు విజయవాడ పూర్తి జల దిగ్బంధంలో చిక్కుకుపోయింది. నడుం లోతు నీటిలో నగరం తేలియాడుతోంది. గత 20 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ముంపునకు గురైంది. ఆదివారం ఉదయం ఊహించని విధంగా వచ్చిన బుడమేరు వరద ఉధృతితో పరిసర ప్రాంతాల్లోని వేలాది ఇండ్లలోకి భారీగా నీరు చేరింది. విద్యుత్తు సౌకర్యం నిలిచిపోవడంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. మంచినీరు, ఆహారం కోసం అలమటిస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని బుడమేరు వరద చుట్టుముట్టింది. సుమారు ఎనిమిది డివిజన్లలోని 30 వేల కుటుంబాలకు చెందిన లక్ష మందికిపైగా ప్రజలు వరదలో నీటిలో చిక్కుకుపోయారు. ఐదారు అడుగుల ఎత్తు వరకూ ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. కొన్ని ఇళ్లలోకి వరద నీరు చేరింది. సుమారు పది గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆయా గ్రామాలతోపాటు నగరంలోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు చిమ్మచీకట్లో గడుపు తున్నారు. వరద ప్రాంతంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. బాధితులను తక్షణం ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముందస్తు సమాచారం లేకుండానే గేట్లు ఎత్తివేత

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బుడమేరుకు భారీ వరద రావడంతో ఎన్‌టిఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలే రు రెగ్యులేటర్ వద్ద అధికారులు ఒక్కసారిగా గేట్లు ఎత్తివేశారు. బుడమేరు వరద నీరు ఫెర్రీ వద్ద కృష్ణా నదిలోకి వెళ్లే విధంగా పదిహేనేండ్ల క్రితమే మళ్లించారు. అయితే, ప్రస్తుతం కృష్ణా నది తీవ్ర ఉగ్రరూపం దాల్చి పోటెత్తి ప్రవహిస్తుండడంతో ఫెర్రీ వద్ద నీరు వెనక్కి ఎగదన్నుతోంది. దీనికితోడు తెలంగాణ నుండి వచ్చే వాగుల ...13లో





దేశంలో ఉధృతంగా రైతాంగ పోరాటాలు

ప్రజలను చీల్చుతున్న మతోన్మాదంపై సమరం

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్

2014 నుంచి 2024 వరకు రైతాంగ సంక్షోభం

పదేండ్లలో 4లక్షలకు పైగా ఆత్మహత్యలు

మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాట ఫలితమే బీజేపీ ఓటమి

చంద్రబాబు, నితీష్ మద్దతుతో కొనసాగుతున్న మోడీ ప్రభుత్వం

నవంబర్ 15 నుంచి ఆందోళనలు, 26న చలో ఢిల్లీ

రెండో రోజు కొనసాగిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

దేశ వ్యాప్తంగా రైతాంగ పోరాటాలు ఉధృతంగా సాగుతున్నాయని ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ తెలిపారు. సరళీకరణ, ప్రజలను చీల్చుతున్న మతోన్మాదంపై సమరం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2014 నుంచి 2024 వరకు 4.32 లక్షల మంది రైతులు, వలస కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. వీరిలో 1.12 లక్షల మంది రైతులు ఉంటే, 3.20 లక్షల మంది వలస కార్మికులు ఉన్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని రాందాస్‌పల్లి గేటు సమీపంలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో రెండు రోజులుగా రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం 'వ్యవసాయ రంగం-సవాళ్లు- ప్రత్యామ్నాయం' ...5లో

వందేభారత్‌లో బీజేపీ కార్యకర్తల వెకిలి చేష్టలు

మహిళను అడ్డుకొని అమర్యాదకర, అసభ్య ప్రవర్తన

సోషల్ మీడియాలో వీడియో వైరల్

ప్రధాని మోడీ ప్రారంభించిన స్వల్పవ్యవధిలోనే..



న్యూఢిల్లీ : వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. మహిళా ప్రయాణీకురాలితో పాటు ఆమెతో ఉన్న వ్యక్తితో అసభ్యంగా ప్రవర్తించారు. వారిని వేధించారు. ఈ విషయాన్ని సదరు బాధిత మహిళ అదే రైలులో మీడియాకు తెలిపారు. శనివారం ప్రధాని మోడీ ప్రారంభించిన మీరట్-లక్నో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ ఘటన చోటు చేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. నెటిజన్లతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ఈ ఘటనపై ...13లో

గాజాలో పోలియో టీకా కార్యక్రమం ప్రారంభం



జెరూసలేం : గాజా స్ట్రిప్‌లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో పోలియో టీకాల కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. ఐక్య రాజ్యసమితి విజ్ఞప్తి మేరకు ఇరుపక్షాలు 'మానవతా విరామం' ప్రకటించడంతో టీకాల కార్య క్రమానికి మార్గం సుగమమైనట్లు గాజా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఇజ్రాయిల్ గత 11 మాసాలుగా సాగిస్తున్న దాడులు, మానవతా సాయం అందకుండా విధించిన ఆంక్షల మూలంగా దాదాపు 25 ఏళ్ల తరువాత గాజాలో పిల్లలు పోలియో బారిన పడుతు న్నారు. గత నెలలో ఇక్కడ తొలి పోలియో కేసు నమోదైంది. సెంట్రల్ గాజాలోని మూడు ఆరోగ్య కేంద్రాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు టీకాల కార్యక్రమం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 12 లక్షలకు పైగా వ్యాక్సిన్‌లు గాజాకు చేరుకు న్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. 6,40,000 మంది పదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్‌ను పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే..

- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

విశాఖపట్నం : పార్లమెంటులో ఎటువంటి చర్చా లేకుండా 2020 సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ డిమాండ్ చేశారు. వాటి రద్దుకు ఈ నెల 23న దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే పాటించనున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రంలో మూడు రోజులపాటు తలపెట్టిన ఎఐటియుసి ఆలిండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాలపాటు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోవిడ్ సమయంలో చాపచుట్టేసి, కంపెనీల యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ఆ విషయమై కార్మిక సంఘాలతో కనీసం చర్చించలేదని తెలిపారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ 2020 నవంబర్ 26న రైతాంగం 'ఢిల్లీ మార్చ్' ఏ విధంగానైతే చేపట్టిందో ఈ ఏడాది నవంబర్ 26న అఖిల భారత సమ్మెకు అదే విధంగా కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయని తెలిపారు. ఆ సమ్మెలో రైతులు, కార్మికులు భారీగా పాల్గొంటారని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి కార్పొరేట్ స్నేహితుల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. పెద్ద ఎత్తున ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడు తోందన్నారు. ప్రజల సొమ్ముతో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు విక్రయించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 1297 రోజులుగా కార్మికులు చేస్తున్న పోరాటం చిరస్మరణీయమైనదన్నారు. త్యాగాల ఫలితంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైందని ఉద్ఘాటించారు. కేంద్రంలో బిజెపి మైనారిటీ ప్రభుత్వం ఉందని, దానికి రాష్ట్రంలోని టిడిపి మద్దతు ఇస్తోందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మంచి ప్యాకేజీ వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేత, సొంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనంపై ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షులు రామేంద్ర కుమార్, ఎపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోస్టల్ స్కాలర్‌షిప్‌లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ గుర్తింపు పొందిన హైస్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు పోస్టల్‌శాఖ స్కాలర్ షిప్‌లు అందిస్తుందని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ హెచ్ శరత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన పథకం ద్వారా ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సంవత్సరానికి రూ.ఆరువేల చొప్పున స్కాలర్‌షిప్‌లు ఇస్తారు. ప్రతి మూడునెలలకు రూ.1,500 చొప్పున అర్హులైన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందుతుంది. ప్రతి తరగతిలో ఉత్తమ అకడెమిక్ రికార్డు ఉన్న పది మంది విద్యార్థులు మాత్రమే అర్హులు. ఆయా హైస్కూళ్ళకు చెందిన విద్యార్థులు సెప్టెంబర్ 13వ తేదీ లోపు సమీప పోస్టాఫీసు లేదా www.indiapost.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ స్కీంకు సంబంధించిన ఇతర వివరాలు కూడా వెబ్‌సైట్‌లో ఉంటాయని శరత్‌కుమార్ తెలిపారు.

హర్యానా గేమ్ ఛేంజర్ వినేశ్..?

రాజకీయ ఇన్నింగ్స్‌పై చర్చ

ఛండీగఢ్: హర్యానాలో అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ అయ్యింది. అయితే ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేయడమే కాకుండా ఎన్నికల ఫలితాల్లో అనేక అంశాలు గేమ్ ఛేంజర్‌గా మారే అవకాశాలున్నాయి. వీటిలో ప్రస్తుత బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, రైతులు, మల్లయోధుల ఆందోళనలు, ప్రభుత్వ ఉద్యోగుల్లో అసంతృప్తి, జాట్ కమ్యూనిటీ మొదలైనవి కీలకపాత్ర పోషించనున్నాయి. ఈ ప్రధాన సమస్యల మధ్య.. ఈ ఎన్నికల్లో రెజ్లర్ వినేశ్ ఫోగట్ కూడా రాజకీయ రంగ ప్రవేశం చేయవచ్చనే ఊహాగానాలు అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

వినేశ్ ఫోగట్ కుటుంబం రాజకీయాల్లో క్రియాశీలకంగానే..

వినేశ్ సోదరుని భార్య బబితా ఫోగట్ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టిక్కెట్‌పై దాద్రీ స్థానం నుంచి పోటీ చేశారు. అయితే వినేశ్ రెజ్లర్‌లపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సాగించిన ఆందోళనలు రాజకీయంగా బీజేపీని ఇరుకున పెట్టాయి. ఈ నేపథ్యంలో దాయాదుల మధ్య రాజకీయ విభేదాలు కూడా బయటపడ్డాయి. బబిత, ఆమె భర్త సోషల్ మీడియాలో వినేశ్‌ను పరోక్షంగా లక్ష్యంగా చేసుకున్నారు. దీని కారణంగా ఇద్దరి మధ్య విభేదాలు మరింత స్పష్టంగా కనిపించాయి.

హర్యానాలో వినేశ్ వర్సెస్ బబిత...

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే వినేశ్ కనుక ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంటే రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు మారిపోయే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 2019లో బబిత పోటీ చేసిన దాద్రీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బబితపై ఆమె పోటీ పడవచ్చని సబంధిత వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో మల్లయోధులు, ప్రతిపక్ష పార్టీలు బ్రిజ్ భూషణ్ సమస్యను సజీవంగా ఉంచాయి. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ , బజరంగ్ పునియాతో సహా చాలా మంది రెజ్లర్లు పాల్గొన్నారు. బజరంగ్ పునియా నిరసనకు చిహ్నంగా తన పద్మశ్రీని కూడా తిరిగి ఇచ్చాడు. ఇది గత లోక్‌సభ ఎన్నికలను కూడా ప్రభావితం చేసింది. ప్రస్తుత హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కూడా కీలక అంశంగా మారనుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

రైతుల ఆందోళనకు వినేశ్ ఫోగట్ మద్దతుతో..

శంభు సరిహద్దు వద్ద రైతు ఉద్యమం ప్రారంభమై 200 రోజులకు చేరిన సందర్భంగా.. వినేశ్ ఫోగట్ రైతుల వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. జింద్, రోహ్‌తక్‌లోని ఖాప్ పంచాయతీ నాయకులను కలిశారు. జింద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినేశ్ తన రాజకీయ ప్రవేశం గురించి మాట్లాడుతూ... "నా మనస్సు స్పష్టంగా ఉన్నప్పుడు, నేను ఏమి చేయాలో ఆలోచిస్తాను. ఎందుకంటే నేను ఇంకా తీవ్ర షాక్‌లో ఉన్నాను". అని వివరించారు.



బ్రిజ్‌భూషణ్ వివాద ప్రభావం..

బ్రిజ్‌భూషణ్ వివాదం హర్యానా రాజకీయాల్లో లోతుగా పాతుకుపోయింది. ఈ అంశం లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రస్తావనకు రావడంతో కాంగ్రెస్ వ్యూహంలో భాగమైంది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇది ఓ ప్రధాన అంశంగా మారనుందా? అన్నది హాట్ టాపిక్‌గా మారింది.

బ్రిజ్ భూషణ్ వివాదంపై బబితా ఫోగట్ ఏమన్నారు?

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో వినేశ్ ఫోగట్ చురుకుగా పాల్గొన్నారు. అయితే ఈ రెజ్లర్ల ఉద్యమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారని బబితా ఫోగట్ ఆరోపించారు. వినేశ్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, ఒకవేళ ఆమె ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకుంటే, దాద్రీ అసెంబ్లీ స్థానంలో పోటీకి దిగే అవకాశం ఉందని కూడా చెబుతున్నారు.

జాట్, రైతు సంఘాల పాత్ర

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లాభం చేకూర్చడంటో జాట్ సామాజిక వర్గం, రైతుల ఓట్లు కలిసివచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో 42 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పైచేయి సాధించింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో హర్యానా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేసినట్టు సూచించింది. ఈ అసంతృప్తి పరివార్ పెహచాన్ పత్ర పథకం కింద జరుగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియ పట్ల విముఖతతో ఉన్న గ్రామ సర్పంచ్‌లు, సాధారణ రైతులలో కూడా కనిపిస్తోంది. హర్యానాలో బీజేపీకి వ్యతిరేకంగా వీస్తున్న పవనాలు.. కేవలం జాట్‌లు, రైతులకు మాత్రమే పరిమితం కాదు. మల్లయోధులు, సర్పంచ్‌లు కూడా డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. 2019లో 10 లోక్‌సభ స్థానాలు ఉన్నప్పటికీ, ఒక్క జాట్ నాయకుడిని కూడా కేంద్ర ప్రభుత్వంలో చేర్చుకోలేదు. 2014 నుంచి ఏ జాట్ నేతనూ ముఖ్యమంత్రిని చేయలేదనే కోపం ఆ వర్గంలో రగులుతోంది.

కాంగ్రెస్‌లో చేరతారనే ఊహాగానాలు

వినేశ్ ఫోగట్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తే ఆమె కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఖాఫ్ పంచాయితీలు వినేశ్‌కు బంగారు పతకాన్ని ప్రదానం చేశాయి. నేను కష్టాల్లో ఉన్నప్పుడు రైతులు నన్ను ఆదుకున్నారు' అని ఆమె అన్నారు. కాంగ్రెస్ కూడా వినేశ్‌ను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టింది. ఆమె రెజ్లింగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించగానే కాంగ్రెస్ ఎంపీ, మాజీ సీఎం భూపేంద్ర సింగ్ హుడా వినేశ్‌ను రాజ్యసభకు పంపాలని డిమాండ్ చేశారు, అయితే ఆమె వయస్సు కారణంగా ఇది సాధ్యం కాదని విశ్లేషకులు అంటున్నారు. అయితే వినేశ్ ఫోగట్ రాజకీయ ప్రవేశం హర్యానా రాజకీయాల్లో పెద్ద మార్పును తీసుకురాగలదనన్న చర్చ నడుస్తోంది. ఖాఫ్ పంచాయితీలు, రైతులతో బలమైన సంబంధాలతో ఆమెకు ఎన్నికలలో విస్తృత మద్దతు లభించే అవకాశాలున్నాయి.

వినేశ్ రాజకీయాల్లోకి వస్తున్నట్టు అధికారికంగా ప్రకటించనప్పటికీ.. ఆమెను ఆకర్షించేందుకు రాజకీయ వర్గాలు ప్రయత్నిస్తున్నాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వినేశ్ ఫోగట్ పాత్ర హర్యానా రాజకీయాల్లో కీలక మలుపుగా మారనుంది.

ముగ్గురు స్టార్ క్యాంపెయినర్లు

తొలి దశ ఎన్నికలలో రాహుల్ గాంధీ, ప్రియాంక, ఖర్గే

జమ్ముకాశ్మీర్ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురు స్టార్ క్యాంపెయినర్లను రంగంలో దింపాలని నిర్ణయించింది. తొలి దశ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ 4న జమ్మూకాశ్మీర్‌లో భారీ ర్యాలీల్లో ప్రసంగించనున్నారు. జమ్మూలోని బనిహాల్‌లో భారీ ర్యాలీకి కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. అలానే దక్షిణ కాశ్మీర్‌లోని దూరులో కూడా పార్టీ ఇదే కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తోంది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్ పోటీచేస్తున్నారు. కాగా జమ్మూ కాశ్మీర్‌లో కాంగ్రెస్ తరపున ప్రచారం చేయడం ప్రియాంక గాంధీకి ఇదే తొలిసారి.

రెండో దశలో రోడ్ షో

జమ్మూ ప్రావిన్స్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ అభిప్రాయపడింది. బీజేపీ మద్దతుతో కూడిన గవర్నర్ పాలనపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇది కాంగ్రెస్‌కు ప్లస్ అవుతుందని ఆ పార్టీ నేతలు అంచనాలు వేస్తున్నారు.అందువల్ల మొదటి దశలో ర్యాలీలతో ప్రారంభించి, తదుపరి రెండుదశల్లో మరిన్ని ర్యాలీలు , రోడ్ షోలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



బీజేపీ ప్రచారానికి..

బీజేపీ తరపున ప్రచారానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర సీనియర్ నేతల కోసం ర్యాలీలు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పలువురు బీజేపీ నేతలు కాశ్మీర్‌లో మకాం వేశారు.



మూడు నెలల్లో వందే భారత్ స్లీపర్ రైళ్లు

బీఈఎంఎల్ ఫెసిలిటీలో ప్రారంభించిన అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ : వందే భారత్ స్లీపర్ కోచ్ ప్రొటోటైప్ వెర్షన్‌ను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదివారం ఆవిష్కరించారు. బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) ఫెసిలిటీలో వీటిని ప్రారంభించారు. వందే భారత్ చైర్ కార్ విజయవంతమైన తర్వాత, వందే భారత్ స్లీపర్ కోసం చాలా శ్రమించామని అన్నారు. వీటి తయారీ ఇప్పుడే పూర్తయిందని, పది రోజుల పాటు వీటిపై కఠినమైన ట్రయల్స్, టెస్ట్‌లు నిర్వహించనున్నామని వైష్ణవ్ చెప్పారు. రానున్న మూడు నెలల్లో ప్రయాణికులకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం వస్తుందని తెలిపారు. బీఈఎంఎల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వందే భారత్ తయారీ కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు.


జేడీయూకి షాక్

పార్టీ పదవికి త్యాగి గుడ్‌బై

కేంద్రంపై విమర్శలే కారణం ?



పాట్నా : బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని అధికార జేడీయూ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పార్టీ ప్రతినిధి, సీనియర్ నేత జేడీ త్యాగి తన పదవికి రాజీనామా చేశారు. బీజేపీతో పార్టీకి ఉన్న విభేదాలపై ఆయన తరచూ గొంతు విప్పడం జేడీయూ నాయకత్వం జీర్ణించుకోలేక పోతోంది. త్యాగి రాజీనామా చేసిన విషయాన్ని జేడీయూ ఆదివారం ధ్రువీకరించింది. జేడీయూ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పార్టీ జాతీయ ప్రతినిధిగా రాజీవ్ రంజన్ ప్రసాద్‌ను నియమించారని తెలిపింది. త్యాగి వ్యక్తిగత కారణాలతో పార్టీ పదవికి రాజీనామా చేశారని జేడీయూ చెబుతోంది. అయితే కారణాలు మాత్రం వేరే ఉన్నాయి. ఆయన ఢిల్లీలో తరచూ చేస్తున్న వ్యాఖ్యలకు జాతీయ మీడియాలో విశేష ప్రాచుర్యం లభిస్తోంది. ఓ ప్రాంతీయ పార్టీ నాయకుడికి జాతీయ స్థాయిలో ఈ విధమైన ప్రాధాన్యత లభించడం అరుదుగానే జరుగుతుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తరచూ చేస్తున్న విమర్శలు బీజేపీ–జేడీయూ సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి, వక్ఫ్ (సవరణ) బిల్లు, పాలస్తీనాపై మోడీ ప్రభుత్వ వైఖరి...ఇలా పలు వివాదాస్పద అంశాలపై త్యాగి తన వ్యాఖ్యలతో అటు కేంద్రాన్ని, ఇటు పార్టీని ఇబ్బంది పెడుతున్నారు. త్యాగి వ్యాఖ్యలు బీజేపీని ఇరకాటంలోకి నెడుతున్నాయని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. త్యాగి రాజీనామా నేపథ్యంలో ఢిల్లీలో పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న కేంద్ర మంత్రి లలన్ సింగ్, జేడీయూ పార్లమెంటరీ పార్టీ నేత సంజయ్ ఝాలకు పరిస్థితిని చక్కదిద్దే బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. అధికార కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం, సామరస్యం ఉండేలా చూసేందుకు, విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలను తిప్పికొట్టేందుకు మిత్ర పక్షాలతో సంప్రదింపులు జరుపుతున్నామని బీజేపీ వర్గాలు తెలిపాయి.



కేంద్రానికి అగ్ని పరీక్ష

వక్ఫ్ బిల్లులో వివాదాస్పద ని'బంధనాలు'

మండిపడుతున్న ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు

- ఆస్తులు హస్తగతం చేసుకునేందుకేనని ఆగ్రహం

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ (సవరణ) బిల్లు మోడీ 3.0 ప్రభుత్వానికి అగ్ని పరీక్ష కాబోతోంది. ప్రతిపక్ష పార్టీలు, ముస్లిం మైనారిటీ సంస్థలు సహా పలువురు ఈ బిల్లుపై ఇప్పటికే తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం దీనిని పరిశీలన నిమిత్తం ఈ నెల 8న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించింది. బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని 31 మంది సభ్యుల జేపీసీ దీనిపై రెండు సమావేశాలు నిర్వహించింది.

డిసెంబరులో జరిగే పార్లమెంట్ తదుపరి సమావేశాల్లో జేపీసీ తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. వక్ఫ్ ఆస్తులను సమర్థవంతంగా నిర్వహించేందుకు, వక్ఫ్ వ్యవహారాలు సక్రమంగా సాగేందుకు ఈ బిల్లును ప్రతిపాదించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ముస్లిం సమాజపు స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బతీసేందుకే ప్రభుత్వం ఈ చర్యకు పూనుకున్నదని ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చడం, జిల్లా కలెక్టర్లకు మరిన్ని అధికారాలు కట్టబెట్టడం సహా ప్రతిపాదిత బిల్లులోని పలు నిబంధనలను అనేక మంది వ్యతిరేకిస్తున్నారు.

కీలక సవరణలు ఇవే

1955వ సంవత్సరపు వక్ఫ్ చట్టానికి వివాదాస్పద బిల్లు 44 సవరణలు ప్రతిపాదించింది. మాతృ చట్టం పేరును మార్చాలన్నది అందులో ఒకటి. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యులను చేర్చాలన్న ప్రతిపాదనపై విస్తృత చర్చ జరుగుతోంది. సీఈఓ నియామకం, ఆయన పదవీకాలానికి సంబంధించిన సెక్షన్ 23ను సవరించాలని కూడా ఈ బిల్లు ప్రతిపాదించింది. సీఈఓగా ముస్లిం వ్యక్తినే నియమించాలన్న నిబంధనను తొలగించాలని అందులో ప్రతిపాదించారు. పైగా సీఈఓగా నియమితుడయ్యే వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదా కంటే తక్కువ ర్యాంక్ ఉండకూడదు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో కనీసం ఇద్దరు మహిళలు ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ముస్లిమేతర సభ్యులను బోర్డులో నియమిస్తుంది. సెంట్రల్ కౌన్సిల్‌లో ఉండే ఎంపీలు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖులు ముస్లింలు కానక్కరలేదు. అయితే దేవాలయ బోర్డుల్లో హిందూ యేతరులకు అనుమతించడం లేదని, అదే నిబంధన ముస్లిములకూ వర్తింపజేయాలని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి.

ఏదైనా ఒక ఆస్తి వక్ఫ్‌దా లేక ప్రభుత్వానిదా అనేది నిర్ణయించే విషయంలో జిల్లా కలెక్టర్లకు విశేషాధికారాలు కల్పించారు. వక్ఫ్ చట్టం ప్రకారం ఇందుకోసం సర్వే కమిషనర్‌ను, అదనపు కమిషనర్లను నియమించాల్సి ఉంటుంది. చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం ప్రకారం ఏదైనా ఒక ఆస్తి వక్ఫ్‌దా కాదా అనేది నిర్ణయించాల్సింది రాష్ట్ర వక్ఫ్ బోర్డే. తాజా సవరణలో ఆ సెక్షన్‌ను రద్దు చేశారు. సవరణ బిల్లులో మరో వివాదాస్పద ప్రతిపాదన కూడా ఉంది. ఇస్లాంను కనీసం ఐదు సంవత్సరాలు ఆచరించే వ్యక్తి మాత్రమే వక్ఫ్‌ను ఏర్పాటు చేయాలి. చట్టంలో ఈ నిబంధన లేదు.

ట్రిబ్యునల్ కూర్పును కూడా నూతన బిల్లు సవరించింది. దీని ప్రకారం ట్రిబ్యునల్‌లో జిల్లా జడ్జి, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదా కలిగిన అధికారి సభ్యులుగా ఉంటారు. ట్రిబ్యునల్ నిర్ణయాలను 90 రోజుల్లోగా హైకోర్టులో సవాలు చేయవచ్చు. వక్ఫ్ ఆస్తిని ప్రభుత్వ ఆస్తిగా జిల్లా కలెక్టర్ భావిస్తే ఆయన దానిని రెవెన్యూ రికార్డులో అప్‌డేట్ చేయవచ్చు.

సవరణలపై ఆగ్రహం

ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైనదని, రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు మండిపడుతున్నాయి. బిల్లును ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, పలు ముస్లిం సంస్థలు ప్రభుత్వాన్ని ఇటీవలే డిమాండ్ చేశాయి. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరుల ప్రాతినిధ్యం పెరగడం, ట్రస్టీల పాత్రను మార్చడం, వివాదాల పరిష్కారం విషయంలో చేసిన మార్పులు వంటివి వక్ఫ్ ఆస్తుల రక్షణకు ముప్పుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశాయి. సవరణ బిల్లుపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వక్ఫ్ ఆస్తులు ప్రైవేటువని, అవి ప్రభుత్వానికి చెందినవి కావని చురక వేశారు. ముస్లిం సమాజాల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఆరోపించాయి.

నిరంతర అధ్యయనశీలి వీఎస్ రావు

కష్టకాలంలో యూనియన్‌ను సమర్థవంతంగా నడిపారు : ఉద్యోగ విరమణ అభినందన సభలో పలు సంఘాల నేతలు



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు నిరంతర అధ్యయనశీలి అని పలు సంఘాల నేతలు అభినందించారు. కష్టకాలంలో యూనియన్‌ను సమర్థవంతంగా నడిపి, నాయకత్వ ప్రత్యేకతను చాటుకున్నారని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వీఎస్ రావు ఉద్యోగ విరమణ అభినందన సభ జరిగింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్ వీరయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ లక్ష్యం ఐక్య ఉద్యమాల నిర్మాణమేననీ, గత నాయకత్వం బాటలోనే వీఎస్ రావు కూడా సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తించారని చెప్పారు. గత వారసత్వం వీఎస్ రావును తయారు చేసిందనీ, ఇప్పుడు వీఎస్ రావు వారసత్వం కూడా సంఘంలో తయారవుతుందని అన్నారు. కష్టకాలంలో యూనియన్‌ను సమర్థవంతంగా నిర్వర్తించి, భవిష్యత్ తరానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో వీఎస్ రావు అధ్యక్షుడిగా, తాను ప్రధాన కార్యదర్శిగా పనిచేశామని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇక్కడి యూనియన్‌ను ఆయన ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, అత్యంత సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. జటిల సమస్యలు ఎదురైనప్పుడు వాటికి ప్రత్యామ్నాయ పరిష్కారాలు చూపడంలో వీఎస్ రావు అత్యంత ప్రతిభ కనబర్చేవారని చెప్పారు. నవతెలంగాణ దినపత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ మాట్లాడుతూ నిరంతర అధ్యయనంలో వీఎస్ రావు చురుకైనవాడని ప్రసంసించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని అఖిల భారత స్థాయికి తీసుకెళ్లడంలో ఆయన కృతకృత్యులు అయ్యారని చెప్పారు.

కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎమ్‌యూ) ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి, బహుజనవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్, కార్మిక పరిషత్ ప్రధాన కార్యదర్శి కే యాదగిరి మాట్లాడుతూ స్వరాష్ట్రంలో జరిగిన ఆర్టీసీ కార్మికుల 55 రోజుల సమ్మె, దానిలో వీఎస్ రావు పాత్ర, ఆయన ఆరోగ్యం గురించి ప్రస్తావించారు. క్షణం కూడా ఖాళీగా ఉండకుండా, ఏదో ఒక అంశంపై అధ్యయనం చేయడం, కరపత్రాలు రాయడం, కార్మికుల్ని చైతన్యవంతుల్ని చేయడం కోసం పరితపించేవారని కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అయ్యు పరెడ్డి మాట్లాడుతూ వీఎస్ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్మికోద్యమంలో అనేక సందర్భాల్లో ఎదురైన సమస్యలను సులువుగా పరిష్కరించడంలో దిట్ట అని చెప్పారు. సీఐటీయూ కార్యదర్శులు భూపాల్, జే వెంకటేష్ మాట్లాడుతూ వీఎస్ రావు నుంచి తాము అనేక విషయాల్లో స్ఫూర్తి పొందామని అన్నారు. ఆయన చేసే అధ్యయనం అందరికీ ఆచరణీయమని, మార్గదర్శకమని చెప్పారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు ఎమ్‌వీఎస్‌ఎస్ నారాయణ, పీఎన్ మూర్తి, వీ రాములు వంటి వారు సంఘంతో తమకున్న అనుబంధం, దాన్ని వీఎస్ రావు కొనసాగించిన తీరును ప్రస్తావించారు.

ఈ సందర్భంగా వీఎస్ రావు తన ప్రతిస్పందన తెలుపుతూ అభినం దించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఫెడరేషన్ ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డి ఆహూతులను వేదికపైకి ఆహ్వానించారు. రాష్ట్రంలోని వివిధ రీజియన్ల నుంచి పెద్ద సంఖ్యలో ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

24 గంటలు అప్రమత్తంగా ఉండాలి : సీఎం రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులతో ఫోన్‌లో రివ్యూ చేసి అప్రమత్తం చేశారు. సీఎస్, డీజీపీ, మున్సిపల్, కరెంట్, పంచాయతీ రాజ్, హైడ్రా, ఇరిగేషన్ అధికారులు నిరంతరాయంగా అప్రమత్తంగా ఉండాలని టెలి కాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. జిల్లాల్లో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24 గంటలూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.

అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు. సెలవులు పెట్టిన వారు వెంటనే రద్దు చేసుకొని వెంటనే పనుల్లో నిమగ్నం కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అత్యవసర విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఎంఓ కార్యాలయానికి పంపాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పనులుంటే తప్ప ప్రజలు బయటకి రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఏ అవసరం ఉన్నా అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్థానికంగా ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సహాయ కార్యక్రమాల్లో భాగం కావాలని కాంగ్రెస్ కార్యకర్తలను కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాల కోసం ప్రాజెక్టుల పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నిల్వ చేయాలని సూచించారు. ఎల్లంపల్లికి వచ్చిన వరద నీటిని వీలైనంత మేరకు లిఫ్ట్ చేయాలని, రోజుకు ఒక టీఎంసీ తగ్గకుండా డ్రా చేయాలని అధికారులను ఆదేశించారు. నంది, గాయత్రి పంప్ హౌస్‌ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌తో పాటు రంగనాయక్ సాగర్, మల్లన్నసాగర్ వరకు జలాశయాల్లోకి ఏకధాటిగా నీటిని లిఫ్ట్ చేయాలని ఆదేశించారు. రంగనాయక సాగర్ నుంచి నీటిని పంపింగ్ చేసి మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ నింపాలనీ, అక్కడి నుంచి సింగూర్ ప్రాజెక్ట్, నిజాంసాగర్ ప్రాజెక్ట్ వరకు నీటిని తరలించాలని ఆదేశించారు. కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లలో సాధ్యమైనంత వరకు నీటిని నిల్వ చేయాలనీ, కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించాలని ముఖ్యమంత్రి సూచించారు. మల్లన్నసాగర్‌లో గరిష్ఠంగా 18 నుంచి 20 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలు నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అన్ని ముందు జాగ్రత్తలు పాటించాలని ఆయన అధికారులను అప్రమత్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్

వర్షాలు, వరద పరిస్థితులపై ఆరా

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్


కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఫోన్ చేశారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వరదల వల్ల వాటిల్లిన ఈ సందర్భంగా సీఎం జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రాణ నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు అవసరమైన తక్షణ సహాయాన్ని అందిస్తామనీ, కేంద్ర ప్రభుత్వం తరుపున అవసరమైన వరద సహాయక చర్యలు అందిస్తామని హోం మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లాల కలెక్టర్లతో నేరుగా సీఎం మాట్లాడి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్రమత్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం భరోసానిచ్చారు.

ఇటీవల బెంగళూరులో బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ 2024ను నిర్వహించారు. దక్షిణ భారత సాహితీకారులు పాల్గొని సాహిత్య చర్చలు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సాహిత్యోత్సవాలు ప్రచురణ సంస్థలు కలిసి నిర్వహించాయి. కళలు, సంగీతం, సాహిత్యం అన్నీ కలిసిన ఉత్సవంగా అందరి ప్రశంసలు పొందింది. అందులో పాల్గొన్న మన తెలుగు సాహితీకారులు మన తెలుగులో ఇట్లా ఎందుకు నిర్వహించలేకపోతున్నామని బాధను వ్యక్తం చేశారు. ముఖ్యంగా కె.శ్రీనివాస్‌గారు రాసిన 'మరీ ఇంత కళ తప్పిందేమిటీ తెలుగుదనం' అన్న వ్యాసంలో తెలుగు నేలపైన సాహిత్య, కళ, సంగీతాల మధ్య సమన్వయమూ, ఐక్యతా లేవని, ఆదరించే సాహితీప్రియులు, సమూహాలు లేవని బాధపడ్డారు. బాధపడటమే కాకుండా సాంస్కృతిక జీవనంలోనూ, విలువల పాటింపులోనూ పతనస్థాయిలోకి పోయామనీ నిర్ధారించారు. ఇక మన తెలుగు నేలపై మరో ప్రచురణ సంస్థ నిర్వాహకులు గీతారామస్వామి, 'సాహిత్యాన్ని, కళలను ఇంతగా అభిమానించే వారు మనకెందుకు లేరనీ, కన్నడ, తమిళ, కేరళలోని సాహిత్యకారుల లాంటి వ్యక్తిత్వాలు మనకు వస్తున్నాయా' అని ఆమె పడిన బాధనూ ఈ సందర్భంగా రచయిత ఉదహరించారు. దీంతో పాటు 'తెలుగులో ఒకరి పొడ మరొకరికి గిట్టని తనం ఎక్కువ' అని సాహిత్య అకాడెమీ తెలుగు కన్వీనర్ సి.మృణాళిని అభిప్రాయాన్ని ఉటంకించారు.



- కె.ఆనందాచారి,
9948787660

మన సాహిత్యరంగం ఎందుకిలా ఉంది!



దీనికి స్పందనగా విమర్శకులు, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ ఆధిపత్య బ్రాహ్మణ భావజాలంతో బుక్ బహ్మ సాహిత్యోత్సవాలు నిండిపోయాయని, 'ఆధిపత్యానికి తెలుగుదనం ముసుగు' అంటూ మరో వ్యాసం రాశారు. బహుజన భావజాలాల వారిని, అస్తిత్వవాదుల్ని తెలుగుసాహిత్య సమాజం విరోధులుగా నిర్ధారించే ప్రయత్నం ఆ వ్యాసం చేసిందని తీవ్రంగా విమర్శించారు. తెలుగు నేలలో వస్తున్న, రాస్తున్నవాళ్లు, విమర్శలో ముందుకొస్తున్నవాళ్ల ఎంతోమంది వున్నారని ఉదహరించారు. తెలంగాణలో కళాసాహిత్య నాటక ప్రయోగాలు చాలా విస్తృతంగా జరుగుతున్నాయనీ, దళిత మైనారిటీ, బహుజనులు ఎంతోమంది కలిసి పనిచేస్తున్నారనీ వివరించారు.

అయితే ఇద్దరి వ్యాసాల్లోనూ వాస్తవాలున్నాయి. అక్కడ జరిగిన సభలు చూసి, మన తెలుగు సాహిత్యం పతన స్థితిలోకి పోయిందని బాధపడడంలో కొంత పాక్షికత వుంది. ఇక కె.శ్రీనివాస్‌గారి వ్యాసం థాట్ పోలీసింగ్‌గా వున్నదనీ, బ్రాహ్మణ భావజాల భావనను కలిగించిందన్న ఆరోపణా, శ్రీనివాస్‌గారు ఆ భావజాలానికి కొమ్ముకాస్తున్నాడనే ఆరోపణ సత్యదూరమని భావిస్తాను. అయితే టెక్స్‌ను బహుజన స్పృహతో చూస్తే అలా కనిపించే ఆస్కారం వుంది. కానీ శ్రీనివాస్‌గారు ఆ స్పృహ లేకుండానే రాసి వుంటారనేది నా భావన.

ఇక కె. శ్రీనివాస్‌గారు బాధపడినంత దిగజారిపోయి, పతనావస్థలో తెలుగు సాహిత్యం వుందని నేననుకోవడంలేదు. కొత్తగా రాస్తున్నవాళ్లు, ప్రదర్శిస్తున్న కళలు, సంగిశెట్టి గారన్నట్లు బాగానే వస్తున్నాయి. అయితే వైయక్తిక పోకడలు పెరిగిన మాట వాస్తవం. ఎవరి బృందాలు వారు ఏర్పాటు చేసుకోవటం, ఎవరి

> పతనావస్థలో తెలుగు సాహిత్యం వుందని నేననుకోవడంలేదు. కొత్తగా రాస్తున్నవాళ్లు, ప్రదర్శిస్తున్న కళలు, సంగిశెట్టి గారన్నట్లు బాగానే వస్తున్నాయి. అయితే వైయక్తిక పోకడలు పెరిగిన మాట వాస్తవం. ఎవరి బృందాలు వారు ఏర్పాటు చేసుకోవటం, ఎవరి కార్యక్రమాలు వారే నిర్వహించుకోవడం పెరిగిన మాటా వాస్తవం. ఐడెంటిటీ సమస్య, ఎక్స్‌పోజర్ విపరీతంగా పెరిగింది. సామూహికత, సంఘ స్పృహ తగ్గింది. ఐడెంటిటీ సమస్య కళా సాహిత్యాల్లో ఎప్పటినుండో వుంది. మనం చేసే సృజన సమాజ సంస్కరణ కోసమని భావించే తత్వం సన్నగిల్లింది. మన ప్రతిభ ప్రదర్శనగా మారిపోవటంతో ఇవన్నీ పెరిగిపోయాయి. వ్యక్తిత్వం వేరు, అభివ్యక్తి వేరుగా మారిపోయింది. మరి తెలుగు నేలలో ఇలాంటి ధోరణులు ఎక్కువగా పెరగడానికి కారణం ఏమిటో చర్చించాల్సిన అవసరం వుంది.

కార్యక్రమాలు వారే నిర్వహించుకోవడం పెరిగిన మాటా వాస్తవం. ఐడెంటిటీ సమస్య, ఎక్స్‌పోజర్ విపరీతంగా పెరిగింది. సామూహికత, సంఘ స్పృహ తగ్గింది. ఐడెంటిటీ సమస్య కళా సాహిత్యాల్లో ఎప్పటినుండో వుంది. మనం చేసే సృజన సమాజ సంస్కరణ కోసమని భావించే తత్వం సన్నగిల్లింది. మన ప్రతిభ ప్రదర్శనగా మారిపోవటంతో ఇవన్నీ పెరిగిపోయాయి. వ్యక్తిత్వం వేరు, అభివ్యక్తి వేరుగా మారిపోయింది. మరి తెలుగు నేలలో ఇలాంటి ధోరణులు ఎక్కువగా పెరగడానికి కారణం ఏమిటో చర్చించాల్సిన అవసరం వుంది. సాంస్కృతిక రంగంలో అగ్రవర్ణ ఆధిపత్యాన్ని, దళిత, వెనుకబడిన వర్గాలు ధీటుగానే ఎదుర్కొని అధిగమించారని, ముఖ్యంగా తెలంగాణలో సాధ్యమయిందనే అనుకుంటున్నాను.

ఇక అసలు విషయానికొస్తే, తెలుగు నేలపైన సాంస్కృతిక పరమైన ఐక్యత, సాహిత్యం, కళల పట్ల అభిమానం సమాజంలో సన్నగిల్లడానికి, ఇక్కడి రాజకీయ ఆర్థిక పరిణామాలే కారణమని భావిస్తాను. 1990 నుండి ఉమ్మడి రాష్ట్రంగా వున్న తెలుగు నేల ప్రపంచీకరణ, నయా ఉదారవాద ఆర్థిక విధానాలను ఆహ్వానించి అమలు జరిపిన ప్రయోగశాల ఈ నేల. చాలావేగంగా ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు పరిచిన రాజకీయ వ్యవస్థ ఇక్కడ కొనసాగింది. ప్రపంచీకరణ పాదం మోపింది కేవలం ఆర్థిక రంగంలోనే కాదు, సామాజిక, సాంస్కృతిక రంగాన్నీ విపరీతంగా ప్రభావితం చేసింది. ఇక్కడి యువతలో, ఉద్యోగుల్లో, మధ్య తరగతి ప్రజల్లో ఎన్నో కొత్త ఆశలను, ఆలోచనలను ప్రేరేపించింది. నీ విజయం నీ చేతుల్లోనే వుందనీ, నీ అభివృద్ధి నీ చేతిలోనే వుందన్న వ్యక్తి కేంద్రక ఆలోచనలను పాదుకొల్పింది. ఇక భాషాపరమైన భ్రమలూ పెంచింది. ఇంగ్లీషు చదువే జీవితాలను మార్చేస్తుందని, కంప్యూటర్ జ్ఞానమే జ్ఞానమనీ బోధించింది. సామాజిక శాస్త్రాలు, మానవీయ శాస్త్రాలు ఎందుకూ పనికిరానివిగా ప్రచారం చేసింది. 'నేను, నాకేంటి' అనే ఆలోచనలు జనంలో పెరిగాయి. ఈ ప్రభావం తెలుగు నేలపైన విపరీతంగా పడింది. అదే సందర్భంలో బాధిత సమూహాలు కూడా అస్తిత్వ వేదనలతో శకలాలుగా విడిపోయాయి. ఇవన్నీ సాహిత్య కళారంగాలపై ప్రభావాన్ని చూపాయి. మానవ సంబంధాలలో మనీ సంబంధాలే ప్రాబల్యం వహించాయి. ప్రజలలోనూ ఈ ఆలోచనలే వేళ్లూనుకునిపోయాయి. ఈ పరిణామాలన్నీ అందరికీ తెలిసినవే.

మరి ఈ పరిస్థితులు తమిళ, కేరళ, కర్నాటక ప్రాంతాలకు వర్తించవా? అని ప్రశ్నించవచ్చు. కానీ ప్రపంచీకరణ, ప్రవేటీకరణ విధానాలను మనంతగా కౌగిలించుకోలేదు. అక్కడ వారి పూర్వ వారసత్వం సంఘసంస్కర్తల, సామాజిక ఉద్యమకారుల ప్రభావం ఆయా రాష్ట్రాలలో ఇప్పటికీ వుంది. వారి భాష, సంస్కృతిపై వారికున్నంత అభిమానం, ప్రేమ మనకు లేదు. తమిళనాడు, కర్నాటక, కేరళలో ఎప్పటినుండో సాహిత్యం, సంగీతం, నాటకం కలిసి పనిచేస్తున్నాయి. ఇక్కడ మనకలా లేదు. 1940, 50 లలో అట్లా మన దగ్గరా వుండింది. ఇప్పుడు లేదు. తమిళనాడులో ప్రాంతీయ రాజకీయాలే ఆధిపత్యం వహిస్తాయి. ప్రపంచీకరణ ప్రభావాన్ని తట్టుకుని, వారి సాంస్కృతిక జీవనాన్ని సజీవంగా వుంచుకోగలుగుతున్నారు. ఇక కేరళలో కమ్యూనిస్టులు, ప్రగతిశీల భావచైతన్య ప్రభావం ఇప్పటికీ వుంది. కర్నాటకలోనూ అంతే. ఈ నేపథ్యంలో తెలుగు నేలన వైయక్తిక వాదం ప్రబలిందనేది నా భావన. అంతటా ప్రపంచీకరణ ప్రభావం వున్నప్పటికీ మనం మరింత గురయ్యాం. దాని ఫలితమే మనకు కనపడుతున్నది.

మన తెలుగు ప్రాంతంలో వేమన, పోతులూరి, కందుకూరి, గురజాడ, గిడుగు, కుసుమధర్మన్న, భాగ్యరెడ్డివర్మ, మాడపాటి, సురవరం, వట్టికోట, శ్రీశ్రీ, జాషువా, వొద్దిరాజు సోదరులు, దాశరథి సోదరులు మొదలైన సాహితీకారులు, సంస్కర్తలు నడిపిన ఉద్యమాన్ని ఆ తర్వాత కొనసాగించలేకపోయాం. అభ్యుదయ సాహిత్యోద్యమమూ, ప్రజానాట్య మండలి కలిసి మహోజ్వలంగా జరిపిన కృషి అరవైల తర్వాత వెనుకపట్టు పట్టింది. వాళ్లందించిన చైతన్యం, స్ఫూర్తిని అందుకోలేకపోవడం మన వైఫల్యం. అయితే మన సమాజంలో అందుకవసరమైన ఏ సామాజిక, రాజకీయ ఉద్యమాలూ పెద్దగా లేకపోవడమూ ఒక కారణమే. తెలంగాణలో నాటి సాయుధ రైతాంగపోరాట ఆరంభంలో ఆంధ్రమహాసభ, గ్రంథాలయోద్యమం విస్తృతంగా సాగింది. ప్రజా సాంస్కృతిక చైతన్యమూ వెల్లివిరిసింది. ఇక మొన్నటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలోనూ సాహిత్య కళా సృజన కొంత జరిగింది. ఆ తర్వాత స్తబ్దంగా మారిన మాట వాస్తవం. ఒక చైతన్య పూరిత ఉత్సాహం, ఐక్యత కొరవడింది.

అయినప్పటికీ నిరంతరంగా సాహిత్య చర్చలు, ఆవిష్కరణలు, సెమినార్లు జరుగుతూనే వున్నాయి. 2015 నుండి తెలంగాణ సాహితి ఇప్పటి వరకు ఐదు లిటరరీ ఫెస్ట్‌లు నిర్వహించింది. మూడు రోజులపాటు జరిగే ఈ ఫెస్ట్‌కు హాజరు, ఆదరణ బాగానే వుంది. అర్థవంతమైన చర్చలు జరిగాయి. అరసం, విరసం, ఇతర వేదికల సభలు విజయవంతం అవుతున్నాయి. యూనివర్సిటీలలోనూ జాతీయస్థాయి సాహితీ చర్చలు సాగుతున్నాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్ నిర్వహణ, అమ్మకాలూ బాగానే వున్నాయి. చైతన్యయుతమైన స్పృహతో సమన్వయం చేయగలిగితే ఆదరించే సమూహాలూ, వ్యక్తులూ ఇక్కడ తక్కువేం కాదు. అభిప్రాయభేదాలు ఎప్పుడైనా, ఎక్కడైనా వుంటాయి. మనం నిరాశ చెందాల్సిన పనిలేదు. నేడు ఎదురవుతున్న సవాళ్లపై పోరాడుతున్న సమూహాలతో కలిసి పనిచేయగలగడమే పరిష్కారం.

తప్పెవరిది

ఒక్కో అక్షరానికి జరుగుతోంది
విస్ఫోటనం మెదడులే
పద పదానికి పేలుతున్నాయి శతఘ్నులు గుండెల్లో..
వాక్య వాక్యానికి బద్దలవుతున్నాయి
అగ్ని పర్వతాలు కళ్ళల్లో..
భావ భావానికీ ఆలోచనల్లో భూకంపం పుడుతోంది..
కాగితంపై సిరాకు బదులు రక్తం పారుతోంది..
కలం పట్టుకున్న చేయి చిగురుటాకులా వణుకుతోంది..
ఎటు పోతోంది సమాజం ఏమై పోతున్నాడు మనిషి
ఎక్కడ బ్రతుకుతున్నాం మనం..
ఎక్కడ తిరుగుతున్నారు జనం..
కొంగు చూడగానే చొంగలు కార్చే చిత్త కార్తె కుక్కా..



చేయి వేయగానే తల్లి కనపడ లేదా..
గుండెలు చూడగానే తాగిన పాలు గుర్తుకు రాలేదా..
పెదాలు కనగానే తల్లి పెట్టిన ముద్దులు జ్ఞప్తికి రాలేదా..
ఎక్కడో చూడగానే ఊగిన ఒడి ఊయల మతికి రాలేదా..
కళ్ళు చూడగానే డాక్టరై
సేవ చేద్దామనుకున్న ఆశలు కనపడలేదా..
చేతులు పట్టుకోగానే
రోగాలు తగ్గించే అమృత హస్తమనిపించలేదా..
చూడగానే తోడబుట్టిన వారి
అమాయక ముఖం కన్పించలేదా..
కొంగు కనబడగానే చొంగలు కార్చే కుక్కలా...
కామంతో కన్నూ మిన్నూ కానని రాక్షసుడిలా....
తోటి ఆడపిల్లను కర్కశంగా మింగుతుంటే...
ఎవరిదీ తప్పు ఎక్కడిదీ ధూర్తాలోచన...
కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లు...
ఆధునిక విజ్ఞానానిదా, సమాజానిదా, పెంపకానిదా....
అభం శుభం తెలియక చేసిన స్నేహానిదా....
కళ్ళు మూసుకుపోయిన మృగమా మార్చుకో మనసుని...
కామంతో బలిసిన దేహాన్ని చేయి మనిషిని..
చేయకు మానవత్వాన్ని నీ చేతులతో నుసిని...
రెండు కొవ్వొత్తులు, నాలుగడుగులు
ఆరు మాటలు వద్దు సానుభూతికై....
చూపాలి నిరసన న్యాయవ్యవస్థ మార్పుకై....
ఎలుగెత్తి అరవాలి చట్టాల కచ్చితమైన అమలుకై...
మారాలి దుర్మార్గులకు కొమ్ముకాసే చట్టం...
మార్చాలి ఉన్నవాడికి అవకుండా చుట్టం...
మార్చాలి శిక్షాస్మృతి న్యాయానికి కట్టేవిధంగా పట్టం.....

- జి. మధు మురళి, భీమారం

మహా విహారయాత్ర

తెల్లారిగట్లల్ల ఐదు గొట్టంగనే లేశి
రాత్రిపూట గట్టిపెట్టుకున్న సామాను
మూటలను తలొక్కటి పట్కొని
బయల్దేరేటోళ్ళం
టార్చి లైటున్న బాపు సైకిలు
పెద్ద పెద్ద మూటలను
దాని ఈపు మీదికెక్కిచ్చుకొని
మాతోని పాటిగె నడుస్తు
మాకు తొవ్వ జూపిచ్చుకుంట
మస్తు సాయం జేశేటిది
రాళ్ళూరప్పల నుంచి
పురుగూపుట్ర నుంచి
తప్పిచ్చుకుంట టకటక అడుగులేశేది మేం
జెల్ది శేరుకోవాలెగద మరి
తీర్తాల చోటు కాడికి
దూరమనుకున్న చోటు దగ్గరైతాన కొద్దీ
మనసుపిట్ట గిరికీలు గొట్టేది
నడిశే దారిలనే
ఊటశెలిమె నుంచి పారుకచ్చిన నీళ్ళు
మా పాదాలను కడిగేటియి
ఆ సల్లని తాకిడికి కాలిఏళ్ళు
నాట్యమాడేటియి
ఓ మంచి జాగ జూస్కున్నంక
ఆడ సామాను దిగేది
ఎండను మా మీద పడనియ్యకుంట
శెద్దరే టెంటు లెక్కయ్యేది
పచ్చని గడ్డిపర్కల మీద
జారకుండ నిల్సున్న మంచుబొట్లను
గప్పుడే పొడుసుకచ్చిన సూరీడు
మెల్లమెల్లగ తాగి మాయంజేశెటోడు
అప్పటిదాక బండ లెక్కనే ఉన్న బండ
మా ఊరోళ్ళ శెయ్యి పడ్డెంటనే
పసుపుబండార్లు తొడుక్కొని
అందరు మొక్కే దేవతయ్యేది
పొత్తుల కొన్న యాటపిల్ల
తెగి, పొతమయ్యి
పొయ్యి మీద కుతకుత ఉడికెదాక
మేమైతె బిందాస్‌గ ఆటకు ఎగవడేది
పెద్ద పెద్ద పైసలబిళ్ళలు
రైలు పట్టాల మీదికెక్కేటియి
రేగు శెట్ల శిఖల మీద ఆలిన బంగారు
పురుగులు అగ్గిపెట్టెలపంజరాలల్ల
ఇరుక్కపోయేటియి
మెత్తటి ఆరుద్ర పురుగులు
అరశేతుల్లల్ల ముద్దుగ పాకేటియి
తియ్యటి పరికి పండ్లు జేబుల్లల్ల జేరి
ఒక్కోటీ నోట్లె నాని కరిగిపోయేటియి
కోపుల్లల్లున్న నీలం రంగు నీళ్ళు
మా దూకుడుకు ఓ ఊపు ఊగేటియి
ఒక్కరోజుల ఎన్ని జరిగిపోయేటియో
కలిశికట్టుగ బంతిల కూసొని
మోదుగాకు ఇస్తార్లేసుకొని
ఒకళ్ళనొకలం అర్సుకుంట తినెటోళ్ళం
మెతుకు ఒదిలితె ఒట్టు
మనసు నిండిపొయ్యేది
మేమచ్చిన యాళ్ళకే అచ్చిన సూరీడు
మేం తిరిగిపొయ్యే యాళ్ళకే
తిరిగిపొయ్యెటోడు
నడిమిట్ల మబ్బుజేస్తే
ఆగమాగమయ్యెటోళ్ళం
వాన పడద్దని ప్రకతికి మొక్కుకునేటోళ్ళం
శిన్నప్పుడు అన్ని పండుగలల్ల
గా శెట్ల తీర్తాలంటేనే మస్తిష్టం
ఏ విహారయాత్రకు పొయ్యే స్తోమత లేని
మాకు గా శెట్ల తీర్తమేగదా
మహా విహారయాత్ర!!

- కార్తీక రాజు, 8977336447

ఎందుకో ?!



ఆమె నా దేహాన్ని తన భాషలోకి తర్జుమా చేస్తున్నది
ఆమె అనువాదానికి నాలోని ఎడారులు పచ్చని అడవులుగా మారుతున్నపుడు
మనసు మాటలతో వ్యక్తీకరించలేని నిస్సహాయతలో
నా అస్తిత్వంపై ఆమెదే అధికారమైనపుడు
అవ్యక్తమవుతున్న అనుభూతిలోని వెచ్చదనం ఎవరిదని అన్వేషిస్తే
నా నీడలా వెన్నంటి వుండే ఆమెదే కదా!
ఇక నుండి, ఈ భౌతిక ప్రపంచం నన్ను ఆమె నీడగానే చూస్తుందేమో?
నా ఊరు, పేరు, వంశం ఆమె తర్జుమాలో కరిగి జీవం పోసుకుంటున్నప్పుడు
క్షేత్రం ఆమెదే, పంట ఆమెదే !
ఐనా విచిత్రం ఏమిటంటే - ప్రపంచం విత్తనాన్నే గుర్తిస్తున్నది ఎందుకో?!

- డా|| రూప్ కుమార్ డబ్బీకార్, 91778 57389

సన్నిధానం నరసింహ శర్మకు అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారం 2024 వ సంవత్సరానికి గానూ ప్రముఖ సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు ప్రదానం చేస్తున్నారు. సెప్టెంబర్ 8వ తేదీన కాకినాడలో జరిగే సభలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది.

- అద్దేపల్లి ఉదయభాస్కరరావు

'రాత్రి సింఫని' కి పాలమూరు సాహితి అవార్డు

డా.బాణాల శ్రీనివాసరావు రచించిన 'రాత్రి సింఫని" కవితాసంపుటానికి 2023 సంవత్సరానికి గాను పాలమూరు సాహితి అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు కార్యక్రమం సెప్టెంబర్ 1 న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్‌లోని కాళోజీ హాల్ లో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

- డా. భీంపల్లి శ్రీకాంత్, 9032844017

నీహారిణి కవిత్వం - మెత్తని స్త్రీవాదం



- ఏనుగు నరసింహారెడ్డి,
8978869183

కవిత్వ శైలి కవి వ్యక్తిత్వానికి అద్దంలాంటిది. కొందరి కవితలు ఒక పోతపోసిన శిల్పంలా వుంటాయి. శిల్పేతరమేది వెతికినా కనిపించనంతటి సునిశిత కార్వింగ్ వుండే పోయెమ్స్ అవి. అయితే అవి రూపవాదుల కవిత్వం ఎంత మాత్రం కాదు. రూప స్పృహ వున్న వస్తువాదుల కవితలే అలా వుంటాయి. అమ్మంగి వేణుగోపాల్ 'బాలన్స్ ఇరవై' అనే కవితలో వస్తువు చాలా స్పష్టం. 'ఇంకా ఇరవై ఏళ్ల ఆయువుంది నాకు' అని శీర్షికలోనే స్పష్టం చేస్తూ రాసిందది. కవితా నిర్వహణ శిల్పాన్ని భౌతికంగా చెక్కినట్లు ఒక్క వ్యర్థ పదం లేకుండా జాగ్రత్తపడ్డారు.



"దేహానికి డెబ్బై/ కలానికి యాభై/ తీసివేతను నమ్మినా/ బాలన్స్ ఇరవై/ చెక్ బౌన్సయ్యేదాకా/ చూద్దాం" అనడం ఎలా వుందో, పాదాలూ అలానే బ్లేడ్‌తో కట్ చేసినట్లుంటాయి. కొందరు కవులు వస్తువును వాచ్యం చేస్తూ రాసినా ఎఫెక్టివ్‌గా రాస్తారు. అలా రాయడంలో కవితంతా మనసుకు హత్తుకోదు కానీ ఆ కవితలోని కొన్ని పాదాలు/ పాదం పాఠకుడిని అబ్బురపరుస్తాయి. సమాజంలోని మంచీచెడులను తులనచేస్తూ ఒక కవితలో ఇమడ్చడం డా॥సి.నారాయణరెడ్డికి బాగా తెలిసిన విద్య. ఒక చోట కవితలో మధ్య భాగంగా **"వియ్యంతో వియ్యమందే పలుగురాళ్లు/ పాలతో తాదాత్మ్యంచెందే పంపునీళ్లు"** అంటారు. ఈ పాదాలు కవిత నుండి విడదీసినా స్వతంత్ర అస్తిత్వం కలిగి వుంటాయి. ఇలాంటి కవిత్వం కొండపల్లి నీహారిణి సంపుటిలో చాలా దొరుకుతుంది.

డా॥కొండపల్లి నీహారిణి కవిత్వం వస్తువు చుట్టూనే తిరుగుతుంది కానీ మరికొన్ని వస్తువులు అందులో వచ్చి చేరతాయి. చాలా కవితల్లో అవి మరో వస్తువు మీద రాయదలిచి ప్రారంభించినదైనా అన్‌కాన్షియస్‌గా స్త్రీ పక్షపాత స్వరం వచ్చి చేరుతుంది. అయితే అది రాడికల్ ఫెమినిజం కాదు. భారతీయ సంప్రదాయం మీద స్పష్టమైన ప్రేమ కూడా వుంటుంది. దేశీయ తాత్విక చింతనతో కూడిన ఆర్ద్రత ఆమె కవిత్వంలో గుర్తించదగిన మరో విలక్షణత. అన్ని సందర్భాలతో వ్యక్తీకరణలో సారళ్యతే వుంటుంది.

2011లో వచ్చిన 'అర్ర తలుపులు'లో ప్రధానంగా నోస్టాల్జియా పాఠకుడిని ఆకర్షిస్తుంది. 2012లో వచ్చిన 'నిర్నిద్రగానం'లో తెలంగాణ ఆకాంక్ష బలంగా వినిపిస్తుండగా, 2017లో ప్రచురించిన ఎనిమిదో అడుగులో రాష్ట్ర సాకారానంద అనే కవితల్లో వ్యక్తమవుతుంది. 2021 కాలప్రభంజనంలో కరోనా విధ్వంసం ప్రధాన వస్తువయింది.

ఒక కవితలో అనేక విషయాలను, భిన్న వస్తువులను నీహారిణిగారి కవిత్వంలో తరచూ గమనించవచ్చు. 'అర్ర తలుపులు' సంపుటిలోని 'అర్ర తలుపుల అల్లాట'ను **"పట్నం నుండి పల్లెకు పోయిన దారిలా/ సగ్రమంటుంది నా మనసు!/ దాబయిన దాంబరు రోడ్డుపై బరువైన గుండెతో/ నా కాలి నడక!/ గుడిసెలోని గుడ్డిదీపం లైట్‌గా బుగ్గగా మారినట్టు/ అనుకరణ జీవితం విచ్చుకుంంది"** అని ప్రారంభిస్తారు. ఇక్కడ పల్లెలో వచ్చిన మార్పులు సూచిస్తూ 'అనుకరణ' అనే మాట వాడారు. నిజానికి నిర్ద్వందంగా రోడ్లు, లైట్లు అభివృద్ధి చిహ్నాలే. అయితే ఇదంతా పల్లె ముచ్చట. కవిత ఇలా కొనసాగుతుంది... **"పెళ్లిదాకా రాని ప్రేమలు, హత్యలు, ఆత్మహత్యలు/ జాయింట్ ఫ్యామిలీలు కనుమరుగైన పాపానికి/ గర్భశోకాలే మిగులుతున్నాయి"** ఇంది ఇంకో వస్తువు. ముగింపులో ఇంకో భిన్నమైన విషయాన్ని చెబుతూ... **"వ్యసనాల తిమింగలాలకు చిక్కొద్దన్న/ సంసారుల ప్రయత్నాలు/ పండుగకు కొన్న బట్టల్లా మెరుస్తున్నాయి"** అంటారు. అయితే సమాజంలో జరిగే ఇన్ని రకాల అస్తవ్యస్థతలు నా మనసు అర్రలో బందీ అయ్యాయంటూ ముగిస్తారు. ఈ ముగింపులో భిన్నవస్తువులను ఏకసూత్రతతో బంధిస్తారు. ఇదే కవయిత్రి విలక్షణత.

'బంధిస్తే గాలినో వెలుతురునో బంధించండి అర్ర మందారాలను బంధించవద్దని' కాలప్రభంజనంలో ఒక కవిత వుంది. ఆడోళ్ల బతుకమ్మ ప్రత్యేకంగా సంస్కృతిలో సగానికన్నా ఎక్కువైన స్త్రీ గురించి రాస్తారు. ఇదంతా స్త్రీ పక్షపాతం వహించగలిగే కవితలు. కానీ వ్యవసాయ దైన్యం గురించి హాలిని హాలికుడు రాశారు... **"ఏరువాక దుక్కిదున్నే నాగలౌతూ అతడు/ ఎండపూట సద్దిమూటలు గంపలైతూ ఆమె"** అన్న పాదాలు ఆమెలో వస్తువు ఏదైనా అన్‌కాన్షియస్‌గా స్త్రీ స్పృహ అగ్రీకరణం చెందుతుందని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తాయి. అయితే పురుషాహంకార విమర్శలో కాఠిన్యం కానీ, దురుసుతనం కానీ ఏ కవితలోనూ కనిపించదు.

భారతీయ సంప్రదాయ ముద్ర నీహారిణిగారి మీద బలంగా వుంది. అది కవిత్వం అధ్యయనం లోతుగా చేసిన వాళ్లకే కాకుండా శీర్షికల ద్వారా కూడా ధ్వనిస్తుంది. మొదటి సంపుటి 'అర్ర తలుపులు' గ్రామీణ జీవితానికి ఒక సంకేతాత్మకమైన వ్యక్తీకరణ లాంటి పేరు. నిర్నిద్రగానంలో సంస్కృత భాషాప్రేమతో పాటు, తాత్వికత కూడా వుంది. ఎనిమిదో అడుగు అనివార్యంగా సప్తపదిని గుర్తుకు తెస్తుంది. కాలప్రభంజనం మనిషి జీవిత అశక్తత, పరిమితత్వం వ్యక్తపరుస్తుంది. ఈ సంపుటాలలో కవిత్వం కూడా శీర్షికాంశాలను విస్తరిస్తూ పోతుంది.

రాసే వస్తువులతో తాదాత్మ్యం చెందడం వల్ల నీహారిణి కవితల్లో మెరుపులాంటి ఆర్ద్ర వాక్యాలు సృష్టింపబడతాయి. నిర్నిద్రగానంలోని కల్తీలో ఒక జీవితంలో ముంగింపు వాక్యంలో **"నువ్వు సీసాలు ఖాళీ చేస్తుంటే/ కన్నీటితో నింపుతుంది ఆమె!"** అంటారు. ఇంకో చోట కాలం ఎంత శక్తివంతమైనదో చెపుతూ... **"నేను కాలాన్ని/ ఎంతకూ వెనక్కి తిరిగిరాని దాన్ని/ నిస్తేజాన్ని అసలే సహించని అమ్ముల పొదిని"** అంటారు. మరోచోట నగరం గురించి రాస్తూ ఇలా చెబుతారు... **"బర్ముడా ట్రయాంగిల్‌కున్నంత/ ఆకర్షణతో/ అందర్నీ తనలో ఇముడ్చుకుంటుంది/ శోధనకు అందని గుండం/ పరిశోధనకు దొరకని సంద్రం/ పట్నం".**

ఇక వర్తమాన రాజకీయ నాయకుల వ్యవహార శైలిని విమర్శిస్తూ విలక్షణ వ్యక్తీకరణ చేస్తారు చూడండి... **"నాలుకకు నరం లేనోడే/ నాయకుడీనాడు/ లోభులను ప్రలోభపెట్టడం/ అతని క్రీడ".**

సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను అర్థవంతంగా సృజిస్తున్న నీహారిణి గారి కవిత్వంలో సంప్రదాయ స్త్రీవాదం, పురోగామి దృక్పథం జమిలిగా కనిపిస్తాయి. వీరి కాల ప్రభంజనం టెంపెస్ట్ ఆఫ్ టైమ్‌గా డా॥ఎలనాగ చేత అనువాదం చేసి ప్రచురించడం వారి కవిత్వ అభివ్యక్తికి సూచిక.

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

నిర్ణీత సమయంలో ఇండ్ల స్థలాలివ్వాలి

- దెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీలో తీర్మానం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టులకు ఇంటి స్థలాల విషయంలో అత్యంత సానుకూలంగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) కృతజ్ఞతలు తెలిపింది. ఈ నేపథ్యంలో తమకు కూడా ఇంటి స్థలాలపై నిర్ణీత గడువుతో ప్రకటన చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన డీజేహెచ్‌ఎస్ జనరల్ బాడీ సమావేశం తీర్మానం చేసింది. డీజేహెచ్‌ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, డి.రామకృష్ణ, నాగరాజు, సలహాదారు విక్రమ్, సభ్యులు బి.సురేష్‌బాబు తదితరుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీజేహెచ్‌ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కలిసి మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరామన్నారు. తమ విన్నపం మేరకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత కూడా రేవంత్‌రెడ్డిని కలిసినట్టు తెలిపారు. అలాగే సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మెన్ శ్రీనివాసరెడ్డిని కలిసి విన్నవించినట్టు చెప్పారు. సీఎం తమతోనూ, పలు సందర్భాల్లోనూ జర్నలిస్టులకు ఇండ్ల విషయంలో సానుకూలంగా ఉన్నట్టు తెలిపారన్నారు. తమకు కూడా రేవంత్‌రెడ్డి ఇంటి స్థలం ఇస్తారన్న సంపూర్ణ విశ్వాసం ఉందని బొల్లోజు రవి ధీమా వ్యక్తం చేశారు. వచ్చే వారం జవహర్‌లాల్ సొసైటీకి ఇళ్ల స్థలాలు ఇవ్వనున్న నేపథ్యంలో తమకూ ఇచ్చేలా ప్రకటన చేయాలని ఆయన సీఎంను కోరారు. అలాగే ప్రకటనతోపాటు నిర్ణీత సమయంలో ఇంటి స్థలం ఇచ్చేలా ప్రకటన చేయాలని జనరల్ బాడీ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

ఎన్ఐఆర్ఎఫ్‌లో కేఎల్‌హెచ్ హైదరాబాద్ వర్సిటీకి 22వ ర్యాంకు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లోజాతీయ స్థాయిలో కేఎల్‌హెచ్ హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణానికి 22వ ర్యాంకు లభించింది. ఈ మేరకు కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి పార్థసారథి వర్మ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు రావడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. హైదరాబాద్ ప్రాంగణం అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు ఈ ర్యాంకును కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్ పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయని పేర్కొన్నారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్ కాలేజీలు, ఐఐటీలు, ఎన్ఐటీలు కలిపి 6,517 పోటీపడితే అందులో తమ వర్సిటీకి 22వ ర్యాంకు రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ విజయం కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం సమగ్ర విద్యావిధానాన్ని స్పష్టం చేస్తున్నదని పేర్కొన్నారు. అజీజ్‌నగర్, బౌరంపేట, కొండాపూర్ ప్రాంగణాల్లో అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తెచ్చామని కేఎల్ హైదరాబాద్ ప్రాంగణం ప్రిన్సిపాల్ రామకృష్ణ, అడ్మిషన్ల డైరెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

- సీఐ రాఘవేందర్‌రెడ్డి వెల్లడి



నవతెలంగాణ-ఆదిభట్ల

డ్రగ్స్ విక్రయిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులను మహేశ్వరం ఎస్ఓటీ టీమ్, ఆదిభట్ల పోలీసులు అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన బిస్వాజిత్ మధు, సంతోష్ సర్కార్ కొంగర కలాన్ గ్రామం లక్ష్మి దేవమ్మ గార్డెన్ సమీపంలోని లేబర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అధిక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వీరు ఒడిశా నుంచి ఐదు కిలోల గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి స్థానిక యువతకు విక్రయిస్తున్నారు. వారు ఉండే చుట్టుపక్కల లేబర్ కాలనీలో కూడా డ్రగ్స్ అమ్ముతున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి వీరిని అరెస్టు చేశారు. వీరి నుంచి డ్రగ్స్‌తోపాటు రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా వీరిపై పలు కేసులు ఉన్నాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

దేశంలో ఉధృతంగా రైతాంగ పోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

అంశంపై విజ్జు కృష్ణన్ వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు రికార్డుల్లో నమోదు కావడం లేదన్నారు. మహిళలు, కౌలు రైతులను ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. ఎరువులు, విత్తనాలపై సబ్సిడీల్లో కోత విధించారన్నారు. ఉపాధి హామీ ద్వారా 200 పని దినాలు కల్పిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏడాదిలో రూ.1000 కోట్ల నష్టం జరుగుతోందన్నారు. పత్తి సాగు చేస్తే క్వింటాలకు రూ.11వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు అవుతుంటే.. కేవలం రూ.6,600 మద్దతు ధర ప్రకటించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో పత్తి ఉత్పత్తి అధికంగా ఉందని చెప్పారు. నల్ల చట్టాలకు వ్యతిరేకిస్తూ 385 రోజుల పాటు నిర్వహించిన ఆందోళనల్లో 738 మంది రైతులు మృతి చెందారని గుర్తు చేశారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను వెనక్కి తీసుకోక తప్పలేదన్నారు. తదనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో బీజేపీ తన స్థానాలను కోల్పోయిందన్నారు. ఉద్యమం బలంగా జరిగిన 38 స్థానాల్లో బీజేపీ ఓటమి చవి చూసిందని తెలిపారు. కానీ ఎన్నికల అనంతరం మోడీ ప్రభుత్వం తన విధానాలను వెనక్కి తీసుకోవడం లేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్ మద్దతుతో మోడీ ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. కేవలం రైతాంగ పోరాటాలే కాకుండా స్థానిక సమస్యలపైనా ఉద్యమాలు చేయాలన్నారు. షుగర్ కో ఆపరేటివ్ సొసైటీలను ఎన్సీపీ, బీజేపీ, శివసేన ప్రభుత్వాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయన్నారు. కానీ కేవలం కేరళలోనే 16వేల సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఏడాదికి రూ. 1.16లక్షల కోట్ల ఉత్పత్తిని సాధిస్తున్నాయని చెప్పారు. రూ.45 వేలకు కోట్ల డిపాజిట్లు కలిగి ఉందన్నారు. పంటల బీమాను జిల్లా యూనిట్‌గా కాకుండా గ్రామ యూనిట్‌గా పంట నష్టపరిహారం అందించే విధంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజస్థాన్‌లో పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని నిర్వహించిన పోరాటాల ఫలితంగా రూ.3వేల కోట్ల పరిహారం రైతాంగం సాధించారని చెప్పారు. ఈ విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులను అందజేయాలని డిమాండ్ చేశారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు రైతులకు హక్కు పత్రాలివ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.

నవంబర్ 15 నుంచి ఆందోళనలు

నవంబర్ 15 నుంచి 25 వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పది రోజుల పాటు ఎంపీలకు వినతిపత్రం అందజేయాలని ఉమ్మడి రైతు సంఘాల జేఏసీ నిర్ణయించిందన్నారు. నవంబర్ 26న చలో ఢిల్లీలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీనియర్ నాయకులు పి.జంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ముసలయ్య, రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకులు కడిగళ్ల భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఆందోళన వద్దు.. ఆదుకుంటాం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్
- వరద సహాయక చర్యల్లో కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వామ్యం కావాలి : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందొద్దనీ, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులతో సమీక్షించారు. సోమవారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఖమ్మం. కొత్తగూడెం. వరంగల్. సూర్యాపేట. నల్లగొండ. హైదరాబాద్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై అధికారులనడిగి తెలుసుకున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. వరద ముప్పు ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, అవసరమైన ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని చెప్పారు. రెస్క్యూటీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అవసరమైతే రక్షణ చర్యలకు హెలికాప్టర్లు వినియోగించాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ విభాగం అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు సచివాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్, తాగునీరు, రాకపోకలకు అంతరాయాలు కలుగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోదావరీ, కృష్ణా నదులతో పాటు పలు వాగుల ద్వారా వచ్చే వరద వల్ల రాష్ట్రంలోని అన్ని చెరువులు నిండు కుండను తలపిస్తున్న నేపథ్యంలో గండ్లు పడకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి సెలవుల మంజూరు రద్దు చేయాలని చీఫ్ సెక్రెటరీని ఆదేశించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని కలెక్టర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం వరకు ప్రజలు బయటికి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వరద సహాయక చర్యల్లో భాగస్వామ్యమై ప్రజలకు అండగా నిలవాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ డా. జితేందర్, మున్సిపల్, వైద్య ఆరోగ్య, నీటి పారుదల, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్, జీహెచ్ఎంసీ, జలమండలి, ట్రాన్స్కో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటతడి పెట్టిన మంత్రి

వరద పరిస్థితిపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సచివాలయంలో మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు. భారీ వర్షాలకు తన నియోజకవర్గానికి చెందిన యాకూబ్, ఆయన భార్య సైదా వరదల్లో కొట్టుకొనిపోయారని చెప్పారు. ఆదివారం ఉదయం నుంచి ఆ కుటుంబాన్ని రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదన్నారు. "నేవీ, ఎయిర్ ఫోర్స్‌తో పాటు హకీంపేటలోని పలు హెలికాప్టర్లను సంఘటనా స్థలానికి పంపేందుకు ప్రయత్నించాను. భారీ వర్షాలకు హెలికాప్టర్లు టేక్-ఆఫ్ కావడం కష్టమన్న సమాధానం వచ్చింది. మరోవైపు యాకూబ్‌తో పాటు ఆయన భార్య సైదాతో నిరంతరం మాట్లాడుతూ ధైర్యం చెప్తూనే ఉన్నాను.

విపత్తు నివారణ బృందాలను పంపడం జరిగింది. ఈ లోపే భారీ వరద పోటెత్తడంతో వారున్న ఇంటిగోడ కూలి వరదలో కొట్టుకుపోయారు. అయినప్పటికీ వారి కొడుకు షరీఫ్‌ను రక్షించగలిగాం" అంటూ మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు.

విధులకు వెళ్తూ మృత్యుఒడిలోకి యువసైంటిస్ట్

- ఆకేరు వాగులో కొట్టుకుపోయిన కారు
- కుమార్తె కోసం వెళ్తూ తండ్రి కూడా గల్లంతు
- ఖమ్మం జిల్లా కారేపల్లి గంగారం తండాలో విషాదం..



నవతెలంగాణ -మరిపెడ

వారిది సాదాసీదా వ్యవసాయ కుటుంబం.. వారికిద్దరు సంతానం.. కుమారుడు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువు సాధించగా.. కుమార్తె ఉన్నత విద్య అభ్యసించి అగ్రికల్చర్ సైంటిస్ట్‌గా ఏడాదిన్నర క్రితం కొలువు సంపాదించింది. సోదరుడికి పెండ్లి కుదరటంతో ఇంటికి వచ్చిన కూతురు.. తిరిగి విధులకు హాజరైందుకు తండ్రి కలిసి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళుతుండగా వారు వెళుతున్న కారు వరదలో చిక్కుకుంది. దాంతో కుమారుడికి ఫోన్ చేసిన తండ్రి తాము మునిగిపోతున్నామని.. రక్షించాల్సిందిగా కోరాడు. కానీ, అప్పటికే వారు వరదలో కొట్టుకుపోగా, కూతురు మృతిచెందింది, తండ్రి గల్లంతయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఆకేరు వాగు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం కారేపల్లి పరిధిలోని గంగారం తండాకు చెందిన నూనావత్ మోతీలాల్, మేజ దంపతులకు ఇద్దరు సంతానం. కుమారుడు ఎలక్ట్రికల్ శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తుండగా, కుమార్తె అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో విద్యను అభ్యసించి ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఉద్యోగం చేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో 4వస్థానం పొంది విశ్వస్థాయిలో గుర్తింపు పొందింది. అయితే సోదరుడి నిశ్చితార్థం కావటంతో స్వగ్రామానికి వచ్చిన నూనావత్ అశ్విని (30) శుభకార్యం ముగిశాక శంషాబాద్ నుంచి రాయపూర్‌కి విమాన టికెట్ రిజర్వేషన్ చేయించుకుంది. ఈ క్రమంలోనే విస్తారంగా వర్షాలు పడుతుండటంతో తండ్రి నూనావత్ మోతీలాల్(45) తానే స్వయంగా కారులో హైదరాబాద్‌లో దించేందుకు ఆదివారం తెల్లవారుజామున మరిపెడ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమంలోనే మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని పురుషోత్తమయగూడెం వద్ద ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న విషయం గమనించని వారు నేరుగా వచ్చి ప్రవాహంలో చిక్కుకున్నారు. వెంటనే కారు నుంచి బయటకు దిగిన తండ్రి, కుమార్తెలు అన్నకు కాల్ చేసి తాము వరదలో చిక్కుకున్నామని కాపాడాలని చెప్పారు. సోదరుడు మరిపెడలోని బంధువులకు కాల్ చేసి వివరించి తిరిగి కాల్ చేసే సమయానికి వారి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. దాంతో అనుమానించిన వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం నుంచి ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలో సిరోల్, మరిపెడ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జల్లెడ పట్టాయి. సాయంత్రానికి నీటి ఉధృతి తగ్గటంతో వంతెన సమీపంలో నదిలో కారు చిక్కుకుని కనిపించగా, బాలిని ధర్మారం సమీపంలోని వాగు పరివాహక ప్రాంతంలోని ఒక ఆయిల్ ఫామ్ తోటలో యువ సైంటిస్టు అశ్విని మృతదేహం కనుగొన్నారు. కుమార్తె మృతదేహం దొరికినప్పటికీ, తండ్రి మోతీలాల్ ఆచూకీ ఇంకా దొరకపోవటంతో ఆయా శాఖలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. కుమార్తె మృతదేహాన్ని సిరోల్ పోలీసులు స్థానికుల సహాయంతో వాగు నుంచి ఒడ్డుకు తీసుకుని వచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంపీ ఈటల క్షమాపణ చెప్పాల్సిందే..

- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌కు ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగ క్షమాపణలు చెప్పాల్సిందేనని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ), భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా అనేక అంశాలపై నాగేశ్వర్ వాస్తవాల ఆధారంగా విశ్లేషణలు చేస్తున్నా రని గుర్తు చేశారు. ఆయన అభిప్రాయాలను స్వేచ్ఛగా చెబుతున్నారని తెలిపారు. ఆయన వ్యాఖ్యలను ఈటల వక్రీకరించటమే కాక, అవమానపరిచే విధంగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. రాజేందర్ అనుచరులు, బీజేపీ కార్యకర్తలతో ఫోన్లు చేయించి బెదిరింపులకు పాల్పడటం మానుకోవాలని హెచ్చరించారు.

బెదిరింపు ధోరణి సరికాదు :సీఐటీయూ

ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌ను సూడో మేధావిగా అభివర్ణిస్తూ మాజీ రాష్ట్ర మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. ఈటల మద్దతుదారులు ఆయనపై వ్యక్తిగత దూషణలు, బెదిరింపులకు పాల్పడటాన్ని వ్యతిరేకించింది. ఆదివారం ఈమేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. '15 రోజుల నుంచి అక్రమణకు గురైన చెరువులు, నాలాలపై ప్రభుత్వం నియమించిన హైడ్రా చేపడుతున్న చర్యలపై నాగేశ్వర్ వివిధ ప్రసార మధ్యమాల్లో తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఆయన అభిప్రాయాలను వ్యతిరేకించే స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఉంది. బాధ్యత గల ఎంపీ ఈటలకూ ఉన్నది. కానీ ఆయన్ను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడటం సరైందికాదు. ఎమ్మెల్సీగా, జర్నలిస్టుగా ప్రజాతంత్ర హక్కుల కోసం పోరాడుతున్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రోత్సాహంతో ఆయనపై ఈటల, వారి అనుచరుల తీవ్రమైన నిందారోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. వాటిని పరిగణలోకి తీసుకుని డీజీపీ జోక్యం చేసుకోవాలి. వారిపై కేసు నమోదు చేయాలి' అని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం, సకల జనుల ప్రయోజనాల కోసం శాసన మండలిలో, ప్రజా పోరాటాల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని పోరాడిన ప్రజాప్రతినిధి అని గుర్తు చేశారు. ఈటల వ్యాఖ్యలను రాష్ట్రంలోని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని వారు కోరారు.

యుద్ధప్రాతిపదికన వరద సహాయక చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాజకీయాలకతీతంగా ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన వరద సహాయక చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ఏజెన్సీ, ముంపు ప్రాంతాల్లో ఉన్న గర్భిణీలను గుర్తించి ఆస్పత్రులకు తరలించాలని కోరారు. పాము కాటు, విద్యుత్ షాక్‌లకు గురైన వారికి తక్షణ వైద్య సేవలందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించి, అత్యవసర సాయం అందించేందుకు హెలికాప్టర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు వైద్య సేవలందించాలని కోరారు. విపత్తులో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు, గాయపడ్డ వారికి రూ 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోవటం అత్యంత బాధాకరమనీ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియ జేశారు.

వరదల పర్యవేక్షణ కోసం కంట్రోల్ రూమ్

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సచివాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు.

ఆదివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలెక్టర్లతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వరదలు, వర్షాల పరిస్థితిని సమీక్షించారు. దీనికనుగుణంగా సచివాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నెంబర్ 34లో విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ప్రారంభించారు. 040-2345 4088 అనే నెంబర్‌ను ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలని సూచించారు. వర్షాలు, వరదల పరిస్థితిపై కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సంప్రదించి వారికి కావాల్సిన సహాయ సహకారాలు, తగు సూచనలను కంట్రోల్ రూమ్ ద్వారా అందిస్తారని తెలిపారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

- ప్రభుత్వ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలకు సోమవారం సెలవు ఇస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో జనజీవనం స్తంభించిపోయిందని పేర్కొంది. పలు ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయని తెలిపింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ఈమేరకు ఆదివారం సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు సరికాదు

- సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనల్లో నాయకులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు సరికాదని పలు కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. ప్రపంచంలో శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరు ఈ దాడులను వ్యతిరేకించాలని వారు పిలుపునిచ్చారు. తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా వద్ద సామ్రాజ్యవాద వ్యతిరేక నిరసనలు చేపట్టారు. ఉక్రెయిన్, పాలస్తీనాపై అమెరికన్ సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న అమానుష దమనకాండను, యుద్ధోన్మాద వైఖరిని నిరసిస్తూ అంతర్జాతీయ కార్మికవర్గ స్ఫూర్తితో సెప్టెంబర్ ఒకటిన దేశవ్యాప్తంగా అంతర్జాతీయ యాక్షన్ డే నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంలో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో సామ్రాజ్యవాద నిరసనలు నిర్వహించారు. ఈ నిరసనల్లో భాగంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1946 నుంచి పాలస్తీనియన్ల భూభాగాలను బ్రిటన్-అమెరికన్ సైన్యాలు ఆక్రమించుకున్నాయని తెలిపారు. అనంతరం బ్రిటన్, రష్యా, అమెరికా తదితర దేశాల్లోని యూదుల్ని పాలస్తీనా భూభాగంలోకి చొప్పించడంతో గత 80 ఏండ్లుగా అనేక రూపాల్లో యుద్ధం కొనసాగుతున్నదని చెప్పారు. పశ్చిమ ఆసియా (మధ్య ప్రాచ్యం)లో ఉన్న అత్యంత విలువైన ఇంధన నిల్వలపై తమ పెత్తనాన్ని నిలబెట్టుకోవడానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీని పర్యవసానంగా పాలస్తీనియన్లు నిత్యం అభద్రతలో బ్రతకాల్సి వస్తున్నదనీ, అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధకాంక్షకు వారు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె.వెంకటేష్, ఎస్.రమ, ఎం.పద్మశ్రీ, శ్రీకాంత్, కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.సుధాకర్, వై.సోమన్న, ఎ.సునీత, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి అనురాధ, హైదరాబాద్ నాయకులు శివబాబు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, ఏఐటీయూసీ హైదరాబాద్ సిటీ కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, నాయకులు సీహెచ్.జంగయ్య శ్రీను, అనిల్, సీజీ కన్ఫడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.నాగేశ్వరరావు, ఏఐడబ్ల్యూటీయూ నాయకులు జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

- స్పీకర్‌కు సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఆదివారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, కోశాధికారి నరేష్ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు శాసనసభా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- నాగ్‌పూర్‌లో సురక్షితంగా ల్యాండింగ్

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యవసరంగా సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానం టాయిలెట్‌లో ఈ బెదిరింపు లేఖ కన్పించింది. ఆదివారం ఉదయం 7.55 గంటలకు ఇండిగో విమానం జబల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరింది. దాదాపు 9 గంటల ప్రాంతంలో ఓ ప్రయాణికుడు టాయిలెట్‌లోకి వెళ్లగా కమోడ్ సీటుపై ఒక పేపర్ కన్పించింది.

వర్షాల్లో బయటకు వెళ్లొద్దు

- మాజీ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఎవరూ బయటకు వెళ్లొద్దని భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు (కేటీఆర్) విజ్ఞప్తి చేశారు. చిన్నారులు, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని ఆదివారంనాడొక ప్రకటనలో పేర్కొన్నారు. తాత్కాలిక నిర్మాణాలు, పాడుబడిన భవనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి, సహాయచర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రమాదంలో ప్రాజెక్టు కాల్వలు

కృష్ణా బేసిన్ సమీప ప్రాంతాల్లో భయం

- వరదలు పెరిగి తెగిపోతున్న కాల్వలు
- ఆందోళనలో ప్రజలు
- చేపల వేటకు వెళ్లని మత్స్యకార్మికులు





నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఎగువన నుంచి భారీ వర్షాలు కురుస్తుండటం కృష్ణానది పొంగిపొర్లుతూ శ్రీశైలం ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తుతోంది. దాంతో కృష్ణానదీ సమీప వాసులు బిక్కుమక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. 2009 తర్వాత ఇంత భారీ వరదలు ఎప్పుడూ రాలేదు. ఒకే రోజూ ఆరు లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో గంట గంటకు కృష్ణానది పొంగి పరవళ్లు తొక్కుతోంది. వరదలతో పాటు కాల్వల నుంచి నీరు ప్రమాదంలో ప్రవహిస్తోంది. కాల్వలు తెగి పంట పొలాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉండే కృష్ణా పరిధిలోని సోమశిల, మల్లేశ్వరం, పాతాలగంగ, బీచుపల్లి తధితర ప్రాంతాల్లో వరద ఉధృతి పెరగడంతో చేపల వేటపై నిషేధం విధించారు. సమీపంలోని వ్యవసాయ పొలం పనులు చేసుకునే రైతులు సైతం కృష్ణానది ఉధృతితో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వరద వచ్చి పంటలు ధ్వంసం అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిజ్జపల్లి మండలం లట్టుపల్లి గ్రామంలోని కెఎల్‌ఐడీ -1 అధిక వరదలకు తెగి సుమారు 3వందల ఎకరాలు పత్తి, కంది పంటలు ధ్వంసం అయ్యాయి. కల్వకుర్తి, కోడేరు పరిధిలోని కాల్వల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

కృష్ణానదిలో సెకనుకు 2213 మీటర్ల నీటి ప్రవాహం ఉంటుంది. దేశంలోనే అతి పొడవైన నదిగా కృష్ణకు పేరుంది. సముద్రమట్టానికి 1337 మీటర్ల ఎత్తున మహారాష్ట్రలోని మహబలేశ్వరం దగ్గర చిన్న పాయగా మొదలయిన ఈ నది.. కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తూ.. 14 వందల కిలోమీటర్లు ప్రవహిస్తోంది. ఇందులో దుందుబీ నదితో సహా 120 ఉపనదులు కలుస్తాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నారాయణపేట కృష్ణ మండలం తంగెడి తగ్గర కృష్ణానది అడుగుపెడుతుంది. కాగా, వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణ, తుంగభద్ర, బీమా నదులు పొంగి పొర్లుతున్నాయి. నదిలోకి సుమారు నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలం రిజర్వాయరులోకి చేరుతోంది. నారాయణపూర్ నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు, అల్మట్టి నుంచి 1,78,574 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దాంతో తుంగభద్రకు 34,983 క్యూసెక్కులు, శ్రీశైలానికి 4 లక్షల క్యూసెక్కులు, నాగార్జున సాగర్‌కు 2,95,390 క్యూసెక్కుల నీటిని వదలుతున్నారు. ఈసారి అత్యధికంగా 8 లక్షల క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. గంట గంటకు నీరు పెరుగుతుండటంతో సమీప ప్రజలు భయంతో జీవనం సాగిస్తున్నారు. మల్లేశ్వరం, సోమశీల, పాతాళగంగ తదితర ప్రాంతాల ప్రజలు కృష్ణ ఉగ్రరూపంతో బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా చేపల వేటకు వెళ్లే వారి పరిస్థితి దయనీయంగా మారింది.

నదుల నీటిని లిఫ్టుల ద్వారా పంట పొలాలు, చిన్న రిజర్వాయర్లకు తరలిస్తున్నారు. ముఖ్యంగా కెఎల్‌ఐ ద్వారా సాగు నీటి కోసం కాల్వల నుంచి నీటిని వదలుతున్నారు. గతంలో కల్వకుర్తి మండల పరిధిలోని కెఎల్‌ఐ కాల్వ తెగి వందల ఎకరాల పంట నష్టపోయింది. తాజాగా బిజనపల్లి మండలం లట్టుపల్లి దగ్గర కెఎల్‌ఐ డీ తెగిపోయి సుమారు 4 వందల ఎకరాలు నీట మునిగింది. పత్తి, వరి, జొన్న మక్క, మిరప పంటలకు భారీ నష్టం వాటిల్లింది. ఇంకా కోడేర్ మండల పరిధిలోని కెఎల్‌ఐ మెయిన్ కాల్వలో నీళ్లు నిండుగా వస్తున్నాయి. గతంలోనే ఇక్కడ కాల్వ తెగి పంటలు దెబ్బతిన్నాయి. ఈసారి అటువంటి ప్రమాదం రాకుండా జాగ్రతలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

> **అధిక వరదల దృష్ట్యా అధికారులు అప్రమతం కావాలి**
>
> జిల్లాలో అధిక వర్షాలకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటపొలాలు పరిశీలించి పంటనష్టం అంచనాలను తయారు చేసి రైతులను ప్రభుత్వం అదుకోవాలి. కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.
>
> – వర్థం పర్వతాలు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్



ఖమ్మం..మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహించటంతో జలదిగ్బంధంలో కన్నెగిరి కాలనీ..వంతెనపై నిలిచిన రాకపోకలు
- ఫోటో..అజ్మీరా ప్రవీణ్

త్రిపుర వరద బాధితులకు ఐఆర్‌సీఎస్ సాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్రిపురలో ఇటీవల వరదలకు బాధితులైన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర బ్రాంచ్ సాయమందించింది. త్రిపురలో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన పిలుపుకు స్పందించిన రాష్ట్ర శాఖ ఒక వెయ్యి కుటుంబాలకు సరిపడా పిల్లల ఆహారం, బట్టలు, మస్కిటో నెట్స్, గొడుగులు, సబ్బులు, అత్యవసర మందులు, ఇతర వస్తువులను అందించింది. వీటిని త్రిపురకు పంపేందుకు ట్రక్కును గవర్నర్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న బీరెల్లి కమలాకర్ పదవీ విరమణతో ఈ పదవికి ఖాళీ ఏర్పడింది. దీంతో రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన 33 జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమా వేశంలో లక్ష్మణ్ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి.మోహన్ రెడ్డి, పూల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు పీఎం ఫోన్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎక్కువ నష్టం సంభవించిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రధాని అభినందించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సేవలు అందించే హెలికాప్టర్లను పంపిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున అవసరమైన సాయాన్ని అందిస్తామన్న చెప్పారు.

అభినందనలు : సీఎం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారీ వర్షాల్లో, విరిగిన చెట్ల కొమ్మల మధ్య, ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, పోలీసు, మున్సిపల్ సిబ్బందికి ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ప్రాణనష్టం జరక్కుండా, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో సమర్థ వంతంగా పనిచేస్తున్నారని ఆదివారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలక్కుండా, పక్కా ప్రణాళికతో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది కష్టం సత్ఫలితాలను ఇస్తుందని తెలిపారు.

కాంగ్రెస్ ఫెయిల్

- వరద సాయం చేయట్లే.. : బీఆర్‌ఎస్ నేతల విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వరద ప్రభావిత ప్రజలకు సహాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. వరదల్ని ఎదుర్కొవడంలో ప్రభుత్వం వద్ద ప్రణాళికే లేదన్నారు. కేవలం ప్రతిపక్షాల్ని, కేసీఆర్‌ను తిట్టడానికే మంత్రులు పరిమితమయ్యారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారనీ, ముఖ్యమంత్రి పదవి గౌరవాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని విమర్శించారు. భారీ వర్షాలతో గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనీ, విషజ్వరాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలపై సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. హైదరాబాద్ నగరంలో చెరువులను ఆక్రమించింది కాంగ్రెస్ నాయకులే అని ఆరోపించారు. హైడ్రా అట్టర్‌ప్లాప్ అయ్యిందనీ, దానికి చట్టబద్ధత లేదన్నారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై మాట్లాడితే రేవంత్‌రెడ్డికి సుప్రీంకోర్టు చివాట్లు పెట్టిందని గుర్తుచేశారు.

ఆటలు

ఎదురులేని మెద్వదేవ్

- ప్రీ క్వార్టర్స్‌లో రష్యా స్టార్ ఆటగాడు
- ఇగా స్వైటెక్ సైతం ముందంజ

యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ 2024





టాప్ సీడ్లు ఒక్కొక్కరుగా ఇంటి బాట పడుతుండగా.. ఐదో సీడ్ రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్ మాత్రం దూసుకెళ్తున్నాడు. నొవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాస్‌లు అండర్‌డాగ్ ఆటగాళ్ల చేతిలో దారుణ పరాజయాలు చవిచూడగా మెద్వేదేవ్ మెరుపు విజయాలతో ముందంజ వేశాడు. మెన్స్ సింగిల్స్ విభాగంలో రష్యా ఆటగాడు ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఇగా స్వైటెక్ సైతం ప్రీ క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపింది.

నవతెలంగాణ-న్యూయార్క్

యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ దిశగా రష్యా ఆటగాడు, ఐదో సీడ్ డానిల్ మెద్వదేవ్ ఒడిఒడిగా అడుగులు వేస్తున్నాడు. నొవాక్ జకోవిచ్, కార్లోస్ అల్కరాస్‌లు పోటీ నుంచి నిష్క్రమించటంతో మెన్స్ సింగిల్స్ టైటిల్ వేటలో మెద్వదేవ్‌కు ప్రధాన ప్రత్యర్థులతో పోటీ తప్పింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో మెద్వదేవ్ వరుస సెట్లలో అలవోక విజయం సాధించాడు. 6-3, 6-4, 6-3తో 31వ సీడ్, ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబాలిపై తిరుగులేని విజయం నమోదు చేశాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఇగా స్వైటెక్ సైతం ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. ఉమెన్స్ సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో 25వ సీడ్ అనస్తాసియపై 6-4, 6-2తో వరుస సెట్లలో స్వైటెక్ ఘన విజయం సాధించింది.

సూపర్ మెద్వదేవ్ : పురుషుల సింగిల్స్ టైటిల్ రేసు ఆసక్తికరంగా మారింది. ఫైనల్‌కు చేరతారనుకున్న ఆటగాళ్లు అనూహ్య పరాజయాలు చవిచూశారు. అన్‌సీడెడ్ ఆటగాళ్లు అద్భుతంగా రాణిస్తున్నారు. దీంతో మెన్స్ సింగిల్స్ మ్యాచ్ ఫలితాలపై అభిమానుల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్ మెరుపు విజయం సాధించాడు. మూడు సెట్ల మ్యాచ్‌లో అలవోకగా నెగ్గాడు. 9 ఏస్‌లు కొట్టిన మెద్వదేవ్.. ఏడు బ్రేక్ పాయింట్లతో విజృంభించాడు. ఫ్లావియో మాత్రం రెండు ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో సరిపెట్టుకున్నాడు. పాయింట్ల పరంగా 104-77తో మెద్వదేవ్ పైచేయి సాధించగాడు. మెద్వదేవ్ 18 గేమ్ పాయింట్లు నెగ్గగా.. ఫ్లావియో 10 గేమ్ పాయింట్లు మాత్రమే నెగ్గగలిగాడు. క్వార్టర్‌ఫైనల్ బెర్త్ కోసం పోర్చుగల్ ఆటగాడితో మెద్వదేవ్ తలపడనున్నాడు. ఆసీస్ ఆటగాడు అలెక్స్ డీ మినార్ సైతం మూడో రౌండ్లో విజయం సాధించాడు. 6-3, 6-7(4-7), 6-0, 6-0తో డాన్ ఎవాన్స్ (ఇంగ్లాండ్)పై గెలుపొందాడు. 11 ఏస్‌లు, తొమ్మిది బ్రేక్ పాయింట్లతో అలెక్స్ అదరగొట్టాడు. మరో ఆసీస్ ఆటగాడు జోర్డాన్ థామ్సన్ సైతం ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. 7-6, 6-2, 7-6(7-5)తో మాట్టో అర్నాల్డీపై పైచేయి సాధించాడు. పోర్చుగల్ ఆటగాడు న్యూనో నాలుగు సెట్ల సమరంలో 6-7(5-7), 6-1, 3-6, 7-6(8-6), 6-0తో పైచేయి సాధించాడు. టైబ్రేకర్‌కు దారితీసిన తొలి సెట్‌ను కోల్పోయిన న్యూనో ఆ తర్వాత వరుసగా మూడు సెట్లలో గెలుపొందాడు. అమెరికా ఆటగాడు టామీ పాల్ 6-7(5-7), 6-3, 6-1, 7-6(7-3)తో గాబ్రియల్‌పై గెలుపొందాడు. 8 ఏస్‌లు కొట్టిన పాల్.. 9 బ్రేక్ పాయింట్లు సాధించాడు. పాయింట్ల పరంగా 159-127తో పైచేయి సాధించాడు.

స్వైటెక్ దూకుడు : మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్, టైటిల్ ఫేవరేట్ ఇగా స్వైటెక్ అంచనాలను అందుకుంటోంది. వరుసగా మూడో మ్యాచ్‌లో అలవోక విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది. మూడో రౌండ్ మ్యాచ్‌లో అనస్తాసియపై 6-4, 6-2తో స్వైటెక్ గెలుపొందింది. మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసిన స్వైటెక్.. పాయింట్ల పరంగా 64-45తో ఆధిపత్యం చూపించింది. స్టార్ ప్లేయర్ కరొలినా వొజ్నియాకి 6-3, 6-2తో వరుస సెట్లలో జెస్సికాపై విజయం సాధించింది. మూడు బ్రేక్ పాయింట్లతో వొజ్నియాకి ప్రత్యర్థి ఆటకట్టించింది. 16వ సీడ్ సమ్సోనోవ 6-1, 6-1తో క్రూగర్‌పై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో బీట్రిజ్ 6-3, 6-1తో అనాపై అలవోక విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది.

పారా షట్లర్ల జోరు

- నితేశ్‌కు కనీసం సిల్వర్ ఖాయం
- మరో రెండు మెడల్స్ ఖాయం

పారిస్ 2024 పారాలింపిక్స్



నవతెలంగాణ- పారిస్

పారాలింపిక్స్‌లో టీమ్ ఇండియా జోరు కొనసాగుతుంది. తొలి మూడు రోజుల పోటీల్లో పారా షుటర్లు పతక వేట సాగించగా.. నాల్గో రోజు నుంచి పారా షట్లర్లు మెడల్ రేసును ముందుండి నడిపిస్తున్నారు. ఇప్పటివరకు బ్యాడ్మింటన్‌లో భారత్‌కు కనీసం మూడు పతకాలు ఖాయం అయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో ఎస్ఎల్3 విభాగంలో నితేశ్ కుమార్ ఫైనల్‌కు చేరుకున్నాడు. కీలక సెమీఫైనల్లో జపాన్ పారా షట్లర్ దూసుకె ఫుజిహారాపై నితేశ్ కుమార్ విజయం సాధించాడు. 48 నిమిషాల మ్యాచ్‌లో 21-16, 21-12తో నితేశ్ కుమార్ సత్తా చాటాడు. ఈ విభాగంలో పసిడి పోరుకు చేరుకున్న నితేశ్ కుమార్ నేడు బ్రిటన్ పారా షట్లర్‌తో పసిడి కోసం పోటీపడనున్నాడు. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 విభాగం సెమీఫైనల్లో భారత షట్లర్లే ముఖాముఖి తేల్చుకోనున్నారు. సుహాస్, సుకాంత్‌లు సెమీఫైనల్లో తలపడనున్నారు. ఈ మ్యాచ్‌లో ఎవరు నెగ్గినా భారత్ ఖాతాలో కనీసం సిల్వర్ మెడల్ ఖాయం. మహిళల సింగిల్స్ ఎస్‌యు5 విభాగంలో భారత షట్లర్లు మురుగేశన్, మనీశలు పోటీపడనున్నారు. ఈ మ్యాచ్‌లో సైతం ఎవరు నెగ్గినా భారత్‌కు కనీసం సిల్వర్ ఖాయం. ఓడిన షట్లర్‌కు కాంస్య పతక పోరులో మరో అవకాశం దక్కనుంది. పారాలింపిక్స్ ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో తొలి పతకం సాధించిన ప్రీతి పాల్ మరో మెడల్ రేసులో నిలిచింది. మహిళల 200 మీటర్ల టీ35 విభాగంలో ఫైనల్లో పరుగు తీయనుంది. పురుషుల హైజంప్ టీ47లో నిషద్ కుమార్, రామ్ పాల్‌లు సైతం ఫైనల్‌కు చేరుకున్నారు.

జగన్‌మోహన్‌రావుకు ప్రతిష్ఠాత్మక పురస్కారం



హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావుకు స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఢిల్లీకి చెందిన ఈ సంస్థ ప్రతి ఏడాది క్రీడారంగంలోని ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేసి, సన్మానిస్తుంది. తాజాగా న్యూఢిల్లీలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ ఏడాదికి గాను ఉత్తమ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా జగన్‌మోహన్‌రావుకు స్పోర్ట్స్ ఇండియా ఫౌండేషన్ పురస్కారం ప్రదానం చేసింది. హ్యాండ్‌బాల్, క్రికెట్‌తో పాటు వివిధ క్రీడాంశాలకు చెందిన క్రీడాకారులకు జగన్‌మోహన్ రావు వ్యక్తిగతంగా అందిస్తున్న ప్రోత్సాహం, క్రీడా రంగ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు.

బదిలీ అయినా అక్కడే తిష్ట

- నెల రోజుల్లో అన్ని బిల్లులు క్లియర్
- సిద్ధిపేటలో ఆ వైద్యాధికారి తీరే ఇందుకు నిదర్శనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకవైపు ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం పెంచాలని ప్రయత్నిస్తున్నది. మరోవైపు కొంత మంది అధికారులు మాత్రం ఇవేమీ పట్టనట్టుగా తమ పాత పద్ధతుల్లోనే ముందుకెళ్తున్నట్టు తెలుస్తున్నది. బదిలీలు, పదోన్నతులతో ఉద్యోగుల్లో ఉత్సాహం నింపుతూ వారి ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ప్రభుత్వ ప్రయత్నం. అయితే బదిలీల తర్వాత కూడా కొంత మంది అధికారులు తమ పూర్వ స్థానాల నుంచి కదలకుండా తిష్ట వేసుకుని కూర్చున్నారని ఉద్యోగుల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. సిద్ధిపేట గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొని ఉన్నట్టు సమాచారం.ఆస్పత్రికి సంబంధించిన టెండర్లలో ఒక్కో టెండర్‌లో 40 శాతం కమీషన్ తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. చాలా సంస్థల్లో తాము పని చేశామనీ, ఇంత పెద్ద మొత్తంలో తమను కమీషన్ ఎవరూ అడగలేదని వెండర్లు చెప్పుకోవడం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. ఉన్నతాధికారులెవరూ అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. పైపెచ్చు ఇటీవల జరిగిన బదిలీల్లో ఆస్పత్రి ఉన్నతాధికారి వరంగల్‌కు బదిలీ అయినప్పటికీ వెళ్లకుండా ఆస్పత్రిలోనే తిష్ట వేసుకుని కూర్చున్నారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఏండ్ల తరబడి బిల్లులకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేయకపోగా, బదిలీ అయిన నెల రోజుల్లోనే మొత్తం ఫైళ్లను క్లియర్ చేసినట్టు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసం ఒక్కసారిగా లక్షలాది రూపాయల బిల్లులు క్లియర్ అయినట్టు తెలుస్తున్నది. దాదాపు రూ.50 లక్షల బిల్లులను నెల రోజుల్లో క్లియర్ చేసినట్టు తెలుస్తున్నది. దీనిపై శాఖాపరమైన విచారణ చేపడితే నిజాలు బయటికి వస్తాయని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. మహిళా ఉద్యోగుల పట్ల సార్ ప్రవర్తన కూడా బాగోలేదని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తున్నది.

మాటలతో, చేష్టలతో వేధిస్తుండటంతో అక్కడ పని చేయడం ఇబ్బందిగా ఉందని మహిళా ఉద్యోగులు వాపోతున్నారు. ఇంక్రిమెంట్స్, సర్వీస్ బుక్స్‌కు సంబంధించిన పనులు పూర్తి కావాలన్నా కూడా ఈ అవినీతి అధికారి చేతులు తడపాల్సిందేనని చెబుతున్నారు. ఆస్పత్రికి సంబంధించిన అవినీతి కార్యక్రమాలను కూడా నేరుగా కాకుండా పట్టణంలోని ప్రముఖ ప్రింటింగ్ ప్రెస్ ప్రొప్రైటర్ ద్వారా చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా రాష్ట్రంలోని ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్ది ఉద్యోగులకు భద్రత, రోగులకు మెరుగైన సేవలందించాల్సిన అవసరమున్నది.

> **సమగ్ర విచారణ జరిపించాలి**
>
> సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) కార్యదర్శి బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్న డాక్టర్ కిషోర్ కుమార్‌పై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విజిలెన్స్ విచారణ జరిపి నిగ్గు తేల్చాలన్నారు.
>
> -బైరపాక శ్రీనివాస్

మహేశ్వరం ప్రజలకు అండగా ఉందాం : కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్



రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు అండగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు కాంగ్రెస్ నాయకులు సహాయ కార్యక్రమాలు చేయాలని సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో శ్రీరామ్ కాలనీ, ఫహాడిషరీఫ్, కొత్తపేట ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వలతో అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని హెల్త్, మున్సిపల్ శానిటరీ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్లను కోరారు. మహేశ్వరం, కందుకూరు మండలాల్లో రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల దగ్గర జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బడంగ్‌పేట, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో రోడ్లు దెబ్బతిన్నాయని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోచమ్మ అమ్మవారి కల్యాణంలో ఉప్పల

నవతెలంగాణ -నాగోల్



ఎల్బీనగర్‌లోని ఎరుకల నాంచారమ్మ కాలనీ ఆదర్శ్ నగర్ డబుల్ బెడ్ రూమ్‌లో జరిగిన శ్రీశ్రీశ్రీ గాలి పోచమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన వంతుగా ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, చైర్మెన్ రుపాని లింగ స్వామి, ప్రధాన కార్యదర్శి భీమన పల్లి సిద్దు లు పాల్గొన్నారు.

నగరాన్ని వణికిస్తున్న వాన







ఫణిగిరి కాలనీలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ -ఎల్బీనగర్

చైతన్యపురి డివిజన్‌లోని ఫణిగిరి కాలనీలో కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్త ఆదివారం పర్యటించారు. భారీ వర్షాలకు మూసీ దగ్గర ఉన్న ఇండ్లు మునిగిపోతున్నాయని తెలుసుకొని కార్పొరేటర్ అక్కడకు చేరుకున్నాడు. వెంటనే ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఏఎస్‌తో మాట్లాడి.. జేసీబీ తెప్పించి అక్కడ ఉన్న నాలాను క్లియర్ చేయించారు. కార్పొరేటర్ వెంట బీజేపీ నాయకులు వినోద్ యాదవ్, వెంకన్న, అంజిబాబు, రాకేష్, రాంమోహన్, కాలనీ పెద్దలు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్



భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసరమైతేనే ఇంటి నుండి బయటకు రావాలని ప్రజలకు సూచించారు. మరో 2 రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా చూసుకోవాలని, రైతులు పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ఉండే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో 984803-3090నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలన్నారు.

వర్షంలో పర్యటించిన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

నవతెలంగాణ-ఎల్బీనగర్

నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలమయమై లోతట్టు ప్రాంతాలను ఆదివారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐ ఏ ఎ స్ పరిశీలించారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై వర్షపు నీరు చేరకుండా, వాహనదారులకు ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షం నీటితో రోడ్లు జలమయం కాకుండా జీహెచ్ఎంసీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎల్బీనగర్ మెట్రో స్టేషన్ వద్ద నాలాలో వర్షను నీరు చేరి పేరుకుపోయిన చెత్తను జీహెచ్ఎంసీ తొలగించి..నాలాలో నీరు సాఫీగా పోయే విధంగా చర్యలు తీసుకున్నారు. తర్వాత లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తూ కాలనీలల్లోకి నీరు రాకుండా ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఇంజనీరింగ్ అధికారులు ఉదయం నుండే కాలనీలో పర్యటిస్తూ వర్షపు నీరు రోడ్లపైన చేరకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. జోనల్ కమిషనర్ ఉదయం నుండి సాయంత్రం వరకు వర్షంలో తడుస్తూ తిరుగుతూ రోడ్లపైన వర్షం నీరు చేరకుండా జీహెచ్ఎంసీ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. జాతీయ రహదారి పైన ట్రాఫిక్ రద్దీ లేకుండా ట్రాఫిక్ సాఫీగా వెళ్లే విధంగా చూశారు. అన్ని విభాగాల సిబ్బందిని అప్రమత్తం చేసి ఎల్బీనగర్ నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ బాటిల్ చూశారు. వర్షంలో పర్యటించిన కమిషనర్‌ను స్థానికులు అభినందించారు. జోనల్ కమిషనర్ వెంట ఇంజనీరింగ్ అధికారి కార్తీక్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పలు కాలనీలలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెట్లు, ఐమాక్స్ లైట్ పోల్ విరిగి పోయాయి. అంతేకాదు డ్రైనేజీలు పూర్తిగా నిండి కాలనీల్లోకి మురుగు నీరు చేరాయి. అందుకు మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది వర్షాన్ని సైతం పట్టించుకోకుండా సహాయక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అల్మాస్‌గూడ 24వ డివిజన్ పరిధిలో ఉన్న వైఎస్ఆర్ నగర్ నల్ల పోచమ్మ దేవాలయం సమీపంలో చెట్టు కూలిపోయింది. ఆ చెట్టును వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. అదేవిధంగా 9వ డివిజన్‌లో పడిపోయిన ఐమాక్స్ పోల్‌ను తొలగించారు. 21వ డివిజన్‌లో వర్షపు నీటితో నిండిన నాలాను శుభ్రం చేశారు. 30వ డివిజన్ పరిధిలో కూలిన చెట్లును జేసీబీ సహాయంతో తొలగించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్ పరిధిలో శానిటేషన్ సిబ్బంది ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని కమిషనర్ రఘు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నేరుగా మున్సిపల్ అధికారులకు పోన్ చేయాలని కోరారు.

వర్షాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్

నవతెలంగాణ - ఎల్బీనగర్



తెలంగాణ రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ కూడా ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాలాలు, వరద కాల్వలు, డ్రయినేజీ మూతలు, లైన్ దగ్గరికి ప్రజలెవరూ వెళ్ళవద్దని కోరారు. ముఖ్యంగా తల్లీదండ్రులు తమ పిల్లలను ఇంటి నుండి బయటకి పంపవద్దని సూచించారు. చెరువులు, కుంటలు, వాగుల వద్ద వరద ప్రభావం భారీగా ఉందని, వాటివైపు ప్రజలు వెళ్ళవద్దని చెప్పారు. అత్యవసర పరిస్థితులు ఉంటేనే ఇంటి నుండి బయటకు రావాలని సూచించారు. ప్రజలందరూ స్వీయ జాగ్రత్తలు పాటించడం అత్యంత ముఖ్యమని అన్నారు. వర్షాల పట్ల ప్రభుత్వం కూడా అప్రమత్తంగా ఉందని ప్రాణహాని, ఆస్తి నష్టాలు జరగకుండా జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేసి తగిన జాగ్రత్తలు చేపడుతుందని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలుంటే జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు.

భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అందెల శ్రీరాములు యాదవ్

నవతెలంగాణ-బడంగ్‌పేట్



గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. మీ ప్రాంతాల్లో తడిసిన కరెంటు స్థంబాలకు దూరంగా ఉండాలన్నారు. పంట పొలాల్లో రైతులు విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు కార్యకర్తలు సహాయ సహకారాలు అందించాలని కోరారు.











కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి 30మంది యువకులు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం పరిధి జల్‌పల్లి మున్సిపాలిటీ సాదత్ నగర్ కాలనీ కాంగ్రెస్ పార్టీకి చెందిన 30 మంది కార్యకర్తలు ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హమీద్ షర్ఫుద్దీన్, సీనియర్ నాయకులు బదర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్టు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ 30 మందికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మా ప్రాంత అభివృద్ధి గడిచిన ఎనిమిది నెలల్లో శూన్యం అన్నారు. గతంలో మాజీ మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప.. ప్రస్తుత పరిస్థితుల్లో మా కాలనీల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఆ పార్టీలో ఇమడలేక మా కాలనీ అభివృద్ధి జరగాలంటే అమ్మ సబితా ఇంద్రారెడ్డితోనే సాధ్యమని భావించి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన యువకులకుసముచిత స్థానం కల్పిస్తానని, పార్టీ కోసం మరింత కష్టపడి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





'చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి'



నవతెలంగాణ - నాగోల్ /ఎల్బీనగర్

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీదేవి, పూర్వ విద్యార్థుల సంఘం (నోసా)ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్, కోకో క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను ఆదివారం నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం(నోసా) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగోల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటాలని కోరారు. పాఠశాలలో శనివారం జరగాల్సిన ఎస్‌జీఎఫ్ కబడ్డీ టోర్నమెంట్ వర్షాల కారణంగా వాయిదా వేశామని తెలిపారు. ఈ పోటీలను త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నోసా ఫౌండర్ టీంతో పాటు సహకారం అందించిన 2002-03 బ్యాచ్ టీం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నోసా ప్రెసిడెంట్ కంది కటి ఖన్నా గౌడ్, ఉపాధ్యక్షుడు బొద్దుపల్లి సురేష్, సిద్ధి రమేష్, సంయుక్త కార్యదర్శి పల్లే లింగం గౌడ్, డోనార్స్ కమిటీ సభ్యులు జిల్యపల్లి శ్రీనివాస్ రెడ్డి, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాళ్ళ ఉమామహేశ్వర్ గుప్త, మునిందర్ రెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శి బోడ్డుపల్లి మహేందర్, అజాద్, అజ్జు కిషన్, సలహాదారుడు మెండు వెంకట్ రెడ్డి, నోసా జూనియర్ టీం 2002-23 బ్యాచ్ సభ్యులు డి. జగదీశ్వర్, జనగాం సహదేవ్, స్వాతి రెడ్డి, కండికంటి సాయిబాబా, నిమ్మల రంజిత్ రెడ్డి, మూల లింగం గౌడ్, గుండెల చంద్రమోహన్, ఎం. నరసింహ, చితుల్ల వినోద్ గౌడ్, బోద్దుపల్లి రాధిక, సిరిగిరి కరుణాకర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పుస్తకాల బహుకరణ

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని కేంద్రంలో ఉన్న రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రానున్న గ్రూప్ 1, 2కు సిద్ధమవుతున్న విద్యార్థులకు కీ.శే. పి.రాములు పి. తులసి రత్నంల జ్ఞాపకార్థం పి. దేవేంద్ర రావు, రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం కాంపీటిటీవ్ పుస్తకాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు లేక ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి అవకాశాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లీదండ్రుల జ్ఞాపకార్థం ఈ పుస్తకాలను అందజేసినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షల నిపుణులు, తెలంగాణ గ్రూప్ అధికారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి యం.మనోజ్ కుమార్, లైబ్రరీయన్లు ప్రతాప్, సత్యనారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ప్రమాదకరంగా విద్యుత్ ఐరాన్ పోల్..

● పొంచి ఉన్న ప్రమాదం ● కరెంట్ తీగలు ఆధారం ● భయాందోళనలో ప్రజలు

నవతెలంగాణ-ధూల్ పేట్

పాతబస్తీ హుస్సేని అలం, దూద్ బౌలిలో విద్యుత్ ఐరాన్ పోల్ మధ్యలో పూర్తిగా తుప్పు పట్టి విరిగి పడి పోయే ప్రమాదకరంగా మారింది. కరెంట్ తీగల ఆధారంగానే నిలిచి ఉంది. ఐరాన్ పోల్ కావడంతో ఆ పోల్‌కు కరెంట్ షాక్ వస్తుంది.. దీనికి ఎడతెరపి లేకుండా కురుసుతున్న వర్షంతో ఎక్కడ అర్తింగ్ కరెంట్ షాక్ వస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈ ఐరాన్ పోల్ వర్షానికి, ఏ చిన్న పాటి గాలి వీచిన పడిపోతే పెను ప్రమాదం తప్పదు. జనవాసల మధ్యలో ఉండటంతో ఎప్పుడు ఎలాంటి పమాదం చోటు చేసుకుంటుందొనని భయాందోళనకు గురవుతున్నారు. అయిన అధికారులు స్పందించక పోవడం విశేషం.. ఇప్పటికైనా చార్మినార్ సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించి, ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులకు జల కళ



నవతెలంగాణ-ఆమనగల్

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరుధలతో చెరువులకు జల కళ వచ్చింది. ఆమనగల్ కడ్తాల్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న చెరులు, కుంటలకు వరదనీరు చేరడంతో అవి నిండు కుండల్లా మారుతున్నాయి. అదేవిధంగా గత సంవత్సరం నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా భూగర్భ జలాలు అడుగంటి పోయి బోరు బావుల్లో నీటి శాతం తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో నీటి శాతం పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భావజాలలకు అతీతంగా పనిచేసే వ్యక్తి దిలీప్ కుమార్

● తెలంగాణ ఏర్పాటులో ఆయనది చురుకైనా పాత్ర
● కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అనేక విషయాల్లో మార్గదర్శకం చేసిన వ్యక్తి : హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ
● 'తెలంగాణ ఉద్యమంలో కొన్ని ముఖ్య ఘట్టాలు' పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్టీలు, భావజాలాలు ఏవైనా కలిసి పని చేద్దామనే మనస్తత్వం గల నాయకుడు మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. 2014లో కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తను అనేక విషయాల్లో మార్గదర్శకం చేశారని గుర్తుచేసుకున్నారు. ఆదివారం కింగ్ కోఠిలో గల భారతీయ విద్యా భవన్‌లో మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్ రచించిన 'తెలంగాణ ఉద్యమంలో కొన్ని ముఖ్య ఘట్టాలు' అనే తెలుగు పుస్తకాన్ని గవర్నర్ దత్తాత్రేయ ఆవిష్కరించగా, 'అన్ రిటన్ పేజెస్ ఇన్ హిస్టారిక్ తెలంగాణ స్ట్రగుల్' అనే ఇంగ్లీష్ పుస్తకాన్ని రాష్ట్రీయ లోక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ మలూక్ నగర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దిలీప్ కుమార్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. మంచి మేధావి, చక్కగా విషయాలు చెప్పగల జ్ఞాని అని అన్నారు. కేసీఆర్‌తో పని చేసి... ఆ తర్వాత ఆయనతో విభేదించి... ఇండిపెండెంట్ పార్టీ పెట్టి ఉద్యమాన్ని నడిపారన్నారు. కేంద్రమంత్రిగా తన హయాంలో జాబ్ మేళాలు నిర్వహించి ఎంతో మందికి ఉపాధి కలిపించడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. భావజాలలకు అతీతంగా అందరిని కలుపుకుపోయే వ్యక్తి దిలీప్ కుమార్ అని కొనియాడారు. రాష్ట్రీయ లోక్ దళ్ నేషనల్ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ మలూక్ నాగర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులో అజిత్ సింగ్ పాత్ర ఉందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉద్యమకారులు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. అజిత్ కొడుకు జయంత్ చౌదరి వివిధ కారణాల వల్ల రాలేక పోయారని, వారి తరపున తానొచ్చినట్టు చెప్పారు. దిలీప్ కుమార్ ఉత్తర ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లోకి వెళితే, తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చిన వ్యక్తిగా గుర్తిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ తాను దిలీప్ కుమార్ శాసన మండలిలో బెంచ్ మేట్స్ అని అన్నారు. దిలీప్ కుమార్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దిలీప్ చరిత్రే తెలంగాణ చరిత్ర అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ దిలీప్ కుమార్ పుస్తకం చదువుతుంటే 50వ దశకంలో తెలంగాణ మన కండ్ల ముందు నడుస్తున్న అనుభూతి కలుగుతుందన్నారు. పుస్తకంలో ఆయన వాడిన శైలి అద్భుతంగా ఉందని కొనియాడారు. దిలీప్ పుస్తకంపై సమీక్ష చేయడంతో పాటు అన్ని గ్రంథాయలల్లోకి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ దిలీప్ కుమార్‌ని అన్ని ఐడీయాలజీలు కలిగిన ప్రజలు గౌరవిస్తారన్నారు. ప్రజస్వామిక, సామాజిక తెలంగాణ కోరుకున్న వారిలో దిలీప్ కుమార్ ఒకరని, భవిష్యత్ తెలంగాణకు ఈ బుక్ దిక్సూచి కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. అరుణోదయ చైర్‌పర్సన్ విమలక్క మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ మాత్రమే మిలిటెంట్ పోరాటాలు చేసిందన్నారు. అందరం కలసి తెలంగాణ అమరుల ఆశయం నెరవేరుద్దామని ఆమె పిలుపు నిచ్చారు. జయ వింధ్యాల మాట్లాడుతూ ఈ పుస్తకంలో కేసీఆర్ మరో కోణం కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి పీసీసీ అధికార ప్రతినిధి కత్తి వెంకటస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో దైవజ్ఞ శర్మ, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మధు సత్యం గౌడ్, రమణారెడ్డి, పాండురంగా రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పితృస్వామ్య వ్యతిరేక పోరాటంలో.. పురుషులనూ భాగస్వామ్యం చెయ్యాలి





● ప్రొ. శాంతా సిన్హా

నవతెలంగాణ-ముషీరాబాద్

పితృస్వామిక భావజాల వ్యతిరేక పోరాటంలో పురుషులను కూడా భాగస్వామ్యం చెయ్యాలని ప్రొ.శాంతా సిన్హా (పీఓడబ్ల్యు ఆహ్వాన సంఘం అధ్యక్షులు) అన్నారు. ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభలు రెండోరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ఈ సభలో ప్రగతిశీల మహిళా సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి అందే మంగ అమరవీరుల సంతాప తీర్మానం ప్రవేశ పెట్టగా,రెండు నిముషాలు మౌనం పాటించి, మహిళా ఉద్యమ అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ శాంతా సిన్హా హాజరై ప్రారంభ ఉపన్యాసం చేశారు. మహిళలు తమపై జరుగు తున్న హింసకు వ్యతిరేకంగా గొంతు పెంచాలని అన్నారు. ఇక హింస చాలు మకూ హక్కులున్నాయి వాటిని పాటిం చండి అని గట్టిగా చెప్పాలని అన్నారు. పితృస్వామిక భావ జాలం ఈ హింసకు కారణం కాబట్టి దానికి వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఆ పోరాటంలో కలిసి వచ్చే పురు షులను కూడా భాగస్వామ్యం చెయ్యాలని పిలుపునిచ్చారు. అలాగే వాతావరణ మార్పులపై కూడా అవగాహన పెంచుకోవాలని, అది మహిళల జీవితాలపై చాలా ప్రభావం చూపుతుందని అన్నారు. వాతావరణ మార్పులు వల్ల వ్యవసాయం సరిగా లేక వలసలు పెరిగాయి.. అందు వల్ల కుటుంబ పోషణలో స్త్రీలు ఒత్తిడి ఎదుర్కుంటున్నారని అన్నారు. కాబట్టి పర్యావరణ పరిరక్షణ పోరాటం చెయ్యాలని పిలుపునిచ్చారు.

ప్రొఫెసర్ రామ మేల్కోటే మాట్లాడుతూ.. ప్రగతిశీల మహిళా సంఘం ఏర్పడి 50 సం॥.లు అయ్యింది ఆనాటి నుండి నేటికీ సమాజ పరిస్థితుల్లో దారుణమైన మార్పులు వచ్చాయి అన్నారు. కానీ వాటిని పట్టించుకునే స్థితిలో పాలకులు లేరు అని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు హింస సాధారణమైందని అన్నారు. కులం పేరుతో మతం పేరుతో హింస పెరిగిందని అన్నారు. ప్రజాస్వామిక దేశంలో హింసకు కారణం ఏంటి అనేది ఉద్యమాలు గుర్తించాలి. ముఖ్యంగా ప్రగతిశీల ఉద్యమాలకు ఆ బాధ్యత ఉంది అన్నారు. ప్రొ. మేరీ జాన్ మహిళపై ఆర్థిక పాలసీలో ప్రభావం అనే అంశంపై మాట్లాడారు. ఉన్నత విద్యలో మహిళలు పెరుగుతున్న పరిస్థితుల్లో ఉద్యోగాల్లో మాత్రం మహిళల ప్రాతినిధ్యం పెరగక పోవటం కు కారణాలు చూడాలని అన్నారు. తను చేసిన రీసెర్చ్ లో ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థినులపై జరిగే లైంగిక హింసపై సరైన అవగాహన అక్కడి పలక వర్గాలకు లేదని అన్నారు. ఉన్నత విద్యారంగంలో ఉన్న జెండర్ సమానత్వం మిగతా రంగాల్లో ఎందుకు లేదు అనేది మహిళా ఉద్యమాలు సమీక్షించాలని అన్నారు. అందుకు కారణాలు అన్వేషించి పోరాటాల రూపొందించాలని అన్నారు. ఉద్యోగ రంగాల్లో మహిళలపై పెరుగుతున్న హింస, వేతనాలు తక్కువ ఉండటం మహిళా ఆర్థిక స్వాతంత్ర్యం పై ప్రభావం చూపుతుందని అన్నారు. దీనిపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.ఝాన్సీ, అందే మంగ, ఉపాధ్యక్షులు అనసూయ, డా.సరిత, జ్యోతి, కార్యదర్శులు సీత, జానకి కోశాధికారి గీత, నగర నాయకులు కావేరి, పుష్ప తదితరులు పాల్గొన్నారు

ఘజల్ ప్రక్రియకు తెలుగు భాషలో విశిష్టత



నవతెలంగాణ-కల్చరల్

దాశరథి సి నారాయణ రెడ్డి మహా కవులు ఫార్సీ భాషకు చెందిన ఘజల్ ప్రక్రియను తెలుగు భాషలో విశిష్ట స్థాయికి తెచ్చారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు. మహిళ కవయిత్రులు సమాజిక మాధ్యమ వేదికగా ఎన్నో వైవిధ్య రచనలు చేస్తున్నారని ఘజల్ ప్రక్రియలో రచన చేసే వారు సమూహంగా సామాజిక మాధ్యమ వేదికపైకి రావటం హర్షణీయం అని అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై తెలంగాణ కవయిత్రులు వేదిక వాట్స్ అప్ సమూహం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. డాక్టర్ గద్దం శ్యామల రచించిన సాహిత్య దీపిక వ్యాస సంపుటి నీ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య ఎస్. వి. రామా రావు ఆవిష్కరించి మాట్లాడారు. శ్యామల విభిన్న అంశాలు తన వ్యాసాలలో చర్చించారని ప్రశంసించారు. ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అధ్యక్షత వహించిన సభలో రచయిత సూరారం శంకర్ ఘజల్ సంకలనం సాంధ్య వర్ణాలు సంపుటిని ఆవిష్కరించి తొమ్మిది రంగుల ఇంద్ర ధనుస్సులా సంపుటిలోని ఘజల్స్ ఉన్నాయని వివరించారు. శాంతి కృష్ణ అతిథిగా పాల్గొని శ్యామల రచించిన స్వరంజలి భక్తి గీతాల సంపుటిని ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమాన్ని ముకుంద సుబ్రహ్మణ్య శర్మ, సుబ్బా జ్యోత్స్న, డాక్టర్ శ్యామల, జ్యోత్స్న శివ లక్ష్మి నిర్వహించారు.

'ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి'



● సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో రెండు రోజుల పాటు కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహా నగరానికి వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుండి వచ్చి జీవనం సాగిస్తున్న ముంపు ప్రాంతాల ప్రజలకు పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఒక పక్క భారీ వర్షాలు, మరొక పక్క డెంగీ జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలను దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేషెంట్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేములవాడ నుంచి మహబూబాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు భారీ వరదలో నిలిచిపోయిందని, బస్సులో ఉన్న ప్రయాణికులు బిక్కు బిక్కు మంటూ నీళ్లు, తినడానికి ఆహారం లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులను పట్టించుకునే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ఆ ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేరేలా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని చిన్నారులు, వృద్ధులు ఇళ్లలోనే ఉండాలని, పాత భవనాలలో నివసించే వారు తగు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. ఇలాగే వర్షాలు కొనసాగితే స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంధం లక్ష్మీనారాయణ, ఏఐడీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు బి.సుజాత, ఏఐడబ్ల్యూటీయు రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.ఝాన్సీ, ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి.భానుప్రసాద్, పార్టీ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ పి.జ్యోతి, పి.సంధ్యారాణి, వి.నాగేంద్రమ్మ, బి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో.. సర్పంచ్‌ల పాత్ర కీలకం



నవతెలంగాణ-ముషీరాబాద్

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని వారికి రావలసిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ ట్రిబ్యునల్ మెంబర్ పులి గారి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం గ్రామ సర్పంచ్‌ల సమస్యలపై పత్రికా ప్రకటన ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. దేశంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామపంచాయతీల అభివృద్ధిని చూసి పక్క రాష్ట్రాలు ఇక్కడి సంక్షేమ పథకాలను అనుసరిస్తు న్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులే కథానాయకులని వారి కృషి వల్లనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఉత్సాహవంతులైన యువ సర్పంచులు తమ గ్రామాభివృద్ధిలో పనులు చేయడానికి తగిన ఆర్థిక స్తోమత లేకున్నా వడ్డీలకు డబ్బులు తెచ్చి పనులు చేయిస్తున్నారని తెలిపారు. అలా తమ చేపట్టిన అభివృద్ధి పనులకు రాష్ట్రంలో గ్రామ సర్పం చ్లకు అనేక జాతీయ అవార్డులు వచ్చాయి.. అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పదవీకాలం ముగిసిన 8 నెలలు కావస్తున్న అధికారులు, మంత్రులు, సర్పంచుల విన్నపాలకు స్పందించక పోవడం సర్పంచుల కుటుంబాలకు తీవ్ర, ఆర్థిక ఇబ్బందుల్లో పాటు మానసిక ఆందోళన ఎదుర్కొంటున్నారు అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించే రాష్ట్ర ప్రభుత్వము మానవతా హృదయంతో నైతిక బాధ్యత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి సర్పంచుల్లో నమ్మకాన్ని విశ్వాసాన్ని పెంచి ప్రభుత్వ పనులు చేయడానికి పోటీపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి'



● జీహెచ్ఎంసీ సర్కిల్-16 డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని జీహెచ్ఎంసీ సర్కిల్-16 డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్, ఏఎంహెచ్ఓ హేమలత సూచించారు. ఎడతెరిపి కురుస్తున్న వర్షానికి ఆదివారం హిమాయత్ నగర్‌లోని వీధి నెంబర్.5లో చెట్లు కూలీ నేలకొరిగాయి.. దీంతో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు మారుతి దివాకర్, ఏఎంహెచ్ఓ హేమలత, పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే స్పందించి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ మహా నగరంలో మ్యాన్ హోల్స్ అధికంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. చిన్న పిల్లలు, వృద్ధులు వర్షాల కారణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరంగా కురుస్తున్న వర్షాలతో కరెంట్ స్తంభాలను పట్టుకోవద్దని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, ఈ సందర్భంలో వైద్యులు ఆస్పత్రులలో అందుబాటులో ఉండాలని సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హిమాయత్ నగర్ డివిజ న్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మరి ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని వారు సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలి

● ప్రమాదకర భవనాల్లో ఉంటున్న ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
● అధికారులు అప్రమత్తంగా ఉండాలి
● సమస్యలు, ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి
● ప్రజల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు అధికారులు వెంటనే స్పందించాలి: హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో రెడ్ ఎలర్ట్ నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆస్తి, ప్రాణనష్టం సంభవించకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలను ఎప్పడికప్పుడు అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. ఆదివారం జియగూడ మండి పక్కన మూసి వరద నీటి ప్రవాహ వేగాన్ని కలెక్టర్ పరిశీలించి లోతట్టు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున చెరువులు, కుంటలు అలాగే మూసి వరద నీటి నిల్వలను ఎప్పడికప్పుడు పరిశీలన చేయాలనీ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లలో వరద నీరు చేరడం వలన గేట్లు ఎత్తి మూసిలోకి వదలడం జరుగుతుందని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి రెండు గంటల ముందు సహాయ శిబిరాలకు తరలించాలన్నారు. ఎక్కడ ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే ప్రజలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 040-23202813/ 9063423979 కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలనీ, ప్రజల నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌పై సత్వరమే స్పందించాలన్నారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వైద్య శాఖలు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

వరద ఉధృతి దృష్ట్యా ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా మూసి పరివాహక ప్రాంతం, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి సమర్థవంతంగా సమన్వయంతో కలసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ నుంచి ఆయన జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై సత్వరమే స్పందించాలని, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో వచ్చే వరదను గేట్ల ద్వారా మూసికి వదలడం జరుగుతుందన్నారు. మూసి పరివాహక ప్రాంతాల ప్రజలను సహాయక శిబిరలకు తరలించాలని తెలిపారు. చెట్లు విరగడం, రోడ్లు దెబ్బతినడం, పాత గోడలు పడిపోవడం వంటి సంఘటనలు ఉంటే సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు ఇండ్ల నుంచి బయటకు రాకుండా అవగాహన కల్పించి.. ఎప్పటికప్పుడు నివేదికలు అందచేయాలనీ ఆదేశించారు. వర్షాల వలన పాఠశాలలు, గురుకులాల్లో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండ మెరుగైన వైద్య సేవలు అందాలని వైద్యాధికారులను ఆదేశించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో ఆర్డీవోలు నిరంతరం పర్యవేక్షణ చేయాలనీ, అలాగే కంట్రోల్ రూమ్‌లలో అనుబంధ శాఖల అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తదుపరి హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల వారీగా మండలాల్లో చేపడుతున్న చర్యలపై తహసీల్దర్లతో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు కదిరివన్, ఈ.వెంకటాచారి, ఆర్డీవోలు జ్యోతి, దశరథసింగ్ తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున వాతా వరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు నేడు(సోమవారం) సెలవు ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఈ ఆదేశాల ను పాటించాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు సోమవారం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

'హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సేవలు మరువలేనివి'

నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇటీవల ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య సంతాప సభ ఆదివారం ఆయన స్వగ్రామంలో జరిగింది. సభలో కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని మాట్లాడారు. తన విధులపట్ల అంకిత భావంతో పనిచేసిన మల్లయ్య ఈప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తమ వంతు సహాయంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.30 వేలు ఆర్థికసాయాన్ని వారు మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సబావత్ బిచ్యా నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, సీనియర్ నాయకులు జహంగీర్ అలి, చందులాల్, జగన్, రవి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మల్లేష్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-యాచారం

మల్కీజ్‌గూడ మాజీ సర్పంచ్ నానకంపేట మల్లేష్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. యాచారం మండల పరిధిలో మల్కీజ్‌గూడ మాజీ నానకంపేట మల్లేష్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ ఎంపీపీ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామానికి మొదటి సర్పంచిగా పనిచేసి ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధికి ఆయన నిరంతరం పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, కాంగ్రెస్ నాయకులు గౌరవరం వెంకట్ రెడ్డి, చింతపట్ల మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, చీర శేఖర్, సాయిబాబు, యాదయ్య, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- గ్రేటర్ పరిధిలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, హైడ్రా అధికారులు ప్రతి క్షణం అప్రమత్తండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా దాన కిశోర్ మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, శిథిల, ప్రమాదకర భవనాల్లో ఉంటున్న ప్రజలను గుర్తించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తమ పరిధిలోని లేక్‌లు, నీటి వనరులపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. హిమాయత్‌సాగర్, గండిపేట, హుస్సేన్ సాగర్ నీటి మట్టాలను గమనిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సీనియర్ అధికారులు, ఉప కమిషనర్‌లు, ఇతర మున్సిపల్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజా ఫిర్యాదుల, సమస్యల పై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని సూచించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నాలాను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాద వరద కాలువలను గుర్తించి హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జలమండలి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న సైట్స్‌లలో బిల్డింగ్ కార్మికులు, లేబర్స్‌ను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నాళాలు. అప్రోచ్ నాళాలు ఉన్న ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్స్ ద్వారా ప్రచారం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

హై అలెర్ట్‌గా ఉన్నాం : దానకిశోర్



సీఎం క్షేత్ర పరిస్థితిని అడిగి తెలుసుకున్నారనీ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దానకిశోర్ సూచించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, హైడ్రాకు చెందిన మొత్తం 610 అధికారిక బందాలు ఫీల్డ్‌లో తిరుగుతున్నాయనీ, ఎలాంటి విపత్కరమైనా ఎదుర్కొనేందుకు సర్వం సన్నద్ధం అని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని కోరారు. అత్యవసమైతే తప్ప బయటకు రావొద్దని తెలిపారు. ఆదివారం ఆయన హుస్సేన్ సాగర్, అశోక్‌నగర్, విద్యానగర్ పద్మ కాలనీలను సందర్శించారు. గ్రేటర్ పరిధిలో భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఎలాంటి విపత్కరమైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని దానకిశోర్ తెలిపారు. రెవెన్యూ మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా వర్ష పరిస్థితులపై రివ్యూ చేశారని తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో నగరంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదన్నారు. నేడు గ్రేటర్ పరిధిలో విద్యా సంస్థలకు కలెక్టర్‌లు సెలవులు ప్రకటించారని చెప్పారు. భారీ వర్షాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపేందుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి, హైడ్రాకు చెందిన మొత్తం 610 అధికారిక బందాలు ఫీల్డ్‌లో తిరుగుతున్నాయన్నారు. అల్లాపూర్, కూకట్‌పల్లి మినహా గ్రేటర్‌లో చిన్న చిన్న ఇబ్బందులు తప్ప ఎలాంటి పెద్ద ఘటనలు రిపోర్ట్ కాలేదన్నారు. అల్లాపూర్, కూకట్‌పల్లి ఏరియాల్లో 20 ఇండ్లు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందన్నారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. పురాతన, శిథిలావస్థకు చేరిన గోడలు కూలి ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్న దష్ట్యా అలాంటి ప్రదేశాలను గుర్తించాల్సిందిగా ఉప కమిషనర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించామని చెప్పారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రస్తుతం 10, 400 క్యూసెక్కుల నీరును కిందికి వదులుతున్నామని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ పూర్తి నిల్వ సామర్థ్యంకు ఇంకా 8 అడుగుల గ్యాప్ ఉందనీ, అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అత్యవసరమైతేనే బయటకు రావాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. శనివారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయనీ, ట్రాన్స్ ఫార్మర్లు, కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో 9492409781 ఫోన్ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాలోని మున్సిపాల్టీ, ఎంపీడీవో కార్యాలయాల్లో సైతం కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే, సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూంకు ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు స్కూళ్లకు సెలవు



మరో 24 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక కారణంగా మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా కలెక్టర్ గౌతమ్ సోమవారం సెలవు ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

నేటి ప్రజావాణి రద్దు

భారీ వర్షాల కారణంగా జిల్లా అధికారులు, జిల్లా యంత్రాంగం అప్రమత్తమై రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నందున కలెక్టరేట్‌లో నేడు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు.

నిజాయితీ సంతతి పెరగాలి



- తగ్గిపోతున్న ప్రజా ఉద్యమాలు
- కండ్ల ముందు అవినీతిని ప్రశ్నించండి
- మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ, ఆకునూరి మురళి, ఆర్పీ పట్నాయక్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నిజాయితీ సంతతి పెరగాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ప్రభుత్వ శాఖల్లో పని చేసిన, పని చేస్తున్న నిజాయితీ అధికారుల ఆత్మీయ సత్కారం అదివారం బేగంపేట హరిత ప్లాజాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షత వహించగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ, మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంటెంట్ శివకుమార్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నికల సంస్కరణ, రాజకీయ సంస్కరణలు తీసుకొస్తేనే అవినీతి నిర్మూలించవచ్చు అన్నారు. రాజకీయ ప్రక్షాళన కావాలనీ, ప్రజల ఆలోచనా విధానం మార్చాలన్నారు. ప్రజా ఉద్యమాలను తీసుకొచ్చే వ్యక్తులు తగ్గిపోతున్నారన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదన్నారు. మంచిగా పనిచేస్తే రివార్డు ఇవ్వాలనీ, తప్పు చేస్తే శిక్షించండి అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ నిజాయితీ పరులు ఉన్నారో వెతకడం కూడా చాలా కష్టమైన పని అనీ, ఎందుకంటే చాలా మంది తప్పులు చేస్తూనే, నిజాయితీగా ఉన్నట్టు నటిస్తారని తెలిపారు. మంచి సమాజం ఏర్పడాలంటే మంచి వ్యక్తులు కావాలనీ, మంచి వ్యక్తులకు గుర్తింపు ఉండాలనీ, ఆ గుర్తింపు యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ స్నిగ్ధ, లక్ష్మీకళ, మీడియా కార్యదర్శి జయరాం, కొమటి రమేష్ బాబు, కొన్నె దేవేందర్, జి.హరిప్రకాశ్, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేశ్, చింతల రమేశ్, ఎం.విక్రమ్, పాల్గొన్నారు.

16మంది నిజాయితీ అధికారులకు సత్కారం

తెలంగాణ అగ్రికల్చర్ మాజీ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రవీణ్‌రావు, జస్వంత్‌కుమార్ అర్‌అండ్‌బీ చీఫ్, ఎ.నాగేంద్ర, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్, డాక్టర్ రామకిషన్, సూపరిండెంట్ జనరల్ హాస్పిటల్ మహబూబ్‌నగర్, బుట్ల కరుణ అగ్రికల్చర్ ఏఓ, అమ్రేష్ కుమార్ రిటైర్డ్ ఏడీఏ, వై.శ్రీనివాస్ రావు, రిటైర్డ్ అసిస్టెంట్ సర్జన్ వెటర్నరీ డిపార్ట్‌మెంట్, అశోక్ ఎడీఈ ఎలక్ట్రిసిటీ, జీవిఎస్ ప్రసాద్ సెక్షన్ ఆఫీసర్ వినియోగదారుల ఫోరంను సత్కరించారు.

పవన్ కల్యాణ్ పుట్టినరోజు శుభాకాంక్షలు



- మేడ్చల్ జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మెన్ మన్నె రాజుకు అడప గణేష్ మిత్రబృందం ఆహ్వానం

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, సూరారం ఎక్స్ రోడ్‌లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మేడ్చల్ జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మెన్ మన్నె రాజుకు అడప గణేష్ మిత్రబృందం ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా అడప గణేష్ మాట్లాడుతూ ... పవన్ కళ్యాణ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆయన జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నమన్నారు. పవన్ కళ్యాణ్ ఉద్దేశం ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం అని, అందుకని పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా సూరారం ఎక్స్ రోడ్డులో అన్నదాన కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం, గవర్నమెంట్ హాస్పటల్లో పేషంట్లకు పండ్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమంలో ప్రతి జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ,అభిమానులు, ప్రజలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి అని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బు ల్లాపూర్ నియోజక వర్గం, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నేత కూన శ్రీశైలం గౌడ్‌ని తన నివాసం వద్ద నిజాంపేట్ పరిధి కౌసల్య కాలనీ, దుండిగల్ పరిధి కార్తికేయ నగర్ కాలనీల సంక్షేమ సం ఘాల సభ్యులు ఆదివారం కలిశారు. తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దానికి మాజీ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలం తా అప్రమత్తంగా ఉండాలని, తప్పనిసరి అయితేనే బయటికి రావాలని సూచించారు. నాళాలు డ్రయినేజీలు, పొంగిపొర్లే అవకాశాలు ఉన్నాయని, విద్యుత్ స్తంభాలకు కరెంట్ తీగలకు, పాడుబడ్డ భవనాలకు దూరంగా ఉండాలని అన్నారు. మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్తు శాఖల అధికారులు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన పేర్కొన్నారు.

అస్నా తూఫాన్ వల్ల భారీ వర్షాలు



- కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అస్నా తూఫాన్ వల్ల ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో... ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ప్రధాన రహదారిలో, రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటిని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కాలనీలో పర్యటించి, పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మాన్ సూన్ సిబ్బంది పరిస్థితులను సమీక్షిస్తూ... అవసఆరమైన చోట రోడ్లపై నిలిచిన వరద నీటిని క్లియర్ చేయాలని అన్నారు. అస్నా తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉంది కాబట్టి, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసరం అయితే తప్ప ఇంట్లోనుండి బయటకు రావొద్దని కోరారు. అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. రోగాలు ప్రబలకుండా ముఖ్యంగా పిల్లలు పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకునే విధంగా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియ చేసారు. తడిగా ఉన్న కరెంట్ స్తంభాలలో, విద్యుత్ ప్రవహించి షాక్ కొట్టే ప్రమాదం ఉంది కాబట్టి, వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, కొండారెడ్డి, మీసాల వెంకట్, అంజాద్ ఖాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకి రావద్దు : గొట్టిముక్కల పాండురంగరావు



రాష్ట్ర వ్యాప్తంగా తూఫాన్ కారణంగా ఏడ తెరపలేని భారీ వర్షాలు కురుస్తుండటంతో.. వరద ప్రభావం ఎక్కువగా ఉంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటనలో మీ కుటుంబ సభ్యుడిగా మనవి చేస్తున్నానని తెలుపుతూ.. అత్యవస రం అయితే తప్ప బయటకి రావద్దు అని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కావున అప్రమత్తంగా ఉండాలని కోరారు. బయట పని పై వెళ్ళినప్పుడు విద్యుత్తు స్తంబాలకి దూరంగా ఉండి రోడ్ల పై గుంతలు మాన్ హాల్స్‌ని గమనిస్తూ ప్రయాణం చేయాలని ఆయన సూచించారు.

ఇద్దరు పిల్లలను చంపి, దంపతులు ఆత్మహత్య..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

హైదరాబాద్, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. గాజులరామారంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు పిల్లలను చంపి, దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను వెంక టేష్ (40), వర్షిణి (33), వారి పిల్లలు రిషికాంత్ (11), విహంత్ (3) గా గుర్తించారు. వీరి స్వస్థలం మంచిర్యాల.. విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆర్థిక ఇబ్బందులతోనే దంపతులు తమ పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా వెంకటేష్ కుటుంబం మృతిని స్థానికులు జీవించుకోలేక పోతున్నారు. అందరితో కలిసి మెలిసి చాలా సరదాగా ఉండేవాడని ఇలాంటి పని చేస్తారని ఊహించలేదని అంటున్నారు.

'ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్' కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ యూత్ ఐకాన్-2021 డాక్టర్ స్రవంతి ఎల్లసిరి స్థాపించిన ఎస్ ఇన్ఫ్రా హైట్స్ ప్రయివేటు లిమిటెడ్ తెలంగాణ రియల్ ఎస్టేట్ ల్యాండ్ స్కేప్‌లో కొత్త శకానికి గుర్తుగా సన్ సిటీలో అధికారికంగా తన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ 'ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ మార్కెటింగ్ వ్యూహాల్లో నైపుణ్యంతో, రియల్ ఎస్టేట్ రంగంలో కొత్త వెంచర్‌లను ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ఎస్ ఇన్‌ఫ్రా ఒకే హబ్‌లో ప్లాట్లు, ఫ్లాట్లు, విల్లాలు, వాణిజ్య ఆస్తులతో సహా సమగ్రమైన రియల్ ఎస్టేట్ ఎంపికలను అందించడానికి కట్టుబడి ఉంది. వ్యక్తులు వారి రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు సంబంధించిన సమాచారంతో నిర్ణయాలు తీసుకునే దిశగా మార్గనిర్దేశం చేయడమే మా లక్ష్యం' అని తెలిపారు. ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ఇప్పుడు డీటీసీపీ రెరా ఆమోదించిన ప్రాజెక్ట్, హిల్ కౌంటీ, బాలానగర్, బెంగళూరు హైవే వద్ద అందిస్తోంది. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు, డాక్టర్ స్రవంతి ఎల్లసిరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్ మ్యాక్స్ కార్మికుల ఆకలి కేకలు ఎప్పుడు తీరేనో..



- మరణించిన కార్మికులకు శ్రద్ధాంజలి ఘటించిన కార్మికులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మ్యాక్స్ బ్లేడు పరిశ్రమలో గత రెండు సంవత్సరాలుగా అక్రమ లాకౌట్ కొనసాగుతుంది. దీంతో సుమారు వెయ్యి మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డు పాలయ్యారు. ఈ క్రమంలో ఇప్పటివరకు సుమారు 27 మంది కార్మికులు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో పాటు మనోవేదన చెంది మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం రోజు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో జీడిమెట్లలోని పరిశ్రమ ఆవరణలో కార్మికులు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మృతి చెందిన కార్మికులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కోల్పోయిన కార్మికులకు అందరికీ రావలసిన బకాయిలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టికి స్థానిక ప్రజా ప్రతినిధులకు వివరించినా ఇంతవరకు పరిష్కారం కాలేదని వాపోయారు. కనీసం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమైన మాకు మా కుటుంబాలకు మేలు చేస్తారనే అభిప్రాయంతో,నమ్మకంతో కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నామని కార్మికులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా తమకు వెంటనే న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భరద్వాజ్, ఈశ్వర్ రెడ్డి, దయాకర్, ఖాసీమ్, రామ చంద్రారెడ్డి, అప్పారావు, సూర్య నారాయణ, తదితరులు పాల్గొని బరువెక్కిన హృదయాలతో శ్రద్ధాంజలి ఘటించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో భారీ వర్షాల వలన వరద ప్రవాహం ఎక్కువగా ఉందని లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. డివిజన్‌లోని రెండు భారీ చెట్లు కూలి మూడు కార్లు ధ్వంసం అయ్యినట్లు అందిన సమాచారంతో డిఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వెంటనే కూలిన చెట్లను తొలగించాలని ఆదేశించారు. డివిజన్ వ్యాప్తంగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్ పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో గాంధీనగర్ డివిజన్ ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలని, వృద్ధులను, చిన్న పిల్లలను జాగ్రత్తగా ఇంట్లోనే వుండేలా చూసుకోవాలనీ తెలిపారు. అత్యవసరం అయితేనే బయటకు వెల్లాలని కోరుతూ, వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులూ తలెత్తిన కార్పొరేటర్ కార్యాలయం టోల్ ఫ్రీ నెంబర్ :77998 19991 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

కోల రవీందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సామాజిక కార్యకర్త, పకృతి ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్‌కు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తన అభిమానులు, శ్రేయోభిలాషులు వినూత్న రీతిలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వెజిటేబుల్ కూరగాయలు, పండ్లను పూలదండగా మార్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, పకృతి ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ తన అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వారితో ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, గుడ్డ సంచులను వాడుతామని, తమ పిల్లలకు ఈత ఒక సాధనంగా తెలియపరుస్తామని ప్రమాణం చేయించారు. ప్లాస్టిక్ రహిత సమాజా నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వాడడం వల్ల మనుషులకే కాకుండా జంతువులకి, పర్యావరణానికి హానికరమన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

'సభ్యత్వాలు ముమ్మరంగా చేయండి'

నవతెలంగాణ- ఓయూ

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు కక్కిరేణి హరీష్ ఆధ్వర్యంలో వారి నివాసంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ , సభ్యత్వ నమోదు ఉప్పల్ ఇంచార్జ్ పోతగాని గోపాల్ గౌడ్ విచ్చేశారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ హబ్సిగూడ డివిజన్‌లో చాలా బలంగా ఉందని, సభ్యత్వ నమోదు కార్యక్రమన్ని పండుగ వాతావరణంలో కార్యకర్తలందరూ ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, బొమ్మగోని రఘుపతిగౌడ్, గడ్డం సాయికిరణ్, వేములకొండ వెంకన్న గౌడ్, జిల్లెల రవీందర్ రెడ్డి, రంగ రవి,దారం వెంకటేష్ గుప్తా, పూజారి సోమయ్య గౌడ్, పెంటవల్లి వెంకన్న, వాసం పాండు, అరవింద్, లక్ష్మణ్, భానోత్ రమేష్ నాయక్, కనావత్ రాజు నాయక్, పుచ్చుల అశోక్, గడ్డం వెంకట్ సాయి, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాగి లతా వెంకటరెడ్డి, సాదినేని గీత, కొండేరు స్రవంతి పాల్గొన్నారు.

విద్యార్థులు బయటకు వెళ్లొద్దు

ప్రిన్సిపల్ శ్రీరాములు



నవతెలంగాణ- ఓయూ

నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న సందర్భంగా విద్యార్థులు బయటకు వెళ్లవద్దు అని ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు కోరారు. ఆదివారం ఆయన మంజీర వసతి గృహానికి వెళ్లి విద్యార్థులకు కలిశారు. ఉద్యోగులు వసతి గృహంలో పైన వర్షపు నీరు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

టానిక్ లిక్కర్ మాల్‌ను

మూసేసిన ఎక్సైజ్ పోలీస్ అధికారులు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

లైసెన్స్ గడువు ఆగస్టు 31తో ముగిసినందున జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని టానిక్ లిక్కర్ మాల్‌ను ఎక్సైజ్ అధికారులు డిప్యూటీ కమిషనర్ కేవీ శాస్త్రి, జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఎస్‌టీ పోలీసు అధికారులతో కలిసి ఆదివారం షాప్‌ను మూసి వేయించి, పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అమ్మకాలు జరపకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.బి శాస్త్రి మీడియాతో మాట్లాడుతూ.. షాప్ లైసెన్స్ ఆగస్టు 31 తో ముగిసినందున తిరిగి లైసెన్స్ రెన్యువల్‌కు అర్జీ పెట్టుకున్నప్పటికీ ప్రభుత్వం తిరస్కరించిందని, అందులో ఉన్న లిక్కర్ స్టాక్‌ను లెక్కిస్తున్నామని చెప్పారు. సుమారు కోటిన్నర విలువచేసే మద్యం ఉన్నట్లు తెలుస్తుందని, ఉన్న మద్యాన్ని ఎక్సైజ్ రూల్స్ ప్రకారం సమీపంలోని ఇతర మద్యం షాపులకు తరలిస్తామని అన్నారు. ఇచ్చిన లైసెన్సుకు విరుద్ధంగా కస్టమర్లను ఆకర్షించుటకు డీజే మరియు ఇతర తినుబండారాలు అమ్ముతున్నట్లు గుర్తించామని, ఇన్కమ్ టాక్స్ చెల్లించుటలో కూడా అవకతవకలు గుర్తించామని, వాటి కారణం వల్ల తిరిగి లైసెన్స్ రెన్యువల్ చేయలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

68వ హెడ్ అండ్ నెక్ లైవ్ సర్జికల్ వర్క్ షాప్





నవతెలంగాణ - బంజారాహిల్స్

మా ఈ ఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె ఆర్ మెఘనాథ్, డాక్టర్ నాగార్జున రెడ్డి, హెడ్ అండ్ నెక్ సర్జన్ల ఆధ్వర్యంలో 68వ లైవ్ హెడ్ అండ్ నెక్ వర్క్ షాప్‌ను ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ముందుగా సాంప్రదాయ ప్రకారం జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం వారు మాట్లాడారు. మా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో హెడ్ అండ్ నెక్ లైవ్ సర్జికల్ వర్క్ షాప్ గురించి వివరించారు. ఈ వర్క్ షాప్ యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజలకు హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ పై అవగాహన, వైద్య విద్యార్థులకు భవిష్యత్‌లో ట్రైనింగ్ కోసం ఉపయోగపడుతుందన్నారు. మా ఈఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అన్ని రకాల క్యాన్సర్లకు వైద్యం రీహబిలిటేషన్ కూడా అందుబాటులో ఉందని, ప్రజలలో తల మెడ భాగంలో వచ్చే క్యాన్సర్ కనతుల పట్ల జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో లైవ్ సర్జరీలు నిర్వహించి.. వైద్యులకు క్యాన్సర్ చికిత్స పట్ల సందేహాలు సలహాలు అలాగే ఈ వర్క్ షాప్‌లో పేషెంట్లకు జరిగిన సర్జరీలు ఉచితంగా చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రతమేశ్ పాయ్ సర్జన్ హెచ్ ఎన్‌సీఐఐ, డాక్టర్ అక్షయ్ సర్జన్ సిటీ కేర్ ఆస్పత్రి బెంగళూరు, డాక్టర్ శశి కృష్ణ, ఈ వర్క్ షాప్‌లో సుమారు 120 మంది ప్రముఖ ఈఎన్‌టీ డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓయూ పరిధిలో నేటి పరీక్షలు వాయిదా'

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో నేడు (సోమవారం) జరగాల్సిన అన్ని రకాల పరీక్షలు భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 3 నుండి యథావిధిగా పరీక్షలు నిర్వహించనునటు చెప్పారు.


బహు నూతుల కుటుంబ సమ్మేళనం



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

మొట్టమొదటిసారి బహు నూతుల ఇంటి పేరు కలిగిన వారి భార్యలతో, 150 సంవత్సరాల వంశ వృక్షమైన వారు ఆదివారం కళ్యాణ్ నగర్‌లోని ముగ్ధ బ్యాంక్ ఎట్ హాల్లో కుటుంబ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇది కేవలం బహునూతల ఇంటి పేరుతో కలిగిన వారి మొట్టమొదటి సమావేశంగా భావించడమైనది. ఈ సమావేశానికి కరీంనగర్, నల్గొండ, వరంగల్, హైదరాబాదు నుండి 50 మంది వారి భార్యలతో కుండ పోత వర్షం ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొన్నారు. వారి తాత ముత్తాతల పేర్లతో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన వంశ వృక్షాన్ని తెలుసుకోవడం జరిగింది. ఈ సమ్మేళనానికి కిషోర్ కుమార్, రవీందర్ నాయుడు, నరేందర్ నాయుడు, లక్ష్మణ్ నాయుడు రామారావు, వినోద్ కుమార్, హాజరై వారి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. వీరు అందరూ వివిధ వృత్తులలో స్థిరపడిన వారు. వచ్చే సమావేశంలో వారి ఆడపడుచులు, పిల్లలతో జరుపుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో హుజురాబాద్, వరంగల్, పెద్ద దేవులపల్లి పట్టణంలో పలు స్వచ్ఛంద సంస్థలకు కొందరు సహాయ సహకారాలు అందించినట్లు గుర్తు చేసుకున్నారు. అనంతరం గ్రూపుగా ఫోటోలు దిగి ప్రతి ఒక్కరూ పంచుకున్నారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసులో సైంటిఫిక్ ఆఫీసర్‌గా పని చేస్తున్న బి కిషోర్ కుమార్ అన్ని ఏర్పాట్లు చేసి విజయవంతం చేశారు.

నేలకొరిగిన చెట్లు



హుస్సేన్ సాగర్ గేట్లు తనిఖీ

నవతెలంగాణ-ఓయూ

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం హుస్సేన్ సాగర్ గేట్ల వద్ద జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ నగరంలో నాలాలు మరియు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఈ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

నవతెలంగాణ - బంజారా హిల్స్

బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో అకాల వర్షాలు, ఈదురు గాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వెంగళరావు పార్క్ వద్ద కూలిన ఈ భారీ వృక్షాన్ని స్థానికుల సహాయంతో ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. అనంతరం ఆ ప్రాంతానికి జీహెచ్‌ఎంసీ డిఆర్‌ఎఫ్ అధికారులు చేరుకున్నారు.

నవతెలంగాణ-బేగంపేట

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో డాక్టర్ కోట నీలియ ప్రత్యేకంగా బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా రామ్ గోపాల్పేట్ డివిజన్లో ఆసురకాన్నగల్లీలో 50 మంది కుటుంబాలకు గొడుగులను పంపిణీ చేశారు. అత్యవసర పనులు ఉంటేనే బయటికి రావాలని, లేకుంటే ఇళ్లలోనే ఉండాలని డాక్టర్ కోట నీలియ, సనత్ నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ టీపీసీసీ మెంబర్, ఏఐసిసి ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఏ బ్లాక్ అధ్యక్షుడు, హేమంత్ సింగ్ ఠాకూర్, భాస్కర్, నుమాన్ ఖాన్, నాగరాజ్, చందు, చక్రం, విన్ను మరియు బస్తీవాసులు పాల్గొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో నేల కూలిన చెట్లు

నవతెలంగాణ - కంటోన్మెంట్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాత బోయిన్‌పల్లి డివిజన్‌లోని పలు కాలనీలలో మురుగు, వర్షపు నీరు రోడ్ల మీదకి వచ్చాయి. అలాగే ఈదురు గాలులకు భారీ వృక్షాలు.. హై టెన్షన్‌ల మీద పడి రాత్రంతా సరఫరా కరెంట్ ఆగిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారనే సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అధికారులకు ఫిర్యాదు చేసి ఉదయాన్నే పడిపోయిన వృక్షాలను తొలగించారు. తర్వాత మురుగు కాల్వలను శుభ్రం చేయించారు.

నవతెలంగాణ - కంటోన్మెంట్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమతా నగర్‌లో మూడవ వీధిలో భారీ వృక్షం కుప్పకూలింది. రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులకు గురయ్యారు.

నవతెలంగాణ- ఓయూ

సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ సూచనలు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితాఫలమండీ, బౌద్దనగర్ మున్సిపల్ డివిజన్ల పరిధుల్లోని వర్షాల పరిస్థితులపై జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్, ఎగ్జికిటీవ్ ఇంజనీర్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ అధికారులతో సంప్రదించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జరీ చేశారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలను అన్ని డివిజన్ల వారీగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, స్తంబాలు, గోడల వద్ద ఉండొద్దన్నారు. విద్యుత్ స్థంబాలు, స్విచ్ బోర్డుల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. నాలాల పరీవాహక బస్తీలు, కాలనీల వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. డ్రైనేజీలు, మ్యాన్ హెూల్స్ విషయంలో నిర్లక్ష్యంగా ఉండవద్దు అని అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హితబోధ చేశారు. మా కార్పొరేటర్లు, నేతలు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే గణేష్

నవతెలంగాణ - కంటోన్మెంట్

గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కంటోన్మెంట్ బోర్డు ప్రాంతంలో పలు బస్తీలు, కాలనీలలో వరద ప్రభావిత కావడంతో ఆదివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సికింద్రాబాద్ ఎంఆర్‌ఓతో కలిసి 2 రెండో వార్డ్ రసూల్‌పురలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలను కలిసి మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలను సహాయ చర్యల్లో పాల్గొనాలని కోరారు. ఈ వర్షాలను దృష్టిలో ఉంచుకొని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ఒక టీంను అందుబాటులో ఉంచామని తెలిపారు. అత్యవసర సమయాల్లో తన కార్యాలయ సిబ్బందిని సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మార్వో వినోద్ నాయక్, కంటోన్మెంట్ బోర్డ్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - కంటోన్మెంట్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోయిన్పల్లి ఒకటో వార్డు జయ నగర్‌లో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రాత్రి సమయం కావటం వల్ల జనసంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వర్షాలకు ఓయూలో పడిపోయిన చెట్లు

నవతెలంగాణ-ఓయూ

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో టెక్నాలజీ కళాశాల రోడ్డుపై, సైన్స్ కాలేజీ క్యాంటీన్ సమీపంలో ఇంకా ఓయూలో అనేక చోట్ల భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి. దీంతో ప్రధాన రహదారులపై రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ప్రమాద భరితంగా పలు వసతి గృహాలు..

ఓయూలో సి వసతి గృహం, నిజాం నవాబు కాలం నాటి వసతి గృహాలు ఈ భారీ వర్షాలతో ప్రమాదంగా మారాయి. కొన్ని వసతి గృహాలకు కొన్ని చోట్లపై కప్పు ఉండి పోవడంతో పాటుగా కురవడం జరుగుతుంది. దీంతో ఆ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదిస్తున్నారు. కొన్ని వసతి గృహాలు సీలింగ్ కూడా నోళ్లు తెరిచి ప్రమాదంగా ఉన్నాయి. దీంతో పెచ్చులు ఎప్పుడు ఊడిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఇలాగే వర్షం కొనసాగితే ఇక్కడ ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జఖీరా సుల్తానా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ రాములుతో కలిసి ఆదివారం ఎర్రగడ్డ డివిజన్‌లోని ఎర్రగడ్డ, ఆనంద నగర్ బస్తీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పురాతనమైన ఇండ్లలో నివసిస్తున్న వారిని గుర్తించి, వెంటనే ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు రావాలని నివాసులతో మాట్లాడి చెప్పడం జరిగింది. కొంత సమయం ఇస్తే వారికి కావాల్సిన ఏర్పాట్లు మేమే మా బస్తీలో ఏర్పాటు చేస్తామని అన్నారు.

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఎడతెరిపి లేని భారీ వర్షాలకు ఎర్రగడ్డ డివిజన్ మోతీ నగర్, రాజీవ్ నగర్ కాలనీలలో భారీ వృక్షాలు రోడ్డుపై పడిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ జక్కీర సుల్తానా స్వయంగా అధికారులు, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. పడిపోయిన భారీ చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు.

నవతెలంగాణ- బేగంపేట్

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏఐసీసీ సభ్యురాలు, సనత్‌నగర్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ఉన్న వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఏ సమస్య ఉన్నా వెంటనే అధికారులకు గానీ ప్రభుత్వం దృష్టికి కానీ తీసుకురావాలని కోరారు.

నవతెలంగాణ - బంజారాహిల్స్

అకాల వర్షాలకు, ఈదురు గాలులకు ఖైరతాబాద్ నియోజకవర్గ వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని నంది నగర్‌లో వృక్షం కొమ్మ విరిగి పార్కింగ్ చేసి ఉన్న ఇన్నోవా కారుపై పడింది. ఈ విషయాన్ని వెంటనే జీహెచ్‌ఎంసీ వారి దృష్టికి తీసుకెళ్లారు. జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని ఆ వృక్షాన్ని తొలగించారు.









































గత ప్రభుత్వం ఉద్యోగులను విస్మరించింది : ఎమ్మెల్సీ

- జీవో 317 ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీకి సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ విమర్శించారు. అప్పటి ప్రభుత్వం స్థానికతను పక్కన పెట్టడంతో ఉపాధ్యాయ ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నార తెలిపారు. 317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన 31 ప్రభుత్వ డిపార్టుమెంట్ల ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ హాల్‌లో నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ కోదండరామ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం కోదండరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగులను పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 317 ఉద్యోగులపై దృష్టి సారించిందని తెలిపారు. అందుకు అనుగుణంగా మంత్రులతో కమిటీ వేయడంతో ఉపాధ్యాయ ఉద్యోగులు తమ సమస్యలను సమిష్టిగా వివరించారన్నారు. ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులకు అతి త్వరలోనే తీపి కబురు వస్తుందని తెలిపారు. మీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి తగిన విధంగా సూచనలు సలహాలు చేసి సంపూర్ణ న్యాయం చేస్తానని హామీచ్చారు. గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ స్థానికత అంశం అతి త్వరలో పరిష్కారమవుతుందన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు విజయకుమార్, సందీప్ కుమార్, సత్యనారాయణ, మధుసూదన్ రెడ్డి, రాపోలు శేఖర్, పోచన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానికత కోల్పోయిన వారందరికీ మళ్లీ స్థానికతను కల్పించాలని కోరారు. అంతేకాకుండా స్థానికతపై వేసిన క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టును త్వరగా ముఖ్యమంత్రి ఇచ్చి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 15వ తేదీ లోపు స్థానికత ఇస్తూ.. ప్రకటన చేస్తే ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో సంతోషపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గ్రేటర్‌లో జోరు వాన



- ఇండ్లల్లోకి నీరు.. లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఆయా ఏరియాల్లో దాన కిశోర్, రంగనాథ్ పర్యటన

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. నగరంలోని అనేక ప్రాంతాల్లో జోరుగా వర్షాలు పడుతున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆగకుండా వాన పడుతున్నది. సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, అల్వాల్, తిరుమలగిరి, చిలుకలగూడ, మారేడుపల్లి, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, బొల్లారం, జవహర్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, కూకట్‌పల్లి, కొండాపూర్, కొంపల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, నిజాంపేట, హైదర్‌నగర్, మెహిదీపట్నం, నాంపల్లి, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డి, ఉప్పల్, ఈసీఐఎల్, సరూర్‌నగర్, సైదాబాద్, చంపాపేట్, మలక్‌పేట్‌లో భారీగా వర్షం పడింది. ఈ భారీ వర్షాలకు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చంపాపేట, రెడ్డి కాలనీతోపాటు పలు కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇండ్లలోకి వర్షపు నీరు

భారీ వర్షాలతో హైదరాబాద్ బెంబేలెత్తుతోంది. అతలాకుతలమౌతోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇండ్లల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. రోడ్లపై భారీగా వర్షపు నీరు చేరుకోవడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. భారీ వర్షాల ధాటికి అమీర్‌పేట, బేగంపేట్, షేక్‌పేట, టోలీచౌకీ, గచ్చిబౌలి, కొండాపూర్, అత్తాపూర్ వంటి ప్రాంతాల్లోని లోతట్టు ప్రదేశాలు జలమయం అయ్యాయి. మురుగునీరు, వరదనీటి పారుదల కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల అవన్నీ కూడా పొంగిపొర్లుతున్నాయి.

జీహెచ్ఎంసీ కమిషనర్ పలు సూచనలు

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఆమ్రపాలి నగరవాసులకు పలు సూచనలు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించడం, రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అత్యవసరం ఉంటేనే బయటకు వెళ్లాలని కోరారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిలో పిల్లలు, వద్దులు ఒంటరిగా బయటికి వెళ్లకూడదని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనాలను కూడా వినియోగించవద్దని సూచించారు. వర్షపు నీరు వెళ్లిపోవాలనే ఉద్దేశంతో స్థానికులు తమ పరిధిలో ఉన్న మ్యాన్ హెూల్స్‌ను తెరవకూడని సూచించారు. ఒకవేళ అవి తెరచి ఉంటే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు తెలియజేయాలని ఆమ్రపాలి విజ్ఞప్తి చేశారు.

రంగంలోకి రంగనాథ్

వర్షాభావ పరిస్థితుల మధ్య హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగారు. షేక్‌పేట, టోలీచౌకీల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో కలియదిరిగారు. విధి నిర్వహణలో నిమగ్నమైన సిబ్బందితో మాట్లాడారు. వర్షపునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇతర విపత్తు నిర్వహణ ఏజెన్సీలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వరద పరిస్థితులను ఎదుర్కొంటున్నాయనీ, నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు.

హుస్సేన్‌సాగర్ ఫుల్.. జీహెచ్ఎంసీ అలర్ట్..

నగరంలోని హుస్సేన్‌సారగ్‌కు వరద నీరు పోటెత్తుతోంది. నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరుకుంది. గ్రేటర్‌లో ఎడతెరిపి లేని వర్షం కారణంగా బంజారాహిల్స్, పికెట్, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు హుస్సేన్ సాగర్‌లోకి చేరుతుంది. దీంతో సాగర్ నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరింది. తూముల ద్వారా వరద నీటిని మూసీ నదిలోకి వదులుతున్నారు. హుస్సేన్‌సాగర్‌లోని నీటి మట్టం 513.70 మీటర్లకు చేరుకుంది. అయితే ఫుల్ ట్యాంక్ లెవల్ 515 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం హుస్సేన్ సాగర్ ఇన్‌ఫ్లో 10,270 క్యూ సెక్కులు కాగా, అవుట్ ఫ్లో 9,622 క్యూ సెక్కులుగా కొనసాగుతోంది. మరోవైపు ఎడ తెరపి లేని వర్షాలతో జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. మూసీకి వరద పోటెత్తింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసరంబాగ్ బ్రిడ్జీని తాకుతూ వరద ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు మూసీ పరివాహన ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ, అందరూ జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

59 పునరావాస కేంద్రాలు

భారీ వర్ష సూచనతో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బందాలు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల వారి కోసం హైదరాబాద్‌లో 59 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌లో సోమవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించామని కలెక్టర్ తెలిపారు. వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ అధికారులను కోరారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఘట్కేసర్



విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి కొండాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన శ్రీనివాసరావు(48) కొండాపూర్ విజ్ఞాన్ ప్రభోదనంద పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ క్యాంపస్‌లో తనకు కేటాయించిన క్వార్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఉదయం అల్పాహారం ముగించుకొని తాను నివాసం ఉంటున్న క్వార్టర్‌పై వర్షపు నీరు తొలగించడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రం తోటి ఉపాధ్యాయుడు గమనించి యాజమన్యానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పాఠశాల యాజమాన్యం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలి

- చిన్న పిల్లలను ఒంటరిగా రోడ్లపైకి పంపొద్దు
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర ప్రజలు అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట సూచించారు. ఆదివారం లేక్ వ్యూ గెస్ట్ హౌస్ వద్ద రేన్ వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ (సంపు) నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. చిన్నపిల్లలను ఒంటరిగా రోడ్లపై బయటకు పంపవద్దు అన్నారు. ట్రాఫిక్ రిలేటెడ్ 141 వాటర్ లాగిన్ పాయింట్స్ ఉన్నాయనీ, అక్కడ పంపులు పెట్టి డి- వాటర్ చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఉన్న 141వాటర్ లాగిన్ పాయింట్స్ వచ్చే ఏడాది నాటికి 50కి తగ్గేలా ప్రణాళిక చేస్తున్నాం అని తెలిపారు. 22 లేక్స్ సర్ ఫ్లేస్‌కు వచ్చాయనీ, అన్ని గేట్స్ తెరిచామనీ, హుస్సేన్ సాగర్ గేట్స్ కూడా తెరిచామనీ, లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేసామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లో ఇంకా ఎలాంటి రిస్క్ లేదనీ, ఆస్తి, ప్రాణ నష్టం ఏమీ జరగలేదన్నారు. కంట్రోల్ రూం 24 గంటలు పని చేస్తుందని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామనీ, ముఖ్యంగా పోలీస్, హైడ్రా, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ సమన్వయంతో పని చేస్తున్నట్టు చెప్పారు. పురాతన, శిథిలావస్థకు చేరిన భవనాలు, కాంపౌండ్ వాల్స్, భవన నిర్మాణ ప్రదేశాలను డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు సందర్శించి ప్రమాద అవకాశాలు గల వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నగరంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో మల్టిపుల్ స్టెప్స్ తీసుకుంటున్నామని తెలిపారు. నిర్మాణ స్థలాల చుట్టూ భారికేడ్స్, లైటింగ్ పెట్టించామని తెలిపారు. సెలవుల్లో ఉన్న అధికారుల సెలవులను రద్దు చేశామని తెలిపారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఎస్ఈ రత్నాకర్, డీసీ రజనీకాంత్ రెడ్డి, ఈఈ, తదితరులు ఉన్నారు.



అధికారులు అందుబాటులో ఉండాలి

- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వాతావరణశాఖ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రెడ్ అలార్ట్ ప్రకటించిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా అన్ని వేళల అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్‌తో ఆదివారం మేయర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు సర్ ఫ్లస్ అవుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు, సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉండాలనీ, సెలవుల్లో వెళ్ళరాదని, ఎలాంటి సెలవులు ఇవ్వమని స్పష్టం చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, కాంపౌండ్ వాల్స్‌ను గుర్తించి తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. కన్స్ట్రక్షన్ సైట్లలో తాత్కాలికంగా పనులు ఆపాలనీ, లేబరును సురక్షిత ప్రాంతాలకు తరలించాలనీ, నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా బిల్డర్లకు సూచించాలనీ, టౌన్ ప్లానింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీసీపీ శ్రీనివాస్‌ను మేయర్ ఆదేశించారు. నాళాలు, స్టార్మ్ వాటర్ డ్రైన్‌లలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తూ, పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలనీ, అవసరమైన చోట పునరావాస కేంద్రాలకు తరలించాలని మేయర్ అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దనీ, ఆపద సమయంలో జీహెచ్ఎంసీ కంట్రోల్ రూం, ఫోన్ నెంబర్ 040- 21111111 కు గానీ, మై జీహెచ్ఎంసీ యాప్‌కు ఆన్ లైన్ ద్వారా గానీ, డీఆర్ ఎఫ్(హైడ్రా) ఫోన్ నెంబర్ 9000113667 లో సంప్రదించవచ్చని మేయర్ సూచించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జోనల్ కమిషనర్లు, సీసీపీ పాల్గొన్నారు.

విరిగిన చెట్టు కొమ్మలను తొలగించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నేరేడ్ మెట్



ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు ఓల్డ్ నేరెడ్‌మెట్ బీజేపీ నాయకులు దాచబోయిన సాయినాథ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రామకృష్ణపురం చెరువు దిగువ ఉన్న దేవినగర్ కాలనీ, శ్రీ కృష్ణనగర్ కాలనీ, రామ్ రామ్ నగర్ కాలనీలను సందర్శించారు. కాలనీ వాసులను కలిసి వర్షా కాలంలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకున్నారు. గుంతలతో ఉన్న రోడ్లను, విద్యుత్ స్తంభాలను వీక్షించి వాటి పై ప్రమాదాలకు దారి తీసేలా వాలుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభానికి సంభందిత డివిజన్ విద్యుత్ శాఖ ఏఈని ఫోన్ ద్వారా సంప్రదించి త్వరగా చర్యలు తీసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు నిమల నవీన్ గౌడ్, పులిమామిడి తరుణ్ కుమార్, జూలకంటి విశాల్ గౌడ్, మొహమ్మద్ జావేద్, సన్నీ వంశీ గౌడ్, ఇంద్ర రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

- ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి

నవతెలంగాణ-హైదరబాద్‌డెస్క్



ఆత్మహత్యల నివారణకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటారని డా.హిప్నో పద్మా కమలాకర్, జి.కృష్ణవేణి అన్నారు. ఆదివారం డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హల్ లో విలేకరుల సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ.. ఈ దినోత్సవాన్ని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ (IASP) నిర్వహిస్తోందని చెప్పారు. ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక బొమ్మలను తయారు చేయడం, విద్యార్థులు, చదువు - ఆత్మహత్యలు అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు 4 తేదీ నుంచి 9 తేదీ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలలో, రామకృష్ణ మఠం బాలల సేవా విభాగం లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 10న ఆత్మహత్యల నివారణ పై అవగాహన కల్పించి డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.డి.కోటేశ్వరరావు, మానసిక వైద్య నిపుణులు డాక్టర్.జి.మహేంద్ర కుమార్ రెడ్డి, డాక్టర్ రవ్వ హరి కుమార్,డా.వి.శ్రీనివాస్ బహుమతులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలు కేవలం వ్యాసాలు, ఉపన్యాసాలు రాయడానికి మాత్రమే పరిమితం కాకుండా, మరింత లోతుగా ఆలోచించేలా ప్రోత్సహిస్తాయని తెలిపారు. విద్యార్థులు ఈ అంశం గురించి చదువుతారు, పరిశోధిస్తారు. దీని వల్ల ఈ సమస్య ఎంత తీవ్రమైనదో తెలుసుకుంటారున్నారు. విద్యార్థులు ఆత్మహత్యలకు దారితీసే కారణాలను అర్థం చేసుకుంటారన్నారు. ఇది వారిలో సమస్యను ఎలా ఎదుర్కోవాలి, పరిష్కారాలను తెలుసుకుంటారన్నారు. ఈ పోటీల ద్వారా వారిలో పరిశోధన, వ్రాత, మాట్లాడే నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. వివరాలకు 9390044031 సంప్రదించవచ్చునని తెలిపారు. డా.హిప్నో పద్మా కమలాకర్ ఏ 9390044031 సంప్రదించాలన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం



- వర్షంలోనూ పెద్దసంఖ్యలో తరలివచ్చిన ఉద్యోగులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గన్‌పార్క్ అమర వీరుల స్తూపం వద్ద సభ నిర్వహించారు. ఒకవైపు నగరంలో కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున ఉద్యోగులు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీపాల్ రెడ్డి, స్థితా ప్రజ్ఞ, గెజిటెడ్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), అధికారుల సంఘ ప్రతినిధులు వెంకట్, కృష్ణ యాదవ్, కేంద్ర సంఘం సభ్యులు కస్తూరి వెంకటేశ్వరులు, ఉమా దేవి, శైలజ, బొల్లిగిద శంకర్, నాల్గవ తరగతి కేంద్ర సంఘం అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్ బిన్ హసన్, జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, సభ్యులు ఖలీద్ ఆహ్మద్, ముఖీమ్ ఖురేషి, శ్రీధర్, రాజు, కృష్ణ, ఇతర యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుండపోత వర్షంలోనూ జేఏసీ పిలుపుమేరకు ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని గన్‌పార్క్ ప్రాంగణం వద్ద నినాదాలతో హెూరెత్తించారు. కేంద్రం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న విధానం వెంటనే మార్చుకోవాలని, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని వారు కోరారు. సీపీఎస్, యూపీఎస్.. వద్దురా ఓపీఎస్ ముద్దు రా అని ముక్తకంఠంతో ఉద్యోగులు నినాదాలతో హెూరెత్తించారు.

ఘనంగా బీరప్ప, ఎల్లమ్మ బోనాలు



నవతెలంగాణ-ఉప్పల్

కురుమల ఆరాధ్య దైవం, బీరప్ప, ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం రామంతపూర్, కేసీఆర్ నగర్‌లోని బీరప్ప ఆలయం లో ఘనంగా నిర్వహిం చారు. మహిళలు నూతన వస్త్రాలను ధరించి, మహిళలు బోనాలతో ఎంతగానో అలరించారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో బోనాల సమర్పిం చారు. అనంతరం మహిళలు భక్తులు అమ్మవారి ముక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు రేవు కృష్ణయ్య, బాలం భిక్షపతి, శాగ రవీందర్, రావుల జంగయ్య, బీరప్ప, యాదయ్య, మల్లయ్య, శ్రీశైలం, రేవు నరసింహ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిల్కానగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : బన్నాల



నవతెలంగాణ-ఉప్పల్

భారీ వర్షాలకు చిల్కానగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ అన్నారు. ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చిల్కానగర్ డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీల్లో పర్యటించారు. నీటి నిల్వ ఉన్న వీధులలో ఎయిర్ టెక్ వాహనాన్ని పిలిపించి నీటిని తొలగించ జేశారు. అనంతరం డివిజన్‌లోని బీరప్ప గడ్డ, ధర్మపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ కాలనీ, కుమ్మరి కుంట, మర్రిచెట్టు ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సేవలకు తనను వెంటనే సంప్రదించాలన్నారు. వెంటనే మాన్సూన్ సిబ్బందిని, ఎయిర్‌టెక్ వెహికల్ ఏర్పాటు చేస్తానన్నారు.

మాటల్లోనే మట్టిగణపతి

- పండుగ ముందే హడావుడి
- ఆ తర్వాత షరా మామూలే
- మట్టి విగ్రహాల తయారీపై ప్రచారం కరువు
- చొరవ చూపని జిల్లా అధికార యంత్రాంగం



నవతెలంగాణ-సిటీబ్యూరో

'మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అని చాలా మంది హితబోధ చేస్తున్నారు. ఆ తర్వాత వదిలేస్తున్నారు. చివరకు అధికార యంత్రాంగమూ అదేబాటలో పయనిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినాయక చవితి పండుగ ముందు హడావుడి చేయడం మినహా పక్కా ప్రణాళికతో మట్టి విగ్రహాల ద్వారా కలిగే ప్రయోజనాల గురించి విస్తృత ప్రచారం చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి వనరులను కలుషితం చేసే రసాయన విగ్రహాల (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)ను కాకుండా పర్యావరణ హిత మట్టి విగ్రహాలనే వినియోగించాలని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం హోరెత్తుతున్నా.. అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదు. ఎప్పటిలాగే ఈసారి కూడా పీవోపీ విగ్రహాల ఏర్పాటుకే యత్నిస్తున్నారు. ఇప్పటి వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు మట్టి విగ్రహాల తయారీకి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. తూతూ మంత్రంగా స్కూళ్లలో పీసీబీ అధికారులు విద్యార్థులతో మమేకమవుతున్నారు, తప్పితే ఆశించిన స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. మూడేండ్ల క్రితం వరకు మట్టి వినాయక విగ్రహాల వినియోగం వరకు కనీసం సమావేశాల నిర్వహణ అయినా జరిగేది. ఈఏడాది అది సైతం ఎక్కడా కనిపించడం లేదు.

ముందస్తు అవగాహన కరువు

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలతో కలిగే అనర్థాలపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావడం లేదు. దీంతో చెరువులు, కుంటల్లోని నీరు కలుషితమవుతోంది. గణేష్ మండపాల నిర్వాహకులు, యువజన సంఘాలు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుందనే భావన వ్యక్తమవుతోంది. పర్యావరణం, నీటి వనరులను కలుషితం చేసే పీవోపీ విగ్రహాలు వినియోగించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వం అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. పండుగ ముందు తూతూ మంత్రంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్టు పీసీబీ అధికారులు అక్కడక్కడ కనిపిస్తున్నారే తప్పితే శాశ్వత పరిష్కార మార్గం ఎంచుకోవడం లేదు.

పీసీబీ అధికారులకు బాధ్యత లేదా..?

పర్యావరణ పరిరక్షణపై ప్రచారం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు ఈ దిశగా చొరవ చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. మట్టి గణపతి విగ్రహాల వినియోగంపై గతంలో కరపత్రాలతో ప్రచారం చేశారు. పీవోపీతో నీటివనరుల కలుషితంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. నివాసాలు, వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలు జలవరుల్లోకి చేరితే ఇబ్బందులు తలెత్తుతాయనే వ్యక్తమవుతోంది. ముంద జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి అనర్థాలు ఎదురు కావని నిపుణులు అంటున్నారు.

ఏటా రూ.కోట్లల్లో వ్యాపారం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు కళాకారులు గణపతి విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. వినాయక చవితికి నాలుగైదు నెలల ముందు నుంచే తయారీలో నిమగ్నమవుతున్నారు. భారీ విగ్రహాలు రూ.40వేలు వరకు ధర పలుకుతున్నాయి. ఇలా ఏటా రూ.కోట్లలో వ్యాపారం సాగుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

స్వచ్ఛంద సంస్థలు స్పందించినా..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ)తో తయారైన విగ్రహాలు నీటిలో కరిగిపోవు. వాటి వ్యర్థాలు మానవ మనుగడకు ముప్పుగా మారుతున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సవాలకు ముందే వాతావరణ కాలుష్య నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవాలనీ, ఆ దిశగా ప్రజలను చైతన్యప ర్చాలని హైకోర్టు గతంలోనే ఆదేశించింది. ఈ మేరకు కొన్ని స్వచ్ఛంద సంస్థలు అవగహన కల్పిస్తున్నా ఆశిస్తున్న ఫలితాలు రావడం లేదు.

పీసీబీ అధికారులు ఎక్కడ..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఉన్నారో..? లేదో..? తెలియడం లేదు. పీసీబీ కార్యాలయం ఎక్కడ ఉందో..? అధికారులు ఎప్పుడు వస్తారో..? ఎక్కడ ఉంటారో..? ఏం పని చేస్తారో..? అనే విషయాలు కనీసం జిల్లా కలెక్టర్‌కైనా సమాచారం ఉందో..? లేదో..? తెలియని పరిస్థితి నెలకొంది. ఉన్న ఒకరిద్దరు అధికారులు ప్రజావాణికి తప్ప ఇతర సమయాల్లో ఎక్కడా కనిపించరు. వినాయక చవితి లాంటి సందర్భాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన పీసీబీ అధికారులు నిద్రావస్థలో ఉంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి పీసీబీ అధికారులు కలెక్టరేట్‌లో ప్రజలు, ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

నిరాదార ఆరోపణలు చేస్తే సహించేది లేదు



- కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీధర్ రెడ్డి
- పీఅండ్‌టీ కాలనీ అసోసియేషన్ కమిటీ రద్దు

నవతెలంగాణ-బోడుప్పల్

పీఅండ్‌టీ కాలనీ మాజీ అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డి నిరాదర ఆరోపణలు చేస్తున్నారని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పీఅండ్‌టీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జనరల్ బాడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ కమిటీ రెండేండ్ల సమయం ముగియడంతో కాలనీవాసులు కమిటీని రద్దు చేసినట్టు ప్రకటించారు. అనంతరం గణేష్ ఉత్సవాల కోసం హడక్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పీఅండ్‌టీ కాలనీ స్వచ్ఛతకు, ప్రశాంతతకు ఆదర్శంగా ఉంటుందన్నారు. మాజీ అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డి కొంత మంది మాజీల మాటలు విని తనతో పాటు తన భర్తపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వాటిని తన భర్త విని సహించాడని, తన ముందు అంటే చెప్పుతో కొట్టేదానినని వాపోయారు. లేనిపోని నిరాదర ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని తనపై కక్ష కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కాలనీప్రజల అండదండలు ఉన్నాయన్నారు. కాలనీకి వచ్చి పదిహేను ఏండ్లు గడిచిందని, వచ్చిన మూడేండ్లకే తన భర్త శ్రీధర్ రెడ్డి కాలనీ అధ్యక్షులుగా, తనను కార్పొరేటర్‌గా గెలిచారని చెప్పారు. తమ మంచితనం ఏంటో ప్రజలకు తెలుసు అన్నారు. వెంకటేశ్వర టెంపుల్ నిర్మించడం కోసం కమిటీని వేసి విరాళాలు సేకరించి నిర్మాణం చేస్తుంటే సుధాకర్ రెడ్డి తట్టుకోలేక వసూలు చేసిన డబ్బును తిన్నారని అవహేలనగా మాట్లాడడం దారుణం అన్నారు. దీనిపై అందరూ సుధకార్‌రెడ్డిని మందలించడంతో పొరపాటున మాట్లాడనని చెప్పడంతో ఆయన వైఖరి ప్రజలకు అర్థమైందన్నారు.

కాలనీవాసుల అండతో గుడి నిర్మాణం - నిర్మాణ కమిటీ

పీఅండ్‌టీ కాలనీలో దాతల సహకారంతో గుడి నిర్మాణం చేపడుతున్నామని ఆలయ కమిటీ చైర్మెన్, అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం చేపట్టడం కోసం కాలనీ వాసులు విజయ్ కుమార్ గుప్తా చైర్మెన్‌గా, స్థానిక కార్పొరేటర్ ప్రసన్న లక్ష్మీ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో చిన్నజీయర్ స్వామీ ఆశీస్సులతో నిర్మాణానికి పూనుకున్నామని తెలిపారు. దాతలు కోటి యాభై లక్షలు చందాలు రాయగా తొంభై ఆరు లక్షలు చెక్కులు, నగదు రూపంలో వచ్చాయని, గుడి నిర్మాణం కోసం తొంభై లక్షల వరకు ఖర్చు అవగా ఆరు లక్షల వరకు బ్యాలెన్స్ ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో ఎలాంటి దాపరికం లేదన్నారు. మాజీ అధ్యక్షుడు జక్క సుధాకర్ రెడ్డితో పాటు కార్పొరేటర్ గిట్టని వారు కొంతమంది చైర్మెన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఆలయ కమీటీ సభ్యులు పాల్గొన్నారు.

ఫూలే, అంబేద్కర్‌కు జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో అంబేద్కర్, ఫూలే విగ్రహాల కు జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు నర్సింహ్మ చారి, నాగేష్ ఆదివారం జ్ఞానమాల సమర్పిం చారు. ఈ ఆదివారంతో జ్ఞానమాల సమర్పణ 118వ వారానికి చేరిందని తెలిపారు.

వర్షాలతో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశించారు. ఆదివారం కుషాయిగూడ డీ మార్ట్ ఎదురుగా రెండు నెలలుగా ప్రధాన రహదారిపై పొంగుతూ శివ సాయి నగర్ వీధులను ముంచెత్తున్న అండర్ గ్రౌండ్ డ్రయినేజీ లైన్ కాలువను కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, సర్కిల్ ఇంజనీరింగ్ ఈఈ హరిలాల్, ఏఈ కీర్తితో కలిసి పరిశీలించారు. శివ సాయినగర్, నాగార్జున నగర్ ఫేజ్-1, సాయి మిత్ర టవర్స్, వి.ఎన్.రెడ్డి నగర్ తదితర కాలనీల ప్రతినిధులతో కలిసి అండర్ గ్రౌండ్ మురుగు కాల్వను, పాడైన రోడ్లను కాలినడకన తిరుగుతూ పరిశీలించారు. యుద్ధ ప్రాతిపదికన పక్కాగా చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్ జగన్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులు నాయకులు ఎంపల్లి పద్మా రెడ్డి, నేమూరి మహేష్ గౌడ్, సారా అనిల్ ముదిరాజ్, నా రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, పనగట్ల చక్రపాణి గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, చల్లా వెంకటేష్, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, రామ్ రెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, నారా నర్సింహులు, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విహారిక కాలనీ సి సెక్టార్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ పరిధిలోని విహారిక కాలనీ సి సెక్టార్ కాలనీ అసోషియేషన్ ఎన్నికలలో అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి పాల్గొని సలహాదారులు రామకోటి, వీరయ్య, నాగార్జున సమక్షంలో కాలనీవాసులు కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా నాయిని రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బి.సంధ్య, ఏ.రమాదేవి, డి.రవి నాయక్, సిహెచ్. శ్రీశైలం గౌడ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.విజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కృష్ణమోహన్, జె.అశోక్, బి.నరసింహారెడ్డి, జి.లక్ష్మీ నిర్వహణ కార్యదర్శులుగా ఇ రజిని పి డా, కిరణ్, సంస్కృతి కార్యదర్శి కె.సూరిబాబులను నియమించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులను, కమిటీ సభ్యులను, శాలువాతో సన్మానించి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కార్యదర్శి రాజు కుమార్ నాయక్, కార్యవర్గ కమిటీ సభ్యులకు వీడ్కోలు పలుకుతూ సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడంతో ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలో కురిసిన భారీ వర్షాలకు మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్రకుమార్‌తో కలిసి వరద ప్రభావిత ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలకు పడిపోయిన చెట్లను, విరిగిపోయిన స్తంభాలకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, ఎమర్జెన్సీ కోసం 9640010053 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఘట్కేసర్ రూరల్

ఎదులాబాద్ గ్రామానికి చెందిన మనోజ్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ జడ్పీహెచ్ఎస్ 1995-1996 బ్యాచ్ నాటి బాల్య మిత్రులు మనోజ్ భార్య సప్నకు రూ.72,600 ఆదివారం అందజేశారు. తమ బ్యాచ్‌కు చెందిన మిత్రులకు ఎవరికైనా ఎలాంటి ఆపద వచ్చినా సాయం చేయడానికి ముందు ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 1995 -1996 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా దయానంద్ యాదవ్ జన్మది వేడుకలు



ఎమ్మెల్యే మల్లారెడ్డితో..



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో

- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిహెచ్. దయానంద్ యాదవ్ తన పుట్టినరోజు వేడకులు ఆదివారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను వేరువేరుగా వారి నివాసాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు దయానంద్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే వ్యక్తి దయానంద్ యాదవ్ అని కొనియాడారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభిపూర్ రాజులతో పాటు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. కలిసిన వారిలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ ఉన్నారు.

ఎంఎల్ఆర్ఐటీ ఏరోనాటికల్ విద్యార్థులకు బహుమతులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు ఎ.సాయికుమార్, ఎస్.శ్రీకాంత్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు జరిగిన ఎస్ఎఈ ఇండియా పోటీల్లో మూడు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీలు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగాయి. ఈ పోటీల్లో కళాశాల తరపున ఏరోనాటికల్ విద్యార్థులు మొత్తం నాలుగు టీంలుగా ఏర్పడి, టీం ఐరావత్, టీం ఏలస్, టీం వాయుపుత్ర, టీం డార్క్ సైడర్స్‌గా పోటీల్లో పాల్గొన్నారు. ఈ ఎస్ఏఈ-ఇండియా పోటీల్లో టీం ఏలస్ కెప్టెన్ హర్షిత యాదవ్ ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ మైక్రో క్లాస్ అవార్డులో మొదటి బహుమతితో పాటు రూ.10వేల నగదు బహుమతి అందుకున్నారు. టీం ఐరావత్ కెప్టెన్ ఇషాన్ సూరి ఆధ్వర్యంలో బెస్ట్ ఇన్నోవేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో రెండో బహుమతితో పాటు బెస్ట్ ప్రెజెంటేషన్ రెగ్యులర్ క్లాస్ అవార్డులో మూడో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రెటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ బహుమతులు సాధించడానికి ఎంతో శ్రమించిన ఏరోనాటికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు ఎ.సాయికుమార్, ఎస్.శ్రీకాంత్, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

మేడ్చల్‌లో దంచికొట్టిన వర్షం..



- పొంగిపొర్లిన వాగులు, చెరువులు
- మున్సిపాలిటీలో పర్యటించిన డీఈ

నవతెలంగాణ-మేడ్చల్

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మేడ్చల్ మండలంలో వాగులు, చెరువులు అలుగులు పోస్తూ పొంగిపొర్లుతున్నాయి. జనజీవనం పూర్తిగా స్తంభించిపోయి ఇండ్లకే పరిమితమయ్యారు. అధికారులు సైతం అత్యవసరమైతేనే ఇంట్లో నుండి బయటకు వెళ్లాలని సూచనలు సైతం జారీ చేశారు. కాగా మున్సిపల్ డీఈ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి మేడ్చల్ పెద్ద చెరువు అలుగును పరిశీలించారు. మేడ్చల్ నుండి గౌడవెల్లికి వెళ్లే దారిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డును తాత్కాలికంగా భారీకేడ్స్‌తో మూసి వేయించారు. రైల్వే బ్రిడ్జ్ క్రింద నుండి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించి వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మేడ్చల్ పెద్ద చెరువు అలుగును సీఐ అద్దాని సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ మణికంఠ గౌడ్‌లు పరిశీలించి ప్రమాదాలు జరగకుండా భారీకెడ్స్, జాలీ ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని ఘనపూర్ మత్తడి పై నుండి నీరు పొంగిపొర్లుతుండడంతో చేపలు పట్టుకోవడం కోసం స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



అల్వాల్‌లో కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు









అల్వాల్ సర్కిల్‌లో భారీ వర్షాలకు పలు చోట్ల భారీ వృక్షాలు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. గత రెండు రోజులగా కురుస్తున్న వర్షానికి చెరువులు కుంటలు నిండి, కరెంట్ స్తంభాలు చెట్లు విరగడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. -నవతెలంగాణ, అల్వాల్

దేశాభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానం





నవతెలంగాణ - ఘట్కేసర్ రూరల్

సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ అభివృద్ధి కోసం వినియోగించాలని వేద ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్బ రంగాయ్య తెలిపారు. మండలంలోని అంకుషాపూర్ ఎస్ కళాశాలలో ఆదివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. మన మేథస్సు సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశ శ్రేయస్సుకోసం వినియోగించాలని కోరారు. పోటీతత్వ ప్రపంచంలో సాంకేతిక ఉత్పత్తి, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అన్ని కాలనుగునంగా కనుమరుగై పోతాయని, కానీ జ్ఞాన సంపాదన ఎవరూ దోచుకోలేదన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మనపై మనకు నమ్మకంతో ముందుకు సాగాలని, అప్పుడే లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పొందిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్ విద్యా సంస్థలు కార్యదర్శి వైవి గోపాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ బిఎల్. రాజు సంయుక్త కార్యదర్శి ఎం. పద్మావతి అధ్యాపకులు విద్యార్థు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే -ఐజేయూ రాష్ట్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కలుకూరి రాములు



నవతెలంగాణ-బోడుప్పల్

టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా సీనియర్ జర్నలిస్టు కలుకూరి రాములు ఎన్నికయ్యారు. ఈ మేరకు సూర్యపేటలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నందుకు మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు వీరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డిలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు .రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

టీజీఎండీసీ ఎండీగా మల్సూర్



నవతెలంగాణ-ఉప్పల్

తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీగా మల్సూర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జరిచేసింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న మల్సూర్ గతంలో తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌గా పని చేసిన మాతృ సంస్థకు మళ్లీ ఎండీగా బాధ్యతను అప్పగించింది.

విజయపథంలో ఆ నలుగురు

అన్ని రంగాల్లో ముందుంటున్నా ఈ సమాజంలో ఇంకా మహిళలంటే చిన్నచూపే. అయినా అడ్డుగోడలను చీల్చుకుంటూ, అవరోధాలు దాటుకుంటూ, వివక్షను ఎదిరిస్తూ ఎంతో మంది మహిళలు తామేంటో నిరూపించుకుంటున్నారు. అనుకున్నది సాధించేందుకు అనునిత్యం తపిస్తూనే ఉన్నారు. అలాంటి వారే ఈ నలుగురు. మహారాష్ట్రకు చెందిన వీరు తమకు నచ్చిన భిన్న రంగాలలో దూసుకుపోతున్నారు. ఇతర మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు.

ఓకచ్చితంగా మద్దతు పొందుతారు



కృతి యారది... పూణేకి చెందిన పంతొమ్మిదేళ్ల కృతి బీట్‌బాక్సింగ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అయ్యింది. 'నేను తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడు మా పాఠశాలలో ఓ సంగీత పోటీ జరిగింది. ఇందులో మేము ఎటు వంటి వాయిద్యాలు లేకుండా సంగీతాన్ని సృష్టించాలి. మేము పాత పైపులను ఉప యోగించాం. ఓ గాజు సీసాలో బియ్యం పోసి కదిలించాం. అలాగే ఇద్దరు సీనియర్లు బీట్‌బాక్సింగ్ చేస్తున్నారు. ఇది చాలా మనోహరంగా అనిపించింది. ఆ రోజు పాఠశాల ముగిసిన తర్వాత నేను ఇంటికి వచ్చి యూట్యూబ్‌లో ట్యుటోరియల్స్ చూసి నేనే బోధించడం ప్రారంభించాను' అని ఆమె పంచుకున్నారు. సంఘంలోని ప్రతి ఒక్కరూ దీన్ని స్వాగతిస్తున్నారని కృతి అర్థం చేసు కుంది. అయితే అధిగమించాల్సిన కష్టతరమైన సవాళ్లు కూడా ఉన్నా యని ఆమె అన్నారు. ఇన్‌స్టాగ్రామ్ లో రీల్స్‌ను పోస్ట్ చేసే మహిళా బీట్‌బాక్సర్‌గా ట్రోలింగ్ ఎదుర్కొంటుంది. కానీ అవి తనని ఏ మాత్రం అడ్డుకోలేవని ప్రకటించింది. ఆమె మెరుగైన పనితీరుకు ఇది నిదర్శ నం. 'నేను నా రీల్స్‌ను పోస్ట్ చేయడం ద్వారా ఇతరు లను ప్రేరేపి స్తాను. నేను చేయ గలిగితే, మీరు కూడా చేయ గలరు. మీరు నేర్చుకునే దశలో ఉన్నా మీ నైపుణ్యాలను ప్రదర్శిం చండి. మీరు కచ్చితంగా మద్దతు పొందుతారు' ఆమె అంటున్నారు. ■

ఇంటి పంటతో...



అపూర్వ పురోహిత్... ఆజోల్‌తో (మరాఠీలో అమ్మానాన్నల ఇల్లు అని ఈ పదానికి అర్థం) అవార్డు గెలుచుకున్న వ్యాపారవేత్త అపూర్వ పురోహిత్. ఆమె కుమారుడు మేనేజ్‌మెంట్ మేవెన్ సిద్ధార్థ్. మహారాష్ట్రలోని ప్రజలకు ఇంటిలో పండే ఆహారాన్ని పరిచయం చేశారు. గ్రామాలలోని స్త్రీలు తమ ఇంటి పంటను రుచి చూసేందుకు సహాయపడ్డారు. దీని కోసం 16 స్వయం సహాయక సంఘాలు, మహిళా సూక్ష్మ పారిశ్రామికవేత్తలతో కలిసి పని చేస్తున్నారు. చేతితో తయారు చేసే మసాలే (మసాలా), పీత్ (పిండి), చట్నీ (పొడి, తాజా చట్నీ), తండూల్ (బియ్యం), పాపడ్ వంటి అద్భుతమైన రుచులను అందిస్తున్నారు. ■



సాగులో ఆమెకు ఆమె సాటి



సువర్ణ భగవాన్ పాటిల్... 43 ఏండ్ల ఈమెకు వ్యవసాయ జీవితం కొత్తేమీ కాదు. రైతు కుటుంబంలో పుట్టి పెరిగిన ఆమె చాలా చిన్న వయసులోనే మెలకువలు నేర్చుకుంది. పెండ్లి తర్వాత మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా గొండోలి గ్రామంలోని మరో రైతు కుటుంబంలోకి వెళ్ళింది. అక్కడ తన నైపుణ్యాలతో 2.5 ఎకరాల భూమిలో చెరుకు సాగు చేసింది. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల వల్ల వస్తున్న నష్టాలను గుర్తించి కొత్తగా ఏదైనా చేయాలనుకుంది. సాలిడారిడాడ్, దాల్మియా భారత్ షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ద్వారా ఉన్నతి మీతా సోనా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంపై నిర్వహిం చిన శిక్షణలో పాల్గొంది. ఫలితంగా 2022లో తన వర్మీకం పోస్టింగ్ ప్రయాణాన్ని ప్రారంభిం చింది. అవి రైతు వ్యాపారవేత్తగా మారింది. 'నేను మట్టిని ఆరాధిస్తాను. ఎందుకంటే మనం తినే ఆహారం మట్టి వల్లనే లభిస్తుంది. నేను భూమి తల్లిని ప్రేమిస్తున్నాను. నేల ఆరోగ్యం దానిపై పండే ఆహారంపై ప్రభావం చూపుతుంది. తద్వారా ఆహారాన్ని తినే మానవుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని నేను అర్థం చేసుకున్నాను. శిక్షణా కార్యక్రమంలో మట్టిపై వర్మీ కంపోస్ట్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకున్నాను. అందుకే నా పని దీనితో ప్రారంభించాను. వానపాములు, కంపోస్ట్‌లను అమ్మడం ద్వారా నా ఆదాయాన్ని పెంచుకున్నాను' అని సువర్ణ గుర్తు చేసుకున్నారు. ■

ప్రయత్నిస్తే విజయం మీదే



అంత్రా మెహతా... నాగ్‌పూర్‌కు చెందిన ఈమె భారత వైమానిక దళంలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. మహారాష్ట్రలో మొట్టమొదటి మహిళా పైలట్ ఫైటర్‌గా గుర్తింపు పొందారు. దేశంలో పదో మహిళా యుద్ధ విమాన పైలట్. నాగ్‌పూర్‌లోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో చదువుకున్న మెహతా, శ్రీ రామ్‌దేవ్‌బాబా కమల నెహ్రూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో చదువుకున్నారు. జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడాకారిణి. చిన్నప్పటి నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరాలని కలలు కనేది. హైదరాబాద్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ లో శిక్షణ పొందిన మెహతా ఇటీవలె తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, ఫైటర్ స్ట్రీమ్‌కు ఎంపికైన తన బ్యాచ్‌లోని ఏకైక మహిళా అధికారి. తన కుటుంబం నుండి ఈ రంగంలోకి వచ్చిన మొదటి వ్యక్తి కూడా ఈమే. మెహతా పిలాటస్ పిసి7 శిక్షణా విమా నంతో తన నైపుణ్యానికి పదును పెట్టింది. ఇటీవలె హైదరాబాద్‌లో శిక్షణ పూర్తి చేసుకొని తర్వాతి శిక్షణ కోసం బీదర్, కలైకొండ ఎయిర్ ఫోర్స్ స్టేషన్లకు వెళ్లారు. మెహతా సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బి) పరీక్షను పూర్తి చేయడానికి చాలా కష్టపడ్డారు. రెండుసార్లు ప్రయత్నించి విఫలమైనా మూడవసారి క్లియర్ చేశారు. ఇంటర్వ్యూ సమయం లో కూడా మూడు విషయాలను దృష్టిలో ఉంచుకున్నట్లు ఆమె పంచుకున్నారు. ముందుగా ఇతరుల నుండి నేర్చుకున్న అనుభవాలతో మనం కూడా కొత్తగా ఏదైనా ప్రారంభించాల్సిన ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు. రెండవది, తన శిక్షణా అకాడమీలో పొందిన ప్రతి సలహాలను పాటించారు, అనుసరించారు. ఇక మూడవది ఆమె ఈ ప్రయాణాన్ని ఆస్వాదించడాన్ని కూడా గుర్తుచేసు కున్నారు. వీటన్నింటి ఫలితంగా ఆమె విజయం సాధించారు. 'ఎస్ఎస్‌బి అనేది చాలా కష్టమైన ప్రక్రియ కాదు, ప్రాథమిక వ్యక్తిత్వ పరీక్ష, ప్రయత్నిస్తే ఎవరైనా సరే కచ్చితంగా క్లియర్ చేస్తారు' అని మెహతా అంటున్నారు. ■

రోజూ ఇలా చేస్తే..

పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్).. మహిళల పాలిట శాపంగా మారింది. ప్రస్తుత జీవన శైలి కారణంగా.. మన దేశంలో ప్రతి నలుగురు మహిళల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య తమకు ఉన్నట్టు కూడా కొంతమందికి తెలియదు. ఇక వీరిలో నెలసరి క్రమం తప్పడం, సంతానలేమి, మూడ్ స్వింగ్స్, ఊబకాయం, చర్మపు ట్యాగ్‌లు, చర్మం నల్లబడటం, కంటి నొప్పి, జుట్టు రాలడం, మొటిమలు.. వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటారు. పీసీఓఎస్ ఉన్న మహిళలందరికీ ఒకే లక్షణాలు ఉండవు, వారి వయసు, శరీరం తత్వం ప్రకారం లక్షణాలు మారతాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. పీసీఓఎస్‌తో బాధపడే స్త్రీలకు గుండె జబ్బులు, మధుమేహం, ఎండోమెట్రియల్ క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదముంది. పీసీఓఎస్ సమస్య ఉన్న మహిళలు.. చక్కటి లైఫ్‌స్టైల్‌ను అలవాటు చేసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు. పీసీఓఎస్ ఉన్న మహిళల్లో అసాధారణ స్థాయిలో ఆండ్రోజన్స్ (పురుష హార్మోన్లు) ఉత్పత్తవుతుం టాయి. ఇవి అండాశయాలపై చిన్న చిన్న సిస్టుల్లాగా కనిపిస్తుంటాయి.. ఫలితంగా హార్మోన్ల స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఏర్పడుతుంటాయి.



కరెక్ట్‌గా తినండి..

మీరు ఏది తింటున్నారనేదే కాదు.. ఎప్పుడు తింటున్నారనేది మీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. రోజూ సమయానికి ఆహారం తీసుకునేలా ప్లాన్ చేసుకోండి. మీ శరీరంలోని టాక్సిన్స్ తొలగించడానికి ఆరోగ్యకరమైన, నీటి శాతం ఎక్కువగా ఉండే ఆహారాన్ని మీ డైట్‌లో చేర్చుకోవాలి. ఇంట్లో వండిన ఆహారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వండి. ఫైబర్, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా లభించే గుడ్లు, బాదంపప్పులు, ఓట్స్, పాలు, పాల పదార్థాలు, చికెన్.. వంటివి రోజువారీ మెనూలో భాగం చేసుకోవాలి. అలాగే శీతల పానీయాలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే బంగాళాదుంపలు, వైట్ బ్రెడ్.. వంటి పదార్థాలకు దూరంగా ఉండాలి. మీ కిచెన్‌లో ప్లాస్టిక్, అల్యూమినియం, టెఫ్లాన్ పాత్రలను దూరం పెట్టండి. ఈ పార్టికల్స్ కారణంగా హార్మోన్ల అసమతుల్యత వచ్చే అవకాశం ఉంటుంది.

వ్యాయామం, యోగా

రోజూ వ్యాయామం, యోగా చేస్తే యాక్టివ్‌గా ఉంటారు. మీరు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే.. మీ శరీరంలో కొవ్వు కరుగుతుంది. మీ మానసిక స్థితి మెరుగుపరచ డానికి, హార్మోన్లను సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. శరీరం యాక్టివ్‌గా ఉండాలంటే వారానికి ఐదు రోజులు గంట వ్యాయామం తప్పనిసరని ఫిట్‌నెస్ నిపుణులు అంటున్నారు. మహిళలు హెల్తీ లైఫ్ స్టైల్ కోసం రోజులో.. ఎనిమిది గంటలు కదులుతూనే ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

సినీ పరిశ్రమలో పవర్ గ్రూప్ లేదు : మమ్ముట్టి

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయం తెలియజేయడానికి ముందు మళయాళ మూవీ ఆరిస్టుల సంఘం, దాని నాయకత్వం అభిప్రాయం కోసం ఎదురు చూశానని తెలిపారు. మోహన్ లాల్ చెప్పినట్లుగానే సినీ పరిశ్రమలో 'పవర్ గ్రూప్' లేదని అన్నారు. కమిటీ నివేదిక కూడా ఇదే విషయాన్ని తెలియజేసిందని గుర్తు చేశారు. 'సమాజంలో మంచి, చెడు ఉన్న విధంగానే సినిమాలో కూడా ఉన్నాయి. సినీ పరిశ్రమలో ఉన్న వారు సమాజంలో భాగమే. అయితే సినీ పరిశ్రమను ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. అక్కడ ఏం జరిగినా చర్చ చోటుచేసుకుంటుంది. ఈ రంగంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిత్రసీమలో పనిచేసే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఓ ఘటన జరగడంతో పరిశ్రమను అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వం హేమ కమిటీని ఏర్పాటు చేసింది' అని మమ్ముట్టి ఆదివారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కమిటీ సిఫారసులను, అది సూచించిన పరిష్కారాలను పరిశ్రమ హృదయపూర్వకంగా స్వాగతిస్తోందని, మద్దతు ఇస్తోందని తెలిపారు. వాటిని అమలు చేసేందుకు సినీ పరిశ్రమలోని అన్ని సంఘాలు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

'ఇటీవల వచ్చిన ఆరోపణలపై పోలీసు విచారణ సమర్థవంతంగా జరుగుతోంది. హేమ కమిటీ పూర్తి నివేదిక ఇప్పుడు న్యాయస్థానం ముందు ఉంది. పోలీసులను నిజాయితీగా విచారణ చేయనివ్వండి. శిక్షలను కోర్టు నిర్ణయిస్తుంది. కమిటీ తన నివేదికలో చేసిన ఆచరణ సాధ్యమైన సిఫార్సులను అమలు చేయాలి. న్యాయపరమైన అడ్డంకులు ఏర్పడితే అవసరమైన చట్టాలు రూపొందించాలి. అంతిమంగా సినిమా మనుగడ సాగించాలి' అని మమ్ముట్టి సూచించారు.

ఈ నెల 19న బహిర్గతమైన హేమ కమిటీ నివేదికపై ఇరువురు సూపర్ స్టార్లు మోహన్‌లాల్, మమ్ముట్టి ఇప్పటి వరకూ మౌనం వహించడంపై విమర్శలు వచ్చాయి. నివేదికపై మోహన్‌లాల్ శనివారం వ్యాఖ్యానించగా తాజాగా మమ్ముట్టి స్పందించారు.

వందేభారత్‌లో బీజేపీ కార్యకర్తల వెకిలి చేష్టలు

(మొదటిపేజీ తరువాయి)

ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. రైలు కోచ్ గుండా వెళ్తున్న బాధిత మహిళను ఒకరు అడ్డుకున్నారు. సదరు క్యాబిన్ బీజేపీ సభ్యుల కోసం రిజర్వ్ అయిందనీ, అటు గుండా వెళ్లటానికి అనుమతి లేదని బాధిత మహిళతో తెలిపాడు. తిరిగి వెనక్కి వెళ్తున్న మహిళతో పాటు ఆమె వెంట ఉన్న వ్యక్తితో వాదనకు దిగారు. అంతే కాకుండా వారిని బీజేపీ కార్యకర్తలు తోశారు. అయితే, ఈ ఘటనపై సదరు మహిళ, ఆమెతో ఉన్నవ్యక్తి ఆందోళనను వ్యక్తం చేశారు. వందేభారత్ ట్రైన్ ప్రారంభోత్సవాన్ని కవర్ చేసేందుకు ఇన్‌ఫ్లుయెన్సర్లుగా తమకు ఆహ్వానం అందటంతో తాము ఇక్కడికి వచ్చామని సదరు మహిళతో ఉన్న వ్యక్తి చెప్పాడు. బీజేపీ తమను ఇన్‌ఫ్లుయెన్సర్లుగా నియమించున్నదని తెలిపాడు. అయితే, బీజేపీ కార్యకర్తలు రైలును తమ స్వంత ఆస్తిలాగా భావించారనీ, వారు తన సోదరితో తప్పుగా ప్రవర్తించారని అన్నాడు.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్‌గా మారింది. ఈ ఘటనను కాంగ్రెస్ ఖండించింది. రైలు అనేది ప్రజల ఆస్తి అనీ ఇది బీజేపీ వ్యక్తిగత ఆస్తి కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి షమా మొహమ్మద్ ఎక్స్ వేదికగా స్పందించారు. మహిళా ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారనీ, వారిపై తగిన చర్యలను తీసుకోవాలంటూ ప్రధాని మోడీకి ట్యాగ్ చేస్తూ బీజేపీ కార్యకర్తలపై ఆమె ఫిర్యాదు చేశారు. ఇటు నెటిజన్లు కూడా.. బీజేపీ కార్యకర్తల తీరును తీవ్రంగా తప్పుబడుతున్నారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను వారు తమ స్వంత ఆస్తిలా భావిస్తూ, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గురుకులాల్లో బువ్వ పెట్టలేని దుస్థితి

నవతెలంగాణ-దేవరకొండ

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో గురుకుల పాఠశాలలు.. విద్యార్థులకు సరైన భోజనాలు పెట్టలేని పరిస్థితిలో ఉన్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లి బీసీ గురుకుల పాఠశాలలో గత సోమవారం రాత్రి నిద్రిస్తున్న 14 మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బీఆర్ఎస్ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల బృందం ఆ పాఠశాలను సందర్శించి జరిగిన సంఘటన, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 8 నెలలుగా గురుకుల పాఠశాలను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. కేసీఆర్ హయాంలో ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దిన గురుకుల పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్యను అందించే గురుకుల పాఠశాలలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులను ఎలుకలు కొరికిన ఘటన అందరిని తీవ్రంగా కలచి వేసిందని అన్నారు. తెలంగాణ హాస్టళ్లలో వసతులు చాలా అధ్వానంగా ఉన్నాయని, కనీసం విద్యార్థులకు ఫ్యాన్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఎలుకలు కరిస్తే కనీసం విద్యార్థులకు వైద్యం అందించలేని పరిస్థితిలో ఉందన్నారు. విద్యార్థులకు స్కూలు యూనిఫామ్, దుప్పట్లు, కాస్మోటిక్ బిల్లులు రాలేదని విమర్శించారు. పాఠాలు బోధించే ఉపాధ్యాయులు, గెస్ట్ లెక్చరర్లకు, కాంట్రాక్ట్ టీచర్లకు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. వేల కోట్ల రూపాయల పన్నులను ప్రజల నుంచి వసూలు చేసి పేద విద్యార్థులకు కనీస విద్య, కనీస అవసరాలను అందించలేకపోతున్నారని విమర్శించారు. విద్యార్థులకు భోజన బిల్లులు, వంట చేసే వాళ్లకు మూడు నెలల జీతాలు, కరెంట్ బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. జైల్లో ఉండే ఖైదీలకు రోజుకు రూ.83 ప్రభుత్వం ఖర్చు చేస్తుంది, కానీ విద్యార్థిపై రూ.36 మాత్రమే ఖర్చు చేస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో నెలకు నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మటన్, ప్రతిరోజూ కోడిగుడ్లతో పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందించే వారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ సంఘటనలు 23 జరిగాయని, ఇందులో 715 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి 36 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలో చనిపోయారని ఆరోపించారు. ఎస్సీ, గిరిజన, మైనార్టీ, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం వల్ల రాష్ట్రంలో విద్య నిర్లక్ష్యానికి గురైందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు నాణ్యమైన విద్య అందించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిషోర్‌కుమార్, ఎన్.భాస్కరరావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించడం నేరం

నవతెలంగాణ-శంషాబాద్

విద్యార్థులను కులం పేరుతో దూషించడం క్షమించరాని నేరమని ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శంషాబాద్ మండలంలోని పాలమకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆదివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు, బాలికలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతులు, ఇతర సమస్యలు ఉపాధ్యాయులు వేధిస్తున్న తీరు అన్నింటినీ స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులను కులం పేరుతో దూషించడం, అవమానపరచడం క్షమించరాని నేరమన్నారు. వసతి గృహంలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని, సమస్యలు పరిష్కరిస్తామని విద్యార్థులు ఎవరూ కూడా ఆందోళన చెందొద్దని హామీ ఇచ్చారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. మంత్రి వెంట.. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మెన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, డీఈఓ సుశీందర్‌రావు, లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన టీచర్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ ఆదేశం

విద్యార్థినులను కులం పేరుతో దూషించిన టీచర్‌ను సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకయ్య ఆదేశించారు. పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని, కుల వివక్ష చూపించిన ఉపాధ్యాయురాలిని వెంటనే సస్పెండ్ చేయాలని డీఈవోను ఆదేశించారు. అనంతరం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ విద్యార్థులను అవమానపరుస్తూ కులం పేరుతో దురుసుగా మాట్లాడి, హేళన చేసిన ఉపాధ్యాయురాలిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామారావు, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, తహసీల్దార్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ బాదుడు షురూ

(మొదటిపేజీ తరువాయి)

పెరగడం మార్కెట్ స్వభావాన్ని ప్రతిబింబిస్తోంది. ధరల నిర్ణయాలను అంతర్జాతీయ చమురు ధరలు, పన్ను విధానాలు, సరఫరా-డిమాండ్ పరిస్థితులు ప్రభావితం చేస్తున్నాయి. పెంపుదలపై తాజాగా తీసుకున్న నిర్ణయానికి కారణమేమిటో తెలియనప్పటికీ విస్తృత ఆర్థిక పరిస్థితులు, మార్కెట్లను దృష్టిలో పెట్టుకొని చమురు కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ధరల పెంపుదల ప్రభావం వ్యాపారాలపై పడుతోంది. ఎందుకంటే వ్యాపార కార్యకలాపాలన్నీ వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లతోనే జరుగుతుంటాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, చిన్న తరహా తయారీ యూనిట్లు ఎల్పీజీ సిలిండర్ల పైనే ఆధారపడుతున్నాయి. ఇప్పుడు ధరల పెంపుదలతో అవి తమ నిర్వహణ ఖర్చును తిరిగి అంచనా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా భారం పడేది సామాన్య ప్రజల పైనే.

కోర్టుల్లో 'వాయిదాల సంస్కృతి' మారాలి

పెండింగ్ కేసులు భారీగా పెరగడం పెద్ద సవాల్ : రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: సత్వర న్యాయం అందించాలంటే కోర్టుల్లో వాయిదాల సంస్కృతి మారాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పెండింగు కేసులు భారీ స్థాయిలో పెరిగిపోవడం అతిపెద్ద సవాల్ అన్నారు. జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సులో ప్రసంగించిన ఆమె.. న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత దేశంలోని న్యాయమూ ర్తులందరిపై ఉందన్నారు."కోర్టులకు హాజరు కావడమనేది సామాన్యులపై ఒత్తిడి పెంచుతుంది. కోర్టుల్లో వాయిదాల పద్ధతిని మార్చేందుకు అన్ని విధాలా కృషి చేయాలి. న్యాయాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో మహిళా అధికారుల సంఖ్య పెరగడంపై సంతోషం వ్యక్తం చేశారు.భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌లు హాజరయ్యారు.

బెజవాడ గజగజ

(మొదటిపేజీ తరువాయి)

నీరు కలవడంతో జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద బుడమేరు గేట్లను అధికారులు ఎత్తివేశారు. దీంతో, వెలగలేరు, హెచ్ ముత్యాలంపాడు, కవులూరు – కొండపల్లి మధ్య సుమారు ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. పలు చెరువుల కట్టలు తెగిపో యాయి. దీనిపై ప్రజలకు ఎటువంటి ముందస్తు సమాచా రమూ ఇవ్వకపోవడం, బుడమేరు పరీవాహక ప్రాంతం ఆక్రమణలకు గురికావడంతో అనేక గ్రామాలతోపాటు విజయవాడ నగరం కూడా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి గ్రామాలు వర్షం నీటితోపాటు ఓవైపు ఎన్‌టిటిపిఎస్ కూలింగ్ కెనాల్, బూడిద చెరువు, మరోవైపు బుడమేరు పోటెత్తడంతో జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. కవులూరు, ఈలప్రోలు, రాయనపాడు, పైడూరుపాడు, గొల్లపూడి తదితర గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. వేలాది ఇళ్లు నీట మునిగి రాకపోకలు స్తంభించిపోయాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. . ఓ మహిళ మృతదేహం సింగ్‌నగర్ ప్రాంతానికి కొట్టుకువచ్చి కారుపై ఇరుక్కుపోయింది. దీంతో, ఆ ప్రాంతంలోవారు తీవ్ర భయాందోళనలకు గురయ్యాయి. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో ఓ యువకుడు వరద నీటిలో గల్లంతయ్యాడు వరద ప్రభావిత ప్రాంతాల్లో కొన్ని పశువులు, కుక్కలు, కోళ్ల జాడ తెలియడం లేదు. ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గగుడి, కొండపల్లి ఘాట్ రోడ్లలో కొండచరియలు విరిగిపడ్డాయి.

సహాయక చర్యలు..ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

బుడమేరు వరద బాధితులకు తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ సింగ్‌నగర్‌లోని బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో ఆదివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ బోట్లో లైఫ్ జాకెట్ వేసుకుని ముంపు ప్రాంతాల ప్రజలను సందర్శించారు. ఆయనతోపాటు మంత్రులు కె.నారాయణ, కొల్లు రవీంద్ర, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉన్నారు. ముందుగా ఆయన విజయవాడ కనకదుర్గ వారధి వద్ద కృష్ణా నది వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. బుడమేరు మునక ప్రాంతంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడతూ ఎన్నడూలేని విధంగా విజయవాడను బుడమేరు ముంచెత్తిందన్నారు. బుడమేరులో ఊహించని స్థాయి వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. బాధితులందరినీ ఆదుకుంటామని చెప్పారు. పాలు, ఆహారం, నీళ్ల, కొవ్వొత్తులు, టార్చ్‌లు తక్షణం తెప్పించాలని అధికారులను ఆదేశించారు. లక్ష మందికి సరిపోయే ఆహారం సరఫరా చేయాలన్నారు. తక్షణం అందుబాటులో ఉన్న ప్యాక్డ్ ఫుడ్‌ను బాధితులకు సరఫరా చేయాలని సూచించారు.

భయం గుప్పెట్లో కోస్తాంధ్ర

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీలోని కోస్తాంధ్ర ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం అర్ధరాత్రి కళింగపట్నం సమీపంలో తుపాను తీరం దాటిందని విశాఖ వాతావరణకేంద్రం అధికారి శ్రీనివాసరావు తెలిపారు. తీరం దాటిన వాయుగుండం జగదల్‌పూర్‌కు ఆగ్నేయంగా 60 కిలోమీటర్లు, విశాఖకు వాయువ్యంగా 120 కి.మీ దూరంలో ఉందని పేర్కొన్నారు. ఇది క్రమంగా దక్షిణ ఒడిశా- విదర్భ చేరుకుని బలహీనపడుతుందని తెలిపారు.ఇప్పటికే రాష్ట్రమంతా విస్తారంగా కురుసున్న వానలు ఏరులైపారుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి.పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఏలూరు, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు ప్రకటించారు. ఉత్తరాంధ్ర తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని తెలిపారు.


ఖమ్మంలో...


మున్నేరువాగు...


మహబూబాబాద్‌లో...


వరంగల్‌లో...

జలదిగ్బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఇంటిపైకి ఎక్కి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గణేశ్‌నగర్, దనవాయి గూడెం ప్రాంతాల్లోనూ చాలా ఇండ్లు నీట మునిగాయి. ఖమ్మం నగరంలోని ఎంపీ గార్డెన్‌లో 80 మంది కార్మికులు చిక్కుకున్నారు. వారికి సాయం కోసం ఎదురుచేస్తున్నారు. కారేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలోకి నడుములోతు వరద నీరు రావటంతో పై అంతస్తులో తలదాచుకున్న విద్యార్థులు. భయాందోళనతో విద్యార్థినులను తల్లిదండ్రులు ఇంటికి తీసుక వెళ్తున్నారు. కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెంకు చెందిన దంపతులు పాలేరు వాగులో చిక్కుకొని గల్లంతయ్యారు, ప్రవాహంలో కొట్టుకుపోతున్న మరో యువకుడిని స్థానికులు, పోలీసులు రక్షించారు. చింతకాని మండటలం నేరడలో వరద తీవ్రతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం పట్టణంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితుల సమస్యల వింటూ అధికారులకి తక్షణమే ఆదేశాలు జారీ చేస్తున్నారు. కాగా, వరద ప్రాంతాలను పరిశీలించిన సీపీఐ(ఎం) నేతలు.. ఖమ్మంలో కాడ్రా ఏర్పాటు చేసి చెరువులు, పార్కులు, ప్రభుత్వం స్థలాలను ఆక్రమించి కట్టిన బిల్డింగ్‌లను కూల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణం పూర్తిగా జలమయం అయింది. కుందరాయినగర్, ఆదర్శనగర్, కాళీమాత ఏరియా, పైలట్ కాలనీ, వినాయక్ నగర్, ఆశోక్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ఇండ్లలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరద నీటితో విష సర్పాలు ఇండ్లలోకి చేరడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మణుగూరు ప్రధాన రహదారిపై అర కిలోమీటరు మేర వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముంపు ప్రభావిత ప్రాంతాలను అధికారులు సందరిశంచి సహాయక చర్యలు చేపట్టారు. అశ్వాపురంలో తుమ్మలచెరువు వెంకటాపురంలో వాగు ఉధృతికి ఇద్దరు వృద్ధులు కొట్టుకుపోయారు. 200 మేకలు, 20 పశువులు నీటిలో కొట్టుకుపోయి మృత్యువాతపడ్డాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

వరంగల్ జిల్లాలో వరంగల్-ఏటూర్‌నాగారం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరంగల్-హైదరాబాద్ హైవేపై రఘునాథపల్లి వద్ద వరద నీరు చేరడంతో కొన్ని గంటలపాటు రవాణా నిలిచిపోయి, భారీగా ట్రాఫిక్ జామయింది. జనగామ డీసీపీ రాజు మహేంద్రనాయక్ నేతృత్వంలో పోలీసులు జాతీయ రహదారిపై డివైడర్లను జేసీబీతో తొలగించి వరద వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా ఇంటికన్నె-కేసముద్రం మధ్య రైల్వే ట్రాక్ కొట్టుకుపోవడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మొక్కజొన్న, వరి పొలాలు నీటమునిగాయి. చెరువులు తెగిపోయాయి. చలివాగు, మున్నేరు, ఆకేరు, పాకాల, జంపన్నవాగు, జీడి వాగు, దయ్యాల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దాంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ మత్తడి పోటెత్తడంతో వరంగల్-ములుగు జాతీయ రహదారిపైకి భారీ వరద చేరింది. అప్రమత్తమైన పోలీసు, రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడ పికెట్‌ను ఏర్పాటు చేశారు. మంత్రి సీతక్క వరద పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను ఆదేశించారు.

వరంగల్, హన్మకొండ నగరాల్లో భారీ వర్షాలు కురవడంతో నాలాలు పొంగిపొర్లాయి. హన్మకొండ బస్టాండ్ ప్రాంతం జలమయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. హన్మకొండ-కాజీపేట ప్రధాన రహదారి 'నిట్' సమీపంలో త్రివేణి సూపర్‌మార్కెట్ వద్ద భారీ వరద చేరింది. హన్మకొండ తిరుమల జంక్షన్‌ను వరద ముంచెత్తింది. వరంగల్ నగరంలో 32, 33, 39 డివిజన్‌లలో లక్ష్మీనగర్, ఏకశిలానగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాల్లో వరద ఇండ్లల్లోకి చేరింది. నిత్యావసర వస్తువులు తడిసిపోవడంతో కాలనీవాసులు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. బీరన్నకుంట, ఎస్ఎస్ నగర్, గిరిప్రసాద్‌నగర్ ప్రాంతాల్లో ప్రజలు వరదముంపులో చిక్కుకున్నారు. వీరిని సురక్షిత ప్రాంతాలకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు తరలిస్తున్నారు. హన్మకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం రాజపేటకు చెందిన గువ్వ రాములు (58) ఆగస్టు 30న చేపలు పట్టడానికి స్థానిక పెద్దరికంట వాగుకి వెళ్లి తిరిగిరాలేదు. పెద్ద చెరువులో డ్రోన్ కెమెరాలతో వెతకగా రెండు రోజుల తర్వాత సమీప వరి పొలాల్లో మృతదేహం లభించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన జక్రిపోతుల మల్లికార్జున్ (35) పశువుల కోసం వెళ్లి స్థానిక వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల నరసయ్య చేపల వేటకు వెళ్లి గ్రామంలోని బర్లచెరువులో గల్లంతయ్యారు. అలాగే కాటాపూర్‌లో పిడుగుపాటుకు గేదె మృత్యువాతపడింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడవెండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 150 గొర్రెలు ఆ వరదలో చిక్కుకొని కొట్టుకుపోయాయి. కాగా గొర్రెల కాపరులను గ్రామస్తులు జాగ్రత్తగా ఒడ్డున చేర్చారు.

ఓసీల్లో స్తంభించిన బొగ్గు ఉత్పత్తి

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కేటీకే ఓసీ-2,3లో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తి స్తంభించింది. ఓసీ -2లో రోజుకు 4వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, రెండు రోజుల్లో 8వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓసీ-3లో రోజుకు 5వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా రెండు రోజులకు గాను 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి స్తంభించింది. రెండు ఓసీల్లో కలిసి రెండు రోజుల్లో మొత్తం 18వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఒక టన్ను బొగ్గు విలువ సగటున రూ.3500 కాగా మొత్తం రూ.18వేల టన్నులకు గాను రూ.6కోట్ల30లక్షలు నష్టం వాటిల్లినట్టు అధికారులు పేర్కొన్నారు.

వాగుల ఉధృతితో పోలీసుల సహాయకచర్యలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మోస్తారు వర్షాలు కురవడంతో చెరువులు కుంటలు నిండుకుండల్లా మారాయి. సిద్దిపేట జిల్లా మండల కేంద్రంలోని బెజ్జంకిలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న 70 ఏండ్ల నాటి వేప చెట్టు నేలకొరిగింది. గ్రామాల్లో చెరువులు,కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. బెజ్జంకి క్రాసింగ్ నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రధాన రోడ్డుపై ఈదులవాగు నీటి ప్రవాహంతో పొంగిపోర్లుతుండటంతో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రయాణికులను వాగు దాటిస్తున్నారు. హుస్నాబాద్‌లోని కిరాణం, ఫర్టిలైజర్ తదితర షాపుల్లోకి వరద నీరు పోవడంతో షాపులన్నీ నిండుకుండల్లా


సూర్యపేటలో...

మారాయి. ఆర్టీసీ డిపో ప్రహరీ గోడ కూలింది. హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి పడటంతో పందిళ్ల వాగుపై వరద నీటి ప్రవాహంలో రాకపోకలు నిలిచిపోయాయి. మద్దూరు మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన బోయిని రజిత ఇల్లు, అక్కన్నపేట మండలం కపూర్ నాయక్ తండా పరిధిలోని పూసల తండాలో బాదావత్ బీమా నాయక్ (40) పెంకుటిల్లు, బెజ్జంకి మండల పరిధిలోని రేగులపల్లి, పెరుకబండ గ్రామాలకు చెందిన తాళ్ల ప్రసాద్, కొంపల్లి రాములు పెంకుటిండ్లు కూలిపోయాయి. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలోని క్రింది వాడకట్టుకు చెందిన మంద స్వరూప పెంకుటిల్లు కూలిపోయింది. కిష్టాపూర్ ఆల్ దీ డ్యామ్ నిండి పొంగిపొర్లుతుండటంతో గ్రామానికి ఉన్న రహదారిని తూప్రాన్ మున్సిపల్ అధికారులు మూసివేశారు. నిజాంపేట మండల కేంద్రం నుంచి చల్మెడ వెళ్లే రోడ్డులో కల్వర్టు పై నుండి నీరు వెళ్ళడంతో పోలీసు శాఖ ముళ్ళ కంపలను అడ్డంగా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఏడుపాయల దుర్గాభవాని తలుపులు మూసి వేసి, భక్తులెవరూ దర్శనానికి రావొద్దని అధికారులు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో చేతికి వచ్చిన మినుము, పెసర పంటలు నీట మునిగిపోయాయి.

పంటలు నీటమునిగాయి.. ఇండ్లు దెబ్బతిన్నాయి

రంగారెడ్డి జిల్లాలోని మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, చందానగర్, రాయదుర్గం, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాజేంద్రనగర్ సర్కిల్‌లో పలు ఇండ్లలోకి వర్షపు నీరు చేరింది. ఆమనగల్, కడ్తాల్ మండలాల్లో పంటలు నేలకొరిగాయి. ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మేడిగడ్డ శంకర్ కొండ తాండా గ్రామ పంచాయతీల మధ్య ఉన్న కత్వ వాగు ప్రమాదకరంగా పొంగి పొర్లుతుంది. శంకర్‌పల్లి మండలంలోని మూసీ, పొద్దుటూరు, టంగుటూరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామ రెవెన్యూ పరిధిలో ఈసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కేబీ దొడ్డి, సుల్తాన్‌పల్లి గ్రామాల్లో వందల ఎకరాల వ్యవసాయ భూములు నీట మునిగాయి. అమడాపూర్ బ్రిడ్జి నిర్మాణ సమయంలో ఏర్పరచిన శిలాఫలకం కూలేందుకు సిద్ధంగా ఉన్నది. సుల్తాన్‌పల్లి-కేబి దొడ్డి రాకపోకలు నిలిచిపోయాయి. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హుడా కాలనీ రోడ్డుపై వృక్షాలు నేలకొరిగాయి. మొయినాబాద్ మండలంలోని చిన్న మంగళవారం సమీపంలో మూసీ వాగు పొంగుతోంది. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, తాండూర్, మోమిన్‌పేట మండలాల్లో పలు ఇండ్లు కూలిపోయాయి. బషీరాబాద్ మండలంలో వరి పంట నీటమునిగింది. యాలాల పరిధిలోని కాగ్నా నది జుంటిపల్లి, శివసాగర్ ప్రాజెక్టులు పొంగిపొర్లాయి. నవాబుపేట మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

రహదారులు మునిగి రాకపోకలకు అంతరాయం

మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడ మండల పరిధిలోని ఎన్‌హెచ్ 167 తాండూర్ మహబూబ్‌నగర్ రోడ్డు తెగిపోయింది. మహ్మదాబాద్ ఇబ్రహీంబాద్ హైవే రోడ్డుపైన బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి.మట్టిరోడ్లు తెగిపోయాయి. దాంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. నారాయణ పేట జిల్లాలోని ఊట్కూర్ గ్రామ పెద్దచెరువు నిండి అలుగు పారుతుండటంతో మక్తల్- నారాయణ పేట ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి పై నుంచి నీరు పారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గద్వాల జిల్లాలోని ఆంధ్ర తెలంగాణ రైల్వే బ్రిడ్జి వంతెన నారాయణపురం దగ్గర మునిగిపోవడంతో సమీప గ్రామాల్లోని ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వనపర్తి జిల్లాలోని పెబ్బేరులోని శ్రీరంగాపురం రంగసముద్రం రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో వరి పొలాలు నీటిలో మునిగిపోయాయి. పెబ్బేరు మహబూపాల్ సముద్రం చెరువు నిండిపోయి పెద్ద పంపు వాగు దగ్గర భారీగా వరద నీరు చేరడంతో గ్రామాల్లో వరి పంటలకు నష్టం జరిగింది. పెబ్బేరు పురపాలక కేంద్రం ఒకటో వార్డు అంబేద్కర్ నగర్ కాలనీలో దేవమ్మ ఇల్లు కూలిపోవడంతో కూలిన ఇంటిని ఎమ్మెల్యే పరిశీలించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్ మండలం మున్నూరు నుంచి శ్రీశైలం వరకు ఘాట్‌రోడ్డులో కొండచరియలు కూలే ప్రమాదకర పరిస్థితులున్నాయి. బల్మూరు మండలంలోని చౌటపల్లి, బాణాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బ్రాహ్మణపల్లిలోని చంద్రసాగర్ ప్రాజెక్ట్ అలుగు పారుతుంది. అచ్చంపేట మండలంలోని ఉమామహేశ్వరంలో కనివిని ఎరగని రీతిలో కొండపై నుంచి జలపాతాలు ఉధృతంగా కిందికి దూకుతున్నాయి.

వాగులో చిక్కుకుపోయిన ఆర్టీసీ బస్సు 40 మంది ప్రయాణీకులు సురక్షితం

మహబూబాబాద్-వరంగల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 24 జెడ్ 0018) నెక్కొండ మండలం తోపనపల్లి వద్ద చెరువు కట్టపై నుండి వెళ్తుండగా, మత్తడి వరద రహదారిపైకి చేరడంతో అర్ధాంతరంగా బస్సును డ్రైవర్ వరదలో నిలిపివేశారు. వరద ఉధృతి పెరగడంతో ముందుకు వెళ్లలేక, వెనక్కు పోలేక బస్సును నిలిపివేయడంతో రాత్రంతా ప్రయాణీకులు బస్సులోనే ఉండిపోయారు. ప్రయాణీకులు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ఉదయం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సంఘటనాస్థలికి చేరుకున్నారు. అప్పటికే ఆర్టీసీ డ్రైవర్.. ప్రయాణీకులను ఓ లారీలో వెంకటాపూర్‌కు చేర్చారు. ఈ సందర్భంగా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఎమ్మెల్యే ప్రయాణీకులతో మాట్లాడారు. భోజనం, తాగునీటిని వెంటనే వారికి అందించి భారీ వర్షాలు, పరిస్థితులపై నెక్కొండ పోలీసు స్టేషన్‌లోనే సమీక్షించారు.

ఇంటికన్నె వద్ద కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్.. రైళ్ల రద్దు

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె-కేసముద్రం మధ్య భారీ వర్షాల నేపథ్యంలో వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకుపోయింది. ట్రాక్ కింద కంకర మొత్తం కొట్టుకుపోవడంతో ట్రాక్ గాలిలో వేలాడుతుంది. దాంతో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఈ మార్గంలో ప్రయాణించే 24 రైళ్లను రద్దు చేశారు. అప్పటికే సమీపంలోకి వచ్చిన రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు. సింహాద్రి, మచిలీపట్నం, గౌతమి, సంఘమిత్ర, గంగా కావేరి, చార్మినార్, యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్‌లను ఎక్కడికక్కడే నిలిపివేశారు. నెక్కొండలో చార్మినార్ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, కేసముద్రం రైల్వే స్టేషన్‌లో సంఘమిత్ర రైలు, పందిళ్లపల్లి వద్ద మహబూబ్‌నగర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయాయి. దాంతో రైళ్లలోని ప్రయాణీకులు ఆహారం, తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. శాతవాహన, గోల్కొండ, గుంటూరు-సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ రైళ్లను రద్దు చేశారు. కోణార్క్, గరీబ్‌రథ్, చార్మినార్, విశాఖ-ఎల్‌టీటీ తదితర రైళ్లను దారిమళ్లించారు. కాగా, ట్రాక్‌ను పునరుద్ధరించే చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టారు.

శిథిలావస్థకు చేరిన ఇండ్లను పరిశీలించిన అధికారులు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో తక్కెళ్ళపాడు తడకమళ్ళ వెళ్లే రహదారి కలోడ్ పైనుంచి నీరు ప్రవహిస్తుండటంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే రహదారిపై యాద్గర్‌పల్లి నుంచి ఉట్లపల్లి తక్కెలపాడు రోడ్డుపై భారీ వృక్షాలు పడటంతో ప్రయాణం కష్టతరమైంది. మిర్యాలగూడ మండలంలోని తుంగపాడు శివారు రామన్నపేట లావుడి తండాలో లెవెల్ బిడ్జి పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. దేవరకొండ మండలంలోని ముదిగొండ, కట్టగొమ్ముతండా, కమలాపూర్, సూర్యతండా, తాటికోల్, మంగలోనిబావి తదితర గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన ఇండ్లను అధికారులు పరిశీలించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలో వారిపల్లి బూరుగుపల్లి వాగులు పారు తున్నాయి. పలుచోట్ల భారీ వృక్షాలు కూలి పోవడం, పలు పంటలు నేలకొరిగాయి. భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ మండలాలకు చెందిన రుద్రవెల్లి జూలూరు గ్రామంలోని మూసీ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండలంలో ఆదర్శ పాఠశాల పూర్తిగా నీటితో నిండిపోయింది. ఏటి వెంట ఉన్న పంట పొలాలు చాలావరకు నీట మునిగాయి. అర్వపల్లి మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాల ఆవరణ చుట్టూ పూర్తిగా వర్షపు నీరు చేరింది. నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో ముత్యాలమ్మ కుంట కట్ట చెరువు తెగిపోవడంతో పక్కనే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరి గోడ కూలింది, స్కూల్లోకి నీళ్ల చేరి కంప్యూటర్లు ఇతర సామగ్రి మునిగిపోయాయి. చిలుకూరు మండలంలోని నారాయణపురం ఊరచెరువుకు నాలుగు చోట్ల గండిపడింది. మఠంపల్లి మండలంలో మూడు చెరువులు తెగాయి. వేములూరు ప్రాజెక్టు పొంగుతుండటంతో వేయి ఎకరాలు నీటమునిగాయని అంచనా. చెన్నాయపాలెం వద్ద రోడ్డు తెగి మఠంపల్లి, పాలకీడు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కోదాడలో హుజూర్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఎర్రకుంట చెరువుకి వెళ్లే కాలువ ఉధృతంగా ప్రవహించడంతో ఆ ప్రవాహదాటికి రెండు కార్లు, రెండు ఆటోలు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. కారులో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ వ్యక్తిని పట్టణానికి చెందిన రవి(45)గా గుర్తించారు. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో కొట్టుకుపోయిన వారి ఆచూకీ తెలియరాలేదు. సూర్యాపేట నల్లబండగూడెం వద్ద నీటి ప్రవాహం కొనసాగుతుంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై 5 గంటలపాటు వాహనాలు నిలిచిపోవడంతో నార్కెట్‌పల్లి-అద్దంకి రహదారిపైకి పోలీసులు దారి మళ్లించారు.

లోతట్టు ప్రాంతాలు అతలాకుతలం

కరీంనగర్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు అతలాకుతలమవుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, అనేక చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. రామడుగు మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో రైల్వే ట్రాక్‌పై వరద ప్రవాహం ఏర్పడింది. రామడుగు బ్రిడ్జి ప్రమాదకర స్థితిలో ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇల్లందకుంట మండలం పాతర్లపల్లి గ్రామంలో ఉధతంగా ప్రవహిస్తున్న వాగును దాటి వెళ్లడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముచ్చర్ల గ్రామంలోని లోతట్టు ప్రాంతాల్లో వరి పంటలు నీట మునిగాయి. మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అదనపు కలెక్టర్, అధికారులు లోయర్ మానేరు డ్యామ్ పరిస్థితిని సమీక్షించారు. సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలంలో లింగన్నపేట నుంచి గంభీరావుపేట వరకు వాగుపై నిర్మించిన తాత్కాలిక రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. బరీగిలగూడెం కాలనీలోని పాఠశాల వద్ద చెట్లు విద్యుత్ తీగెలపై పడి మంటలు చెలరేగాయి. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు జేసీబీ సహాయంతో చెట్లను తొలగిస్తున్నారు. సిరిసిల్ల జిల్లా వేములవాడలో నీటి మునిగిన ప్రాంతాల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పర్యటించారు. ఎగువ మానేరు డ్యామ్ నిండుకుంది. సాయంత్రం 6గంటలకు ప్రాజెక్టు స్థాయి 1482.50అడుగులకు చేరుకుని 2టీఎంసీలతో పూరి నీటిని నిల్వ సామర్థ్యాన్ని చేరుకుంది. ప్రాజెక్టులోకి 34,000 క్యూసెక్స్‌ల ఇన్‌ఫ్లో వస్తోంది.

జగిత్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు పై ఉన్న ఇండ్లలోకి వరద నీరు చేరింది. ధర్మసముద్రం చెరువు కట్ట దిగువ భాగంలో ఉన్న అమీనాబాద్ కాలనీలో గల ఇండ్ల చుట్టూ వరద నీరు చేరడంతో జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీ లించారు. ధరూర్‌క్యాంప్, హౌసింగ్ బోర్డు, తీన్ ఖని, లడ్డు ఖాజా చౌరస్తా, గోవింద్‌పల్లె, మోతేరోడ్, గంజ్ రోడ్‌లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామం నుంచి కాచారం వెళ్లే దారిలో ఉన్న ఊర చెరువు నిండి అలుగు పారడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మేడిపల్లి మండల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని వడకాపూర్ నుంచి దూళికట్టకు వెళ్లే ప్రధాన రహదారిపై హుస్సేన్‌మియా వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నాగులపల్లెలో బీట్ రోడ్డు కొట్టుకుపోయింది. ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ మండలాల మధ్య గూడెం ఉన్న నక్కల వాగు స్థాయికి మించి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ప్రాజెక్టులకు భారీగా వరద నీరు, గేట్లు ఎత్తి దిగువకు విడుదల



నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 5 లక్షల క్యూసెక్కుల వరద ఉధృతి పెరిగి కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఎగువ కృష్టానది పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో 10 గేట్లను ఎత్తి జలవిద్యుత్‌కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 4,83,766 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు విడుదల చేస్తున్నారు. దాంతో నాగార్జునసాగర్ డ్యామ్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 8 గేట్లను 10 అడుగులు, 18 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 4,97,524 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 587.90 అడుగులవద్ద నీరు నిల్వ ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 305.9818 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 12,261 క్యూసెక్కుల నీటిని కుడి కాలువ ద్వారా, 5292 క్యూసెక్కుల నీటిని ఎడమ కాల్వద్వారా నీటి విడుదల చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లాలోని ఎస్సారెస్పీకి 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1081.6 అడుగుల 63.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. వరద కాలువకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

నవచిత్రం

తెలుగులోనూ ఘనవిజయ


అరుల్ నిధి

హర్రర్ థిల్లర్ 'డీమాంటీ కాలనీ 2' చిత్రానికి ఘన విజయాన్ని అందిం చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు హీరో అరుల్ నిధి. గత నెల 23న ఈ సినిమా తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజై, విశేష ప్రేక్షకాదరణ పొందింది.

ఈ సినిమాను ఎన్ శ్రీనివాస రెడ్డి సమర్పణలో శ్రీ బాలాజీ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ బి సురేష్ రెడ్డి, బి.మానస రెడ్డి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సక్సెస్ సాధించిన నేపథ్యంలో హీరో అరుల్ నిధి మీడియాతో తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

మా సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషంగా ఉంది. తెలుగులో మా సినిమా స్కేల్‌తో చూస్తే చాలా పెద్ద సక్సెస్ ప్రేక్షకులు ఇచ్చారు. ఇక తమిళంలో మా సినిమా వండర్స్ క్రియేట్ చేస్తోంది. మాతో పాటు విక్రమ్ 'తంగలాన్' సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంది. ప్రొడ్యూసర్ సురేష్ రెడ్డి మంచి ప్రమోషన్ చేసి, ప్రేక్షకుల దగ్గరికి బాగా తీసుకెళ్ళారు. మా సినిమాను బిలీవ్ చేసిన ఆయనకు ఈ థ్యాంక్స్. ఆయన వల్లే తెలుగులో మా సినిమా ఇంత పెద్ద సక్సెస్ అందుకుంది. తెలుగులో సక్సెస్ సెలబ్రేషన్స్ చేసేందుకు సురేష్ రెడ్డి మమ్మల్ని ఇన్వైట్ చేస్తున్నారు. 'డీమాంటీ కాలనీ 2' పర్ఫెక్ట్ సీక్వెల్ అనే పేరు వస్తోంది. ఈ సక్సెస్ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. టెక్నికల్‌గా సామ్ సీఎస్ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచింది. రీ రికార్డింగ్ తర్వాత సినిమాలోని కంటెంట్ చాలా ఎఫెక్టీవ్‌గా మారింది.

ఈ సినిమాలో నేను ద్విపాత్రాభినయం చేశాను. శ్రీని క్యారెక్టర్ డీమాంటీ కాలనీ 1లో ఉన్నదే కంటిన్యూ అయ్యింది. రఘు అనే క్యారెక్టర్ కొత్తగా యాడ్ చేశాం. రఘు క్యారెక్టర్ చాలా స్టైలిష్‌గా ఉంటుంది. తనొక బిగ్ ఆర్కిటెక్చర్. కాబట్టి స్టైల్‌గా ఉంటాడు. రిచ్ కిడ్ కాబట్టి కేర్ లెస్‌గా బిహేవ్ చేస్తుంటాడు. నేను బాగా నటించాననే పేరొచ్చింది. మా డైరెక్టర్ అజయ్ మంచి స్క్రిప్ట్ చేశాడు.

డీమాంటీ కాలనీ 2తో పాటు 3, 4 సినిమాలు రాబోతున్నాయి. ఈ ఫ్రాంచైజీలో డీమాంటీ కాలనీ 3 బిగ్ స్పాన్ మూవీ అవుతుంది. అంతేకాదు సరికొత్త పాత్రలు, ట్విస్టులు, టర్న్‌టూ ఉంటాయి.

బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్..


మహేష్‌బాబు

రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మారుతి నగర్ సుబ్ర మణ్యం'. ప్రేక్షకుల విశేష ఆదరణతో ప్రస్తుతం థియేటర్లలో విజయ వంతంగా ప్రదర్శింపబడుతోంది. ఇటువంటి విజవంతమైన, చక్కటి కుటుంబ వినోదాత్మక సినిమా తీసినందుకు 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందాన్ని హీరో మహేష్ బాబు అభినందించారు. చిత్ర బృందం మీద ప్రశంసలు కురిపించారు.

మంచి సినిమాలకు మద్దతు ఇవ్వడంలో మహేష్ బాబు ఎప్పుడూ ఓ అడుగు ముందుంటారు. సినిమాలో ఆయనకు నచ్చిన విషయాలు చెప్పడంతో పాటు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తారు. తాజాగా 'మారుతి నగర్ సుబ్రమణ్యం' సినిమాకు మహేష్ బాబు రివ్యూ ఇచ్చారు.

ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి వినోదాత్మక చిత్రాల్లో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' ఒకటి అని మహేష్ బాబు తెలిపారు. 'హిలేరియస్ రైడ్' అంటూ సినిమాకు షార్ట్ అండ్ స్వీట్ రివ్యూ ఇచ్చారు. తన ట్వీట్‌లో సమర్పకురాలు తబితా సుకుమార్, చిత్ర బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. మహేష్ ట్వీట్ చూస్తే... ఆయన సినిమాను చాలా ఎంజాయ్ చేసినట్టు అర్థం అవుతోంది. ఆయన ప్రశంసలతో 'మారుతి నగర్ సుబ్రమణ్యం' చిత్ర బృందం అమితా నందంలో ఉంది. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించిన ఈ సినిమా తబితా సుకుమార్ సమర్పణలో విడుదలైంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరం సైతం ఈ సినిమాను ఎంజాయ్ చేస్తోంది. థియేటర్లలో నవ్వుల పండగ స్పష్టంగా కనబడుతోంది.

ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ ఎత్తున విడుదల చేసింది.

ప్రేక్షకుల స్పందన అత్యద్భుతం



ఎమ్ఎస్‌వి సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఆసక్తికరమైన చిత్రం 'కాలం రాసిన కథలు.' నూతన నటీనటులు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవలే విడుదలై అందరినీ అలరించింది. ఈ సినిమాకి హిట్ టాక్ రావడంతో ఈ చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత ఎం.ఎస్.వి సాగర్ మాట్లాడుతూ, 'ఈ సినిమా కోసం గత రెండు సంవత్సరాలుగా నేను పని చేస్తున్నాను. సినిమా విడుదల అయ్యాక ప్రేక్షకుల స్పందన బాగుంది. చిన్న సినిమాల్లో మా సినిమా మంచిగా రాణిస్తుంది. మంచి రిలీజ్‌ని మాకు అందించినందుకు డిస్ట్రిబ్యూటర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా విజయం నేను తదుపరి చేయబోయే సినిమాల మీద విశ్వాసాన్ని పెంచింది. ఈ సినిమాలో పెద్ద స్టార్స్ లేకున్నా, కొత్త వాళ్ళని కూడా ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఈ చిత్రంలో అన్ని పాత్రలు ప్రేక్షకులకి దగ్గరయ్యాయి. ముఖ్యంగా కిరాక్ కిరణ్ పాత్ర క్లైమాక్‌లో బాగా పండింది. ఈ సినిమాలో చేసిన ముగ్గురు హీరోయిన్స్‌కి స్పెషల్ థ్యాంక్స్. హన్విక తనకి ఇచ్చిన పాత్రలో అందరినీ మెప్పించింది. ఉమా కూడా అద్భుతమైన నటన కనబరిచి, బేబీ సినిమాలో వైష్ణవి చైతన్యలాగా, ఆర్‌ఎక్స్100లో పాయల్ రాజ్‌పుత్‌లా మెప్పించింది. రాబోయే వారాల్లో కూడా ఈ సినిమా ఇంకా బాగా ఆడాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నేను ఈ చిత్రంలో నవ్య అనే పాత్ర పోషించాను. ఈ పాత్రని దర్శకుడు చాలా బాగా రాసారు. సాగర్ ఈ పాత్రకి నన్ను ఎంచుకున్నందుకు ధన్యవాదాలు. కంటెంట్ బాగుంటే చిన్న సినిమా అని చూడకుండా ప్రేక్షకులు ఆదరిస్తారని మా సినిమా మరోమారు నిరూపించింది' అని హన్విక శ్రీనివాస్ చెప్పారు. ఇందులో నేను చేసిన పాత్రకు చాలా మంచి గుర్తింపు లభించింది. ఈ సినిమా విజయం కెరీర్ విషయంల మా అందరికీ ఎంతో నమ్మకాన్ని ఇచ్చింది. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని మరో నాయిక ఉమా చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

శివాజీ విగ్రహం కూలిపోవడంపై ప్రధాని క్షమాపణలు అహంకారపూరితం

- పవార్, ఉద్ధవ్ విమర్శ



ముంబయి: సింధు దుర్గ్‌లో శివాజీ మహరాజ్ విగ్రహం కూలిపోవడంపై ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణలు అహంకారపూరితంగా ఉన్నాయని ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ఉద్ధవ్ థాకరే విమర్శించారు. ఆదివారం దక్షిణ ముంబయిలోని ఐకానిక్ హుటాత్మా చౌక్ నుంచి గేట్‌వే ఆఫ్ ఇండియా వరకు మహా వికాస్ అఘాడీ పాద యాత్ర నిర్వహించారు. విగ్రహ పతనానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమన్నారు. ఈ ఉదంతం అవినీతికి ఒక తిరుగులేని ఉదాహరణ అని వారు చెప్పారు. ఇక్కడికి 480 కి. మీ దూరంలోని మాల్వాన్ తహసిల్‌లోని రాజ్‌కోట్ కోటలో 17వ శతాబ్దపు మరట్వాడా రాజు శివాజీ విగ్రహాన్ని గత ఏడాది డిసెంబరు4న ప్రధాని మోడీ హడావుడిగా ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద నిరసన కవాతునుద్దేశించి థాకరే మాట్లాడుతూ, 'ప్రధాని చెప్పిన ఆ క్షమాపణలో అహంకారాన్ని మీరు గమనించారా? ఆయన క్షమాపణ చెబుతుంటే పక్కన ఉన్న ఉప ముఖ్యమంత్రి నవ్వుతూ ఉన్నారు.' అని చెప్పారు. శివాజీ మహరాజ్‌కు జరిగిన అవమానం క్షమించరానిది, మహారాష్ట్ర ప్రజలు దీనిని ఎన్నటికీ క్షమించరని అన్నారు. బీజేపీ భారత్ నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేయడానికి మనమందరం ఇక్కడ సమావేశమయ్యామన్నారు. విగ్రహాలు కూలిపోవడాలు, రామ మందిరంలో ు, కొత్త పార్లమెంటు భవనంలో లీకేజీలు ఇవే మోడీ ఇచ్చే గ్యారంటీలు అంటూ ఉద్ధవ్ ఎద్దేవా చేశారు. ప్రధాని దేనికి క్షమాపణలు చెప్పారు? ఎనిమిది నెలల క్రితం విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించినందుకా? అందులో అవినీతికి పాల్పడినందుకా? అని ప్రశ్నించారు. శివాజీ మహరాజ్‌ను అవమానించిన శక్తులను ఓడించేందుకు మహా వికాస్ అఘాడీ కేడర్ కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు.

ఎన్‌సీపీ నేత పవార్ మాట్లాడుతూ, శివాజీ విగ్రహం కూలిపోయిన ఘటన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవినీతికి ఉదాహరణ అని చెప్పారు. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే మాట్లాడుతూ, శివద్రోహి (ఛత్రపతి శివాజీ విగ్రహానికి ద్రోహం చేసేవారు) ప్రభుత్వాన్ని క్షమించరాదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని క్షమాపణలు చెప్పారని పటోలే అన్నారు.

జోడే మారో ఆందోళన్ (చెప్పులతో కొట్టడం) పేరుతో సాగిన ఈ నిరసన ర్యాలీలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్‌ల పోస్టర్లపై శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పులతో కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, శివసేన (యూబీటీ) నాయకుడు థాకరే, కాంగ్రెస్ రాజకీయ విభాగం చీఫ్ నానా పటోలే, ఆ పార్టీ ముంబయి నేత వర్ష గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- నాగ్‌పూర్‌లో సురక్షితంగా ల్యాండింగ్



న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యవసరంగా సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. విమానం టాయిలెట్‌లో ఈ బెదిరింపు లేఖ కన్పించింది. ఆదివారం ఉదయం 7.55 గంటలకు ఇండిగో విమానం జబల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరింది. దాదాపు 9 గంటల ప్రాంతంలో ఓ ప్రయాణికుడు టాయిలెట్‌లోకి వెళ్లగా కమోడ్ సీటుపై ఒక పేపర్ కన్పించింది. దానిపై 'బ్లాస్ట్' అని రాసి ఉండటంతో వెంటనే సిబ్బందికి తెలిపారు. అప్రమత్తమైన పైలట్, విమాన సిబ్బంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారమిచ్చారు. అనంతరం విమానాన్ని నాగ్‌పూర్‌కు మళ్లించారు. ఉదయం 9.20 గంటలకు విమానం నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగినట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ సిబ్బంది, అంబులెన్స్‌లను విమానాశ్రయంలో సిద్ధంగా ఉంచారు. ప్రయాణికులను దించి వారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. విమానంలో 69 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను నాగ్‌పూర్ నుంచి బస్సులో హైదరాబాద్‌కు తరలించారు.

భారత్‌తో ఒప్పందాలను సమీక్షిస్తాం

- విదేశీ వ్యవహారాల సలహాదారు

హసీనా ప్రభుత్వ హయాంలో భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందాలను సమీక్షించే అవకాశముందని తాత్కాలిక ప్రభుత్వ విదేశీ సలహాదారు తౌహిద్ హుస్సేన్ తెలిపారు. దేశ ప్రయోజనాలకు మేలు చేకూర్చేవిగా లేవని భావించిన వాటిని సమీక్షించవచ్చని ఆయన ఆదివారం నాడిక్కడ మీడియాకు తెలిపారు. ఒఐసి సమావేశంలో పాల్గొని కామెరూన్ నుండి తిరిగివచ్చిన అనంతరం హుస్సేన్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఈ విషయం తెలిపారు. షేక్ హసీనాను తిరిగి బంగ్లాదేశ్‌కు రప్పిస్తారా అని అడగ్గా, అవసరమైతే ఆమెను అప్పగించాలని ప్రభుత్వం భారత్‌ను కోరుతుందని అన్నారు. ఆమెను అప్పగిస్తారా లేదా అనేది భారత్‌పై ఆధారపడి ఉంటుందన్నారు. భారత్‌లో ఏ హోదాలో ఆమె ఆశ్రయం పొందుతున్నారని అడగ్గా, దాని గురించి తనకు తెలియదని చెప్పారు. ఈ ప్రశ్న మీరు భారత్‌నే అడగండని అన్నారు.

పద్నాలుగేళ్ల బాలికపై లైంగిక వేధింపులు

- బీజేపీ నేతపై కేసు



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు భగవత్ సింగ్ బోరా పద్నాలుగేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న కేసులో పోలీసులు అరెస్టు చేశారు. జిలా సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ దేవేంద్ర పించా ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ,పరారీలో ఉన్న అతడ్ని అరెస్టు చేసి, స్థానిక కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారులు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు20న ఘటన జరిగింది. అయితే ఆరు రోజుల తరువాత ఫిర్యాదు అందింది. బాలికకు ఇప్పటికే వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇది దురదృష్టకరమైనదని, బోరాను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర భట్ తెలిపారు. ఉత్తరాఖండ్‌లో బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ విమర్శించింది. బేటీ బచావో నినాదాన్ని బీజేపీ వారే అపహాస్యం చేస్తున్నారనడానికి ఇదొక నిదర్శనమని ప్రతిపక్షాలు విమర్శించాయి.

సాంస్కృతిక పునర్జీవనం వైపు

తెలంగాణ అడుగులు

కళలు, కళాకారులకు సర్కార్ పెద్దపీట

- పర్యావరణ, చారిత్రక పర్యాటకాల మేళవింపు
- భవిష్యత్ తరాలకు దిక్సూచి : ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సాంస్కృతిక పునర్జీవనం వైపు తెలంగాణ అడుగులు వేస్తున్నది. ప్లాస్టిక్ అందాలకు ప్రాణప్రతిష్ట చేసిన పదేండ్ల పాలకుల రీతికి భిన్నంగా కాంగ్రెస్ సర్కార్ ఇక్కడి మట్టి వాసనలను గుబాలింపజేస్తున్నది. పల్లెపల్లెనా జానపదం పల్లవించే తెలంగాణ నేలను పునీతం చేసేందుకు కవులు, కళాకారులు కసరత్తు చేస్తున్న తరుణమిది. తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచే పాటలు ప్రజల జీవనంలో భాగమయ్యాయి. మలి దశ తెలంగాణ పోరులోనూ పాటలు పోరు బాటకు దారిదీపాలయ్యాయి. సుద్దాల హన్మంతు, గద్దర్ వంటి వారు వేసిన ఒరవడిలో వేలాది మంది కవులు, కళాకారులు జానపదాల రచన, ఆలాపనలో ముందుకు సాగుతున్నారు. యూట్యూబ్‌లో మిలియన్ల కొద్దీ వీక్షకులు తెలంగాణ పల్లె పాటలను ఆస్వాదిస్తున్నారు. జానపద కళాకారులకు సరైన వేదిక కల్పించి వారికి ఉపాధి అవకాశాలు చూపడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

పర్యాటకానికి పెద్దపీట

భద్రాచలం గోదావరి చెంతన గిరిజన కొమ్ము నృత్యం,, పల్లెపల్లెనా సాగే బతుకమ్మ సంబురాలు, ఆదిలాబాద్ అడవుల్లో జలపాతాలు, హైదరాబాద్‌లో గోల్కొండ కోట, చార్మినార్, నాగార్జున సాగర్ బుద్ధవనం ఇలా ఎన్నో వైవిధ్యాలకు నెలవైన తెలంగాణను ప్రపంచ పర్యాటక పటంలో ప్రత్యేకత చాటేలా నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. పర్యావరణ చారిత్రక, అధ్యాత్మిక టూరిస్ట్ ప్రాంతాల గుర్తింపు, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హిందూ, ముస్లిం, క్రైస్తవంతో పాటు బౌద్ధ, జైన ఆలయాలను చూసేందుకు పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. పర్యాటకులు ఆయా ప్రాంతాలకు సందర్శించడానికే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న విశిష్టతలు, అక్కడి ఆహారం, ఆహార్యాన్ని ఆస్వాదించి అనుభూతి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఫలితంగా వారికి ఉపాధి లభించడంతో పాటు పర్యాటకులు మరిచిపోలేని అనుభూతి కలుగుతుందని సర్కార్ భావిస్తోంది.

బతుకమ్మకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పూలను పూజించే పండుగ బతుకమ్మ తెలంగాణకే విశిష్టమైన ఈ సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ఎలుగెత్తి చాటే ప్రణాళికను పర్యాటక శాఖ రూపొందిస్తోంది. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు వివిధ దేశాల పర్యాటకులను బతుకమ్మ పండుగలో భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తోంది. దీంతో ప్రతి ఏటా ఆ సీజన్‌లో పర్యాటకులు రావడంతో పాటు మనదైన కళకు గుర్తింపు లభించనుందని భావిస్తోంది. మేడారంలో రెండేండ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈ జాతరకు గ్లోబల్ గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.పేరిణి, కొమ్ము గుస్సాడి వంటి నృత్యాలకు పునర్జీవం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ బోనాలకు మరింత గుర్తింపు తెచ్చేందుకు నిధులతో పాటు అన్ని రకాల సహాయ, సహకారాలను ప్రభుత్వం అందిస్తోంది.

బెంగాల్‌లో మళ్లీ వేధింపుల కలకలం

- భీర్భుమ్‌లో నర్సుకు వేధింపులు



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ వైద్యురాలు హత్యాచారానికి గురైన ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న సమయంలోనే ఈ రాష్ట్రంలోనే ఒక నర్సు నైట్‌షిఫ్టులో వేధింపులను ఎదుర్కోవడం కలకలం రేపుతోంది. భీర్భుమ్ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రిలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. చోటోచక్ గ్రామానికి చెందిన అబ్బాస్ ఉద్దీన్‌కు జ్వరం రావడంతో అతడి కుటుంబసభ్యులు శనివారం రాత్రి 8.30 గంటలకు ఆసుపత్రికి తీసుకొచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు సెలైన్ ఎక్కించడం కోసం వార్డుకు తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న ఓ మహిళా నర్సు అతడికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తుండగా ఆ రోగి అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. తనను అభ్యంతరకంగా తాకడంతో పాటు అసభ్య పదజాలంతో మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. రోగి చేష్టలతో తాను భయభ్రాంతులకు గురయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు హెచ్చరించినా అతడు వినిపించుకోలేదు. దీంతో వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిటీ స్కాన్‌కు వెళ్తే బాలికపై..

రాష్ట్రంలోని హావ్‌డాలో మరో ఘటన వెలుగుచూసింది. ఓ 14 ఏళ్ల బాలికపై ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ వేధింపులకు పాల్పడ్డాడు. నిమోనియాతో బాధపడుతున్న ఆమె హావ్‌డా సర్దార్ ఆసుపత్రిలో సీటీ స్కాన్ కోసం వెళ్లగా.. ల్యాబ్‌లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఆమెతో అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. భయంతో బాలిక కేకలు వేయడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆమెను రక్షించారు. ఈ ఘటనతో బాధితురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. నిందితుడిపై దాడికి యత్నించారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

'రష్యాతో సానుకూలంగా మెలగడం మంచిది' : ట్రంప్



మాస్కో: రష్యా, ఉత్తర కొరియాలతో సన్నిహితంగా ఉండటం, వారితో "కలిసి ఉండటం" "మంచి విషయం" అని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రెండు కొరియా దేశాలను వేరుచేసే సైనికరహిత జోన్‌లో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్-ఉన్‌తో 2019లో జరిగిన సమావేశాన్ని ప్రస్తావిస్తూ రిపబ్లికన్ అభ్యర్థి ప్యోంగ్యాంగ్‌తో వాషింగ్టన్ సంబంధాలను పరిష్కరించడానికి తన దౌత్య ప్రయత్నాలను గురించి శుక్రవారం పెన్సిల్వేనియాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ ట్రంప్ అన్నారు. "నేను ఉత్తర కొరియాకు చెందిన కిమ్ జోంగ్- ఉన్‌తో కలిసిపోయాను. నేను ఈ దేశం నుంచి వెళ్లిన మొదటి వ్యక్తిని గుర్తుపెట్టుకోండి. మేము అతని అణు సామర్థ్యాన్ని కూడా చూశాము. ఇది చాలా ముఖ్యమైనది. మీకు తెలుసా, కలిసి ఉండటం మంచి విషయం. ఇది చెడ్డ విషయం కాదు" అని ఆయన పేర్కొన్నారు.మాస్కోతో కలిసి ఉండటం కూడా చెడ్డ విషయం కాదని ట్రంప్ అన్నారు. అతను ప్రస్తుత పరిపాలనను తీవ్రంగా విమర్శించారు. అధ్యక్షుడు జో బైడెన్‌కు చాలా తక్కువ ఐక్యూ ఉందని, "ఇప్పుడు అది ఉనికిలో లేదు". ఎందుకంటే అతను "పూర్తిగా మనస్సు కోల్పోయారు" అని ట్రంప్ చెప్పారు. రష్యాతో మెలగడం మంచిది, చెడ్డది కాదు. గుర్తుంచుకోండి. ఈ వ్యక్తులతో కలిసి ఉండటం తెలివైనది.

"రష్యాతో సంబంధాలలో ఇప్పుడు ఏమి జరుగుతుందో అది తాను పదవిలో ఉంటే జరిగేది కాదు" అని రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ పేర్కొన్నారు. తన ఎన్నికల ప్రత్యర్థి, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ ఆరోపణలకు సమాధానంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. గత వారం చికాగోలో డెమొక్రాటిక్ నామినేషన్ అంగీకార ప్రసంగంలో, ఉత్తర కొరియా అధినేతతో మాజీ అధ్యక్షుడి సంబంధాల గురించి ఆమె విమర్శించింది. "ట్రంప్ కోసం పాతుకుపోయిన కిమ్ జోంగ్-ఉన్ వంటి నిరంకుశులు,నియంతలతో తాను హాయిగా ఉండనని" పేర్కొంది.

ప్రపంచ పనోరమ

గాజాలో ఆరుగురు బందీల మరణాలను

ఇజ్రాయెల్ ధ్రువీకరించింది



గాజా: అక్టోబర్ 7న హమాస్ ఉగ్రవాదులు స్వాధీనం చేసుకున్న ఆరుగురు బందీల మతదేహాలను దక్షిణ గాజాలోని రాఫా ప్రాంతంలోని ఒక సొరంగంలో కనుగొన్నట్టు ఇజ్రాయెల్ మిలటరీ ఆదివారం తెలిపింది. బాధితులందరి పేర్లను వెల్లడించారు. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకారం, హెర్ష్ గోల్డ్ బెర్గ్-పోలిన్, వయసు 23, ఈడెన్ యెరుషల్మి, 24, ఓరి డానినో, 25, అలెక్స్ లుబ్నోవ్, 32, కార్మెల్ గాట్, 40, అల్మోగ్ సారుసి, 25 సైన్యం వారిని కనుగొనటానికి కొంచం ముందు హమాస్ చేత చంపబడ్డారు.అలెక్స్ లుబ్నోవ్ (రష్యన్ మీడియాలో అలెగ్జాండర్ లోబనోవ్) ద్వంద్వ రష్యన్-ఇజ్రాయెల్ పౌరుడు. బందీల బంధువుల ఫోరమ్ ప్రకారం, బందీల బంధువులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ, అతను అష్కెలోన్లో నివసించాడు, వివాహం చేసుకున్నాడు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను బార్ మేనేజర్‌గా పనిచేస్తున్న నోవా మ్యూజిక్ ఫెస్టివల్ నుంచి కిడ్నాప్ చేశారు.

ఈ మృత దేహాల రికవరీ వార్తలు హెూస్టేజ్ ఫ్యామిలీస్ ఫోరం నుంచి "భారీ ప్రదర్శన" కోసం పిలుపునిచ్చాయి. హమాస్‌తో చర్చించి బందీలను విడుదల చేయటంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం విఫలమైందని ఈ ఫోరం విమర్శించింది. ఇది చాలా నెలలు చర్చలలో ఉంది. ఇది "దేశాన్ని పూర్తిగా నిలిపివేసి, బందీలను విడుదల చేసే ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలని" డిమాండ్ చేసింది.పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ పది నెలల క్రితం దక్షిణ ఇజ్రాయెల్‌లోకి ఆశ్చర్యకరమైన చొరబాటును నిర్వహించినప్పుడు గాజాలో ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య శత్రుత్వాలు పెరిగిపోయాయి. దాదాపు 1,100 మంది మరణించారు. 200 మందికి పైగా హమాస్‌కు బందీలు అయ్యారు. కొందరు ఖైదీల మార్పిడి ద్వారా విడుదల చేయబడ్డారు లేదా ఇజ్రాయెల్ సైన్యంచే రక్షించబడ్డారు. ఇజ్రాయెల్ భారీ సైనిక ప్రతిస్పందనలో దాదాపు 40,700 మంది ప్రాణాలు కోల్పోగా, 94,060 మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు.ఒక సంధిని చేయడానికి, ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయడానికి ఖతార్, అమెరికా, ఈజిప్ట్ నుంచి మధ్యవర్తిత్వంతో చర్చలు నెలల తరబడి జరిగాయి. గత నెలలో, బందీల విడుదల, కాల్పుల విరమణ ఒప్పందం కోసం పునరుద్ధరించిన అమెరికా ప్రతిపాదనను హమాస్ తిరస్కరించింది. దీనికి కారణం నెతన్యాహు చర్చలను దెబ్బతీయటమేనని హమాస్ ప్రకటించింది.

నేతన్యాహుకు మద్దతు ఇచ్చినందుకు హమాస్ అమెరికాను నిందించింది. గాజాలో యుద్ధాన్ని ముగించాలన్న హమాస్ డిమాండ్‌ను ఒప్పందానికి ఒక షరతుగా అంగీకరించలేమని ఇజ్రాయెల్ పేర్కొంది. గత వారం, గాజా కాల్పుల విరమణపై మరో రౌండ్ చర్చల కోసం అమెరికా, ఇజ్రాయెల్ ప్రతినిధులకు ఈజిప్ట్ ఆతిథ్యం ఇస్తోందని రాయిటర్స్ రాసింది. ఇజ్రాయెల్ ప్రకారం, 7 అక్టోబర్ దాడిలో 251 మంది ఇజ్రాయిలీలు, విదేశీ పౌరులు పట్టుబడ్డారు, 103 మంది ఇప్పటికీ గాజాలో ఉన్నారు.

శంకర్ ఐఎఎస్ అకాడమీకి రూ. 5 లక్షల జరిమానా

- తప్పుడు ప్రకటనలపై కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ ఆగ్రహం

న్యూఢిల్లీ : సివిల్స్ పరీక్షల శిక్షణా సంస్థ శంకర్ ఐఏఎస్ అకాడమీకి భారీ జరిమానా విధించారు. 2022 సివిల్ సర్వీస్ పరీక్షకు సంబంధించి తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేసినందుకు గానూ కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ (సిసిపిఎ) చర్యలు చేపట్టింది. ఈ అకాడమీకి రూ.5లక్షల జరిమానా విధించింది. ఈ విషయాన్ని సిసిపిఎ ఓ ప్రకటనలో వెల్లడించింది.

సంస్థ సక్సెస్ రేటు, సివిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సుల గురించి ఈ కోచింగ్ ఇనిస్టిట్యూట్ తప్పుడు ప్రకటనలు చేసిందని సిసిపిఎ గుర్తించింది. 2022 యుపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరీక్ష కోసం శంకర్ ఐఏఎస్ అకాడమీ ఓ యాడ్ ఇచ్చింది. అందులో ఆల్‌ఇండియా లెవల్‌లో ఎంపికైన 933 మందిలో 336 మంది తమ అకాడమీలో శిక్షణ తీసుకున్నట్లు పేర్కొంది. ఇక, టాప్ 100లో తమ ఇనిస్టిట్యూట్ నుంచి 40 మంది అభ్యర్థులు ఉన్నట్లు ప్రచురించింది. దేశంలోనే ఉత్తమ ఐఏఎస్ అకాడమీ తమదేనంటూ ప్రకటనలో రాసుకుంది. అయితే దీనిపై ఫిర్యాదులు రావడంతో సిసిపిఎ దర్యాప్తు జరిపింది. శంకర్ ఐఏఎస్ అకాడమీ ఉద్దేశపూర్వకంగా ఆ ప్రకటన ఇచ్చినట్లు తెలిసింది. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తీసుకున్న కోర్సులను ఇనిస్టిట్యూట్ దాచిపెట్టినట్లు తేలింది. ఈ అకాడమీ నుంచి ఉత్తీర్ణత సాధించినట్లుగా చెబుతున్న 336 మందిలో 221 మంది.. కేవలం ఉచిత ఇంటర్వ్యూ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను మాత్రమే తీసుకున్నారని దర్యాప్తులో వెల్లడైంది. మిగతావారు కూడా షార్ట్‌టర్మ్ కోచింగ్‌కు తీసుకున్నవారేనని తెలిసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సిసిపిఎ తీవ్రంగా పరిగణించింది. మన దేశంలో ఏటా 10లక్షల మందికి పైగా సివిల్స్ పరీక్షలకు హాజరవుతున్నారని, ఇలాంటి తప్పుదోవ పట్టించే ప్రకటనలు వారిపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంది. అందువల్ల ఈ అకాడమీకి రూ.5లక్షల జరిమానా విధిస్తున్నట్లు వెల్లడించింది. ఈ అకాడమీ ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉండగా.. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో దీనికి కోచింగ్ సెంటర్లు ఉన్నాయి.

హసీనాను అప్పగించండి

- ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుదలకు తోడ్పడండి
- భారత్‌కు బిఎన్‌పి విజ్ఞప్తి

ఢాకా: బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాను తిరిగి వెనక్కి పంపించడం ద్వారా భారత్, బంగ్లా దేశ్ మధ్య సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలకాలని మితవాద బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) ప్రధాన కార్యదర్శి జనరల్ మీర్జా ఫక్రుల్ అలంగీర్ చెప్పారు. ఆదివారం నాడు పార్టీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా షేర్-ఎ-బంగ్లా నగర్‌లోని జియావుల్ రహ్మాన్ సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, భారత్‌తో బలమైన సంబంధాలను తమ పార్టీ కోరుకుంటోందన్నారు. బంగ్లాదేశ్ గడ్డపై భారత్‌కు ముప్పు కలిగించే ఎలాంటి కార్యకలాపాలను బిఎన్‌పి ఎప్పటికీ అనుమతించడదని ఆయన చెప్పారు. బిఎన్‌పి అధికారంలోకి వస్తే అదానీతో హసీనా ప్రభుత్వం కదుర్చుకున్న విద్యుత ఒప్పందాన్ని పునస్సమీక్షిస్తామని చెప్పారు. ఈ ఒప్పందం బంగ్లా దేశ్ ప్రజలపై తీవ్ర విద్యుత్ భారాలను మోపుతోందని, బంగ్లా ప్రజల్లో కూడా దీనిపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అదే సమయంలో స్వేచ్ఛామార్కెట్ ఆర్థిక సంస్కరణలను తాము విస్తృతంగా అమలు చేస్తామన్నారు. హసీనాకు ఆశ్రయం కల్పించడం ద్వారా భారత్ బంగ్లా దేశ్ ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడంలో విఫలమైందని అలంగీర్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీల భద్రత గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఇది తమ అంతర్గత విషయం అన్నారు. హిందువులపై దాడులకు సంబంధించిన వార్తలు కచ్చితమైనవి కావన్నారు. వీటిలో చాలా ఘటనలు మత పరంగా జరిగినవి కావు, కేవలం రాజకీయ ప్రేరేపితమైనవి మాత్రమేనని ఆయన సెలవిచ్చారు. హసీనాను బంగ్లాదేశ్‌కు తిరిగి అప్పగించకపోతే భారత్‌తో సంబంధాలు మరింత క్షీణిస్తాయని ఆయన హెచ్చరించారు. హసీనా , ఆమె పాలనలో చోటు చేసుకున్న నేరాలు, అవినీతికి బంగ్లాదేశ్ చట్టాల ప్రకారం ఆమె విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీనిని ప్రారంభించాలంటే అమెను బంగ్లాదేశ్‌కు తిరిగి అప్పగించేందుకు భారత్ చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అసాధారణమైన ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఆగస్టు5న పతాక స్థాయికి చేరుకోవడంతో ప్రధాని హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వీడి భారత్‌కు పారిపోయారు.

బీఫ్ పేరుతో నన్ను కొట్టారు

- రైలు నుంచి తోస్తామని బెదిరించారు
- మా ఇంట్లో మహిళలపై లైంగికదాడి చేస్తామని హెచ్చరించారు
- థానే రైలులో బీఫ్ ఘటనపై బాధితుడి ఆవేదన
- ఘటనకు సంబంధించిన వీడియో వైరల్



ముంబయి : బీఫ్‌ను తీసుకెళ్తున్నాడన్న అనుమానంతో గతనెల 28న మూక చేతిలో దాడికి గురైన 72 ఏండ్ల హాజీ అశ్రఫ్ అలీ సయీద్ హుస్సేన్ అప్పటి ఘటన గురించి వివరించాడు. నిందితులు తనపై దాడికి దిగారనీ, కడుపులో పిడిగుద్దులు గుద్దారని చెప్పాడు. తాను ఎంత చెప్తున్నా వినకుండా తనను దూషించారని, తన ఇంట్లోని మహిళలపై లైంగికదాడి చేస్తామని కూడా వారు బెదిరించారని సయీద్ హుస్సేన్ తెలిపాడు. థానే రైలులో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. ఈ వీడియో, బాధితుడి నుంచి అందిన వివరా ప్రకారం.. తమ శ్రావణ మాసం కొనసాగుతున్నదనీ, ఈ సమయంలో బీఫ్ తీసుకెళ్తున్నావని బాధితుడిని నిందిత యువకులు దూషిస్తూ, దాడికి దిగారు. బజరంగ్‌దళ్‌ను పిలిపించి చంపించేస్తామని కూడా బెదిరించారు. వృద్ధుడి అనే కనికరం కూడా చూపకుండా, ఆయన చెప్పేది కూడా వినకుండా సదరు యువకులు రైలులో నానా హంగామా సృష్టించారు. మాంసాన్ని ఎవరి కోసం తీసుకెళ్తున్నావని అడుగుతూ బూతులు వెళ్లగక్కారు. బాధితుడి ఇంటిలోని మహిళలపై లైంగికదాడి చేస్తామని బెదిరించారు. సదరు మూక నుంచి నలుగురు యువకులు బాధితుడిని కడుపులో గుద్దారు. తాను తీసుకెళ్లేది బీఫ్ కాదని ఎంత చెప్పినా వినకుండా నిందితులు బాధితుడిని ఇబ్బందులకు గురిచేశారు. కాగా, నిందితులలో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

నా బట్టలు చించేశారు

రైలులో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని అశ్రఫ్ గుర్తు తెచ్చుకున్నాడు. చలీస్‌గావ్‌కు చెందిన అశ్రఫ్.. ప్రస్తుతం ముంబయిలోని ఒక ఆస్పత్రిలో చేరాడు. నిందితులు తనపై మొఖం, కండ్లపై దాడులు చేసి, దూషణలకు దిగటమే కాకుండా తన బట్టలను కూడా చించేశారని చెప్పాడు. అలాగే, తన ఫోన్‌ను, తన జేబులో ఉన్న రూ.2800 కూడా వారు లాక్కున్నారని తెలిపాడు. నడుస్తున్న రైలు నుంచి బయటకు తోసేస్తామని కూడా బెదిరించారని చెప్పాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు గతనెల 31న ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఆ రోజుల జరిగిన విషయాలను అశ్రఫ్ వివరించగా.. పోలీసులు వాటిని ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చారు. ఈ ఘటనపై ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీ) దర్యాప్తును ప్రారంభించింది. ఈ ఘటనలో భాగమైన కొందరు నిందితులను గుర్తించింది. అశ్రఫ్‌ను సైతం ప్రశ్నించినట్టు పోలీసు అధికారులు తెలిపారు. కాగా, అరెస్టయినవారిపై న్యాయపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. సీసీటీవీ, వైరల్ వీడియోను పరిశీలస్తున్నామని చెప్పారు. కాగా, వైరల్ వీడియోలో ఉన్న ఒక వ్యక్తి ఆషు అవ్‌హద్‌గా గుర్తించారు. అతని ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను బట్టి చూస్తే ఆయన స్పెషల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ (ఎస్‌పీఆర్ఎఫ్)అధికారి కుమారుడిగా తెలుస్తున్నది. అయితే, ఈ దాడిలో పాల్గొన్నవారు ముంబయిలో పోలీసు పరీక్ష రాయటానికి వెళ్తున్నట్టు సమాచారం. ఎఫ్ఐఆర్ నమోదు చేయటానికి అశ్రఫ్‌కు సహకరించిన ఎస్‌డీపీఐ సభ్యుడు సర్ఫరాజ్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలో ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

గోదావరి ఎక్స్‌ప్రెస్ సహా 19 రైళ్లు రద్దు

- నీటిలో కొట్టుకుపోయిన పట్టాలు



అమరావతి : ఎడతెరపిలేకుండా లేకుండా కురుస్తోన్న భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. ఈ వర్షాల ప్రభావానికి ఇప్పటికే పెద్ద సంఖ్యలో రైళ్ల రద్దు కాగా.. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. తాజాగా గోదావరి ఎక్స్‌ప్రెస్ సహా 19 రైళ్లను రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఆదివారం సర్వీసులందించనున్న హైదరాబాద్- విశాఖ- హైదరాబాద్ (12728/12727) గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు మొత్తం 19 రైళ్లను రద్దు చేస్తున్నట్టు తాజా బులిటెన్ విడుదల చేసింది. అలాగే, భారీ వర్షాలకు పట్టాలపై వరదనీరు చేరడంతో 15 రైళ్లను దారిమళ్లిస్తున్నట్టు పేర్కొంది. సికింద్రాబాద్-భువనేశ్వర్ మధ్య సర్వీసులందించే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016) రైలును 4.50 గంటలకు బదులుగా సాయంత్రం 6.50 గంటలకు రీషెడ్యూల్ చేసినట్టు తెలిపింది. మరోవైపు, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తాజా పరిస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. రైలు సర్వీసుల పునరుద్ధరణ, భద్రతాపరమైన చర్యలకు సంబంధించి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ వద్ద సమీక్షించారు. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న వేళ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్టు అధికారులు తెలిపారు

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- కేంద్రానికి లేఖ రాస్తాం : సిఎం చంద్రబాబు

అమరావతి: రాష్ట్రంలో నెలకొన్న వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సోమవారం లేఖ రాస్తామని ప్రజాశక్తి ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న వరదల నేపథ్యంలో తాడేపల్లిలోని విపత్తు నిర్వహణ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆదివారం తొలుత సమీక్ష నిర్వహించారు. అనంతరం విజయవాడలోని సింగ్‌నగర్ ప్రాంతంలో నీటమునిగిన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు కార్యాలయం, అంతకుముందు విపత్తు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పరిస్థితిపై కేంద్ర హోంశాఖ మంత్రితో మాట్లాడానని చెప్పారు. 10 ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు, 40 పవర్ బోట్లు, 10 హెలికాప్టర్లు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని హెలికాప్టర్ ద్వారా తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా వరదలు సంభవించాయని చెప్పారు. అకాల వర్షాలు, పై నుంచి వస్తున్న వరద నీరు వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. 1998లో ఈ తరహా వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో 9.24 లక్షల క్యూసెక్కులు వస్తే, ఇప్పుడు 9.70 లక్షల క్యూసెక్కులు వచ్చాయని వివరించారు. ఈ విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. బుడమేరు వాగు తెగడంతో 16 డివిజన్లు నీట మునిగాయని చెప్పారు. నీటిలో చిక్కుకున్న వారి కోసం ఆహారం తయారు చేయాలని అక్షయపాత్ర, హోటల్ యాజమాన్యాలను సంప్రదించామని తెలిపారు. విజయవాడలోని అన్ని కళ్యాణ మండపాలు, హోటళ్లు అందుబాటులో పెట్టామని, అవసరమైతే ఇంకా ఏర్పాటు చేస్తామన్నారు. సింగ్‌నగర్‌లో పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రతి డివిజన్‌కు ఒక సీనియర్, సచివాలయానికి జూనియర్ ఐఎఎస్ అధికారులను నియమిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో 2,76,145 మంది ప్రజలు ఉన్నారని తెలిపారు. బాధితుల సహాయం కోసం కమాండ్ కంట్రోల్ నెంబర్లు 112, 107 ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి విపత్తులు రాకుండా చర్యలు చేపడతామని ప్రకటించారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఉండి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, డిజిపి ద్వారకా తిరుమలరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు సృజన పాల్గొన్నారు. ఆదివారం రాత్రి 11 గంటల తరువాత చంద్రబాబు మరోసారి సింగ్‌నగర్ ప్రాంతంలో పర్యటించారు.

ముఖ్యమంత్రికి ప్రధాని మోడీ ఫోన్

రాష్ట్రంలో వరద పరిస్థితులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆదివారం రాత్రి ఫోన్ చేశారు. పరిస్థితులను ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని మోడీ చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన సహాయం చేయాలని ఆయా శాఖలకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు.

ప్రకాశం బ్యారేజికి పోటెత్తిన వరద

- 10.10 లక్షల క్యూసెక్కుల నీరు రాక
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ



గుంటూరు : భారీ వర్షాల నేపథ్యంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజీకి గంటగంటకు వరద పోటెత్తడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. బ్యారేజీకి ఎగువ నుంచి 10.10 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు జలవనరుల శాఖ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా సాగర్, పులిచింతల నుంచి విడుదల చేస్తున్న నీటితోపాటు కృష్ణా జిల్లాలోని మున్నేరు, బుడమేరు నుంచి 3.27 లక్షల క్యూసెక్కుల నీరు అదనంగా ప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీ 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు ఎగువ నుంచి 6.36 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా మొత్తం 24 గేట్లు ఎత్తి 6.02 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి వచ్చే 6.02 లక్షల క్యూసెక్కుల నీటితోపాటు ప్రకాశం బ్యారేజీ ఎగువన వాగుల ద్వారా, క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన అతిభారీ వర్షం వల్ల మరో 3.27 లక్షల క్యూసెక్కుల నీరు రావడంతో ప్రకాశం బ్యారేజీకి ఆదివారం ఒకేసారి 9.71 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో ప్రకాశం బ్యారేజీ పరిసర ప్రాంతాలన్ని ముంపునకు గురవుతున్నాయి. సోమవారం నాటికి ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ మండలాల పరిధిలో 50 గ్రామాలు ముంపు బారినపడ్డాయి. మరోవైపు ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 5.30 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 5 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద పోటెత్తింది. సాగర్‌కు 4.83 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు డ్యామ్‌కు ఉన్న 26 గేట్ల ద్వారా 5.16 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

కృష్ణాకు 11 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం

ఎగువన కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కృష్ణా నదిలో 9.25 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వుందని, ఈ ప్రవాహం 10.5 నుండి 11 లక్షల క్యూసెక్కులకు పెరిగే ప్రమాదం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా వుండాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా నది వరద ప్రవాహం ఉధృతంగా వున్నందున ఎన్‌టిఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 9.25 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని, 10.5 లక్షల నుంచి 11 లక్షల క్యూసెక్కులు వరకు వరద చేరే అవకాశం ఉందని అన్నారు.

అంగట్లో లైంగికదాడులు

గతనెల పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఒక జూనియర్ డాక్టర్‌పై జరిగిన లైంగికదాడి, హత్య ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ దారుణ ఘటనకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపట్టారు. వైద్యులైతే విధులను బహిష్కరించి ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయం కోసం డిమాండ్ చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీలు జరిపారు. కఠిన చర్యలకు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నా.. పోర్న్ వీడియోలను పొందాలన్న కొందరు నెటిజన్ల తీరులో మాత్రం ఎలాంటి మార్పూ కనబడటం లేదు. దేశంలో లైంగికదాడి ఘటనలు ఏవైనా సంభవిస్తే చాలు.. సదరు ఘటనకు సంబంధించిన వీడియోల కోసం ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయటం అలవాటుగా మారిపోతున్నది. కొందరు దుర్మార్గులైతే ఆ ఘటనలకు సంబంధించిన వీడియోలతో పాటు ఇతర లైంగికదాడి దృశ్యాలు, పోర్న్ వీడియోలు అమ్మకానికి ఉన్నాయంటూ సామాజిక మాధ్యమాలలో సందేశాలు పంపుతున్నారు.

- వాటితో పాటు ఇతర అశ్లీల వీడియోలు
- 'సంచలనాత్మక' కేసుల వీడియోల కోసం ఆన్‌లైన్‌లో సెర్చింగ్
- సోషల్ మీడియా యాప్‌లతో రెచ్చిపోతున్న దుర్మార్గులు



న్యూఢిల్లీ : భారత్‌లో సాధారణంగా ఏదైనా దారుణ లైంగికదాడి ఘటన జరిగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగుతాయి. మొన్నటి ఢిల్లీ నిర్భయ నుంచి నిన్నటి కోల్‌కతా అభయ వరకు ఇదే తీరు కనిపించింది. అయితే, అదే సమయంలో సదరు ఘటనలకు సంబంధించిన వీడియోల కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్నవారి సంఖ్య కూడా పెరగటం గమనార్హం. ఆ ఘటనలకు సంబంధించిన వీడియోలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయని అమ్మకానికి కూడా పెడుతున్నారు కొందరు. ఇలా లైంగికదాడి ఘటనల వీడియోలు అమ్మే ఘటనలు కొత్తేమీ కాదనీ, గతంలో సీడీలు, పెన్‌డ్రైవ్‌ల ద్వారా సాగేవనీ, ఇప్పుడు సోషల్ మీడియా వినియోగం పెరగటంతో అమ్మకందారులు ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్ల వైపు మళ్లారని పోలీసు అధికారులు తెలుపుతున్నారు. ఒక్కసారి సదరు వీడియోలు ఆన్‌లైన్‌లో విడుదలైతే.. వాటికి అదుపు అనేది ఉండదనీ, ప్రస్తుత సోషల్ మీడియా ప్రపంచంలో వీటికి అడ్డుకట్ట వేయటం చాలా కష్టమని కొందరు టెక్ నిపుణులు అంటున్నారు. ఒక సైట్‌ను బ్లాక్ చేసినా.. మరొక రూపంలో వీడియోలు బయటకు వస్తున్నాయని చెప్తున్నారు. దీంతో వీడియోలు కావాలనుకునేవారు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసి, సోషల్ మీడియా యాప్‌ల ద్వారా వీడియో కంటెంట్‌ను అందుకుంటున్నారని తెలుపుతున్నారు.

కోల్‌కతా అభయ కేసు కావచ్చు.. కర్నాటకలో ప్రజ్వల్ రేవణ్ణ లైంగికదాడుల కేసు కావచ్చు.. మణిపూర్‌లో మహిళను నగ్నంగా ఊరేగించిన ఘటన కావచ్చు.. ఇలా ఏదైనా ఘటన బయటకు వచ్చి సంచలనంగా మారితే చాలు.. వెంటనే సదరు కేసు గురించిన లైంగికదాడి వీడియోలను ఆన్‌లైన్‌లో వెతకటం దేశంలో పరిపాటిగా మారిపోయిందని విశ్లేషకులు చెప్తున్నారు.

అయితే, ఇలా ఆన్‌లైన్‌లో సదరు వీడియోలను పొందాలనే కుతూహలం ప్రజల్లో పెరిగిపోవటం రెండు విధాలుగా ఉంటుందని మానసిక నిపుణులు చెప్తున్నారు. ఒకరు ఘటన గురించి తెలుసుకోవాలన్న ఆతృతతో, మరొకరు పోర్న్ వ్యసనంగా మారటంతో సంచలనంగా మారిన వీడియోల గురించి సెర్చ్ చేస్తున్నారని అంటున్నారు. అయితే, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 294 ప్రకారం ఇలాంటి వీడియోల అమ్మకాలపై చర్యలుంటాయని న్యాయ నిపుణులు చెప్తున్నారు. ఈ సెక్షన్ కింద అలాంటి వీడియోల అమ్మకం, కొనుగోలు నిషేధమని వారు అంటున్నారు. అయితే, కొన్ని సోషల్ మీడియా యాప్‌ల ఆధారంగా ఈ వీడియోల అమ్మకం జరుగుతున్నదనీ, దీంతో అమ్మకానికి పెట్టిన వ్యక్తులను ట్రాక్ చేయటం కష్టంగా మారుతున్నదని కొందరు టెక్ నిపుణులు చెప్తున్నారు. లైంగికదాడి ఘటనలకు సంబంధించిన అన్ని వీడియోలు వాస్తవికమైనవని చెప్పలేమని కూడా వారు అంటున్నారు.

జీవో నెం.46పై వ్యతిరేకత

- ప్రభుత్వాల తీరును నిరసిస్తూ నిరుద్యోగి మండిపాటు



నవతెలంగాణ-వాజేడు

జీవో నెంబర్ 46వల్ల తనకు రావాల్సిన కానిస్టేబుల్ ఉద్యోగం రాకుండా పోయిందని నిరుత్సాహంతో నిరుద్యోగి కానిస్టేబుల్ ఈవెంట్స్ సాధించిన మెరిట్‌లిస్టును తగలబెట్టి నిరసన తెలిపిన ఘటన వాజేడు మండలంలో చోటు చేసుకుంది. ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన ఎట్టి నాగప్రకాష్.. 2022 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ ఉద్యోగానికి అన్ని అర్హతలు సాధించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 46 వల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా పోయాయాని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 46 బాధితుల్లో తాను ఒకడిని అని, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వల్ల ఉద్యోగం కోల్పోయానని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పాలన ముగిసే వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే ఎలాంటి ఉద్యోగ పోటీల్లో పాల్గొనని ప్రభుత్వంపై తీవ్రమైన నిరుత్సా హంతో తను సాధించిన ఉద్యోగ మెరిట్ పత్రాలను తగలబెట్టాడు. ఈ ఘటనతో నిరుద్యోగుల్లో ప్రభుత్వాలపై ఎంతటి అసంతృప్తి ఉందో అర్థమవుతుంది.

నష్టపోయిన వారిని ఆదుకోండి

- ముంపు ప్రాంతాలను పరిశీలించిన సీపీఐ(ఎం) ఏపీ బృందం



గుంటూరు : గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అన్ని రకాల పంటలు దెబ్బతినడమే కాకుండా, పేదలు నివసిస్తున్న కాలనీలు నీట మునిగిపోయాయని, పేదలు ఉపాధి కోల్పోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను, పేదలను ఆదుకోవాలని సీపీఐ(ఎం) గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం పెదకాకాని, గొళ్ళపూడి, నంబూరు, మంగళగిరి మండలంలోని కాజ గ్రామాల్లో సీపీఐ(ఎం) ఏపీ బృందం పర్యటించింది. పొలాలను, నీటమునిగిన నివాస ప్రాంతాలను పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు, స్థానిక ప్రజలు పలు సమస్యలను ఈ బృందం దృష్టి తెచ్చారు. ఇప్పటికే ఎకరానికి వరి పంటకు రూ.30 వేలు ఖర్చు చేశారని, అధిక వర్షాలకు పంట కాల్వలు, చెరువులు తెగిపోయి నీరంతా పొలాలపై ప్రవహిస్తుందని, పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పంట పూర్తిగా మునిగిందని తెలిపారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదముందన్నారు. నీళ్ల ఇళ్లల్లోకి వచ్చి ఇంట్లోని వస్తువులన్నీ మునిగిపోయాయని, వంట సరుకులు పూర్తిగా తడిచిపోయాయని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని, 50 కిలోల బియ్యం, నూనె, చింతపండు వంటి సరుకులను తక్షణమే అందించి సహాయం చేయాలని అధికారులను కోరారు. వ్యవసాయ శాఖ వెంటనే పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. సహాయ శిబిరాలలో ఉన్న వారికి సరైన వసతులు కల్పించాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించాలని, మంచి నీటిని క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, పార్టీ నాయకులు నన్నపనేని శివాజి, బి.కొటేశ్వరి, సత్యమారెడ్డి, గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన వరద సహాయక చర్యలు చేపట్టాలి

- రాష్ట్ర ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాజకీయాలకతీతంగా ప్రజలకు యుద్ధ ప్రాతిపదికన వరద సహాయక చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయడంతో పాటు పరిస్థితులను ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ఏజెన్సీ, ముంపు ప్రాంతాల్లో ఉన్న గర్భిణీలను గుర్తించి ఆస్పత్రులకు తరలించాలని కోరారు. పాటు కాటు, విద్యుత్ షాక్‌లకు గురైన వారికి తక్షణ వైద్య సేవలందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించి, అత్యవసర సాయం అందించేందుకు హెలికాప్టర్లు సిద్ధం చేసుకోవాలన్నారు.

వరద బాధితుల కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, తాగునీరు వైద్య సేవలందించాలని కోరారు. విపత్తులో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు, గాయపడ్డ వారికి రూ 5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని కోరారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోవటం అత్యంత బాధాకరమనీ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియ జేశారు.

ఏపీలోని పలు జిల్లాల్లో కుండపోత

- శ్రీశైలం ఘాట్‌రోడ్డులోవిరిగిపడిన కొండ చరియలు
- పెసర్లంక అరవింద్ వారధి వద్ద కృష్ణానదికి గండి
- ఏజెన్సీలో ఉప్పొంగిన వాగులు, గెడ్డలు
- ఆంధ్ర- ఒడిశా-ఛత్తీస్‌గఢ్‌కు నిలిచిన రాకపోకలు





విజయవాడ : వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి కర్నూలు, ఏలూరు, విశాఖలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. పలు వాగులకు గండ్లు పడ్డాయి. లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 37.49 అడుగులకు చేరింది. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎడతెరపి లేని వర్షం కురిసింది. కర్నూలు ప్రధాన రహదారులపై వర్షపు నీరు ఏరులై ప్రవహించింది. ఆదోనిలో అవుదూడ వంక, రాంజల వంక ఉధృతంగా ప్రవహించడంతో పలు కాలనీల్లోకి వరద నీరు చేరింది. చిప్పగిరి మండలంలో పంట పొలాలు నీట మునిగాయి. రుద్రవరం మండలం చిలకలూరు వాగు, నంద్యాల మండలంలో కుందూ నది, మద్దిలేరు, సంకలవాగు పొంగి పొర్లుతున్నాయి. శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగి పడుతుండటంతో హైదరాబాద్ నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. చాగలమర్రి మండలంలో వక్కిలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఏలూరు జిల్లాలో వరద బీభత్సం సృష్టించింది. నూజివీడు పెద్ద చెరువుకు గండి పడడంతో నూజీవీడు పరిసర ప్రాంతాలు వరద తాకిడికి గురయ్యాయి. వరద నీటిలో చిక్కుకున్న పలువురిని సురక్షిత ప్రాంతాలకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. రామిలేరు వరద తాకిడికి పెదపాడు మండలం అప్పన్నవీడు గ్రామంతోపాటు పలు ప్రాంతాలు నీట మునిగాయి. బొమ్ములూరు, కలపర్రు మధ్య 16 నంబరు జాయతీ రహదారిపై రామిలేరు వరద నాలుగు అడుగుల మేర ప్రవహించడంతో అధికారులు అప్రమత్తమై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో అటు కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి విజయవాడ వైపు ఇటు ఏలూరు జిల్లా కలపర్రు టోల్ గేటు నుంచి దెందులూరు మండలం సత్యనారాయణపురం వరకూ భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. వరద ఉధృతి తగ్గిన అనంతరం వాహనాల రాకపోకలకు అనుమతించారు. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఏజెన్సీలో వాగులు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చింతూరు మండలంలో జాతీయ రహదారిపైకి నీరు చేరడంతో ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విఆర్.పురంలో కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించడంతో 40 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. విలీన మండలాల్లో శబరి, గోదావరి నదుల్లో ప్రవాహ ఉధృతి పెరిగింది. ఆదివారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 37.49 అడుగులకు చేరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. బాపట్ల జిల్లా పెసర్లంక అరవింద్ వారధి వద్ద కృష్ణానదికి గండి పడింది. కట్ట తెగిన కారణంగా కొల్లూరు మండల పరిధిలోని కృష్ణా నదీపరివాహక ప్రాంతాలైన పెసర్లంక, గాజుల లంక, ఆవులవారిపాలెం, పోతర్లంక, తురకపాలెం, తిప్పలకట్ట, జువ్వలపాలెం గ్రామాలు ముంపునకు గురయ్యాయి. గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు